తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 13.06.2026 | సంపుటి : 12 సంచిక : 324 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






ఒక్కో వాహనానికి

## 200 లీటర్లకు మించొద్దు

**పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం**
**ముడిచమురు సరఫరాలో అంతరాయం నేపథ్యంలో నిర్ణయం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై మిగతా 2లో..

## తెలంగాణపై కేంద్రం వివక్ష



**రాష్ట్రాభివృద్ధిని కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నాడు**

- రాష్ట్రం కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదు
- కేటీఆర్ చెప్పినట్లల్లా ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నాడు
- తెలంగాణలో ఎవరైనా రాజకీయం చేసుకోవచ్చు
- శాంతిభద్రతల కారణంగానే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ సభకు నిరాకరణ
- మీనాక్షి సీట్ చోరీకి బీజేపీ కుట్ర రాజకీయాలు
- ఈ వ్యవహారంలో ఆర్వో బీజేపీ కార్యకర్తలా వ్యవహరించారు
- బీజేపీ నేతలు కిమ్‌లా ప్రవర్తిస్తున్నారు
- ఓట్ చోరీ.. లేకుంటే సీట్ చోరీ
- ఇదే మాత్రమే బీజేపీకి తెలుసు
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్
- కాంగ్రెస్ నేత రాహుల్‌తోనూ సీఎం భేటీ

**ప్రజాస్వామ్యవాదులకు హిట్లర్ ఎట్లా ఆదర్శమవుతారు?**
**నా వ్యాఖ్యలను వక్రీకరించారు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉం దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడైనా రావచ్చు..పోవచ్చన్నారు. ఇందుకు పవన్ కళ్యాణ్ అతీతుడు కాదన్నారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా మా ట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అను మతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పు డూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం లో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగి లించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేం ద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపిం చారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని మరోమారు కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మిగతా 2లో..

> తెలంగాణకు వచ్చివెళ్లేందుకు, పోటీ చేసేందుకు జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు పూర్తి స్వేచ్ఛ ఉంది. అయితే ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్‌పై మంత్రులు మాట్లాడారు. శాంతి భద్రతల కారణంతోనే పవన్ ఇటీవల తలపెట్టిన మీటింగ్‌కు అనుమతి ఇవ్వలేదు. అయితే ఆంధ్రాలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. దీనిపై పవన్ సమాధానం చెప్పాలి. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోంది. కేటీఆర్ చెప్పినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారు. మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డితో మాట్లాడి అడ్డుకున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. రీజినల్ రింగ్ రోడ్డును కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. రాష్ట్రంలో పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణం. ఆయన ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలి. ఎవరి వద్ద తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 4 మండలాలను ఏపీలో కలిపారని, అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా.. ?
>
> **- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

## సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులివ్వండి

**ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రికి మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి**

- సమ్మక్క సాగర్ ముంపు ప్రభావంపై ఐఐటీ రూర్కీతో అధ్యయనం చేయిస్తున్నాం
- ఆ నివేదిక వచ్చాక నిర్ణయం తీసుకుంటాం: ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్‌సాయ్
- రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యం
- ఇరు రాష్ట్రాల మధ్య సమన్వయంతో ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకుంటాం:మంత్రి ఉత్తమ్



హైదరాబాద్(జనంసాక్షి):సమ్మక్క సాగర్ – తుపాకులగూడెం ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి నిరభ్యంతర పత్రం ఇవ్వాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్‌సాయ్‌ని రాష్ట్ర నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరోమారు కోరారు. హైదరాబాద్ వచ్చిన ఛత్తీస్‌గఢ్ సీఎంకు స్వాగతం పలికిన ఉత్తమ్ సమ్మక్క సాగర్ విషయమై వినతిపత్రం అందించారు. గత సెప్టెంబర్‌లో ఛత్తీస్‌గఢ్ రాజధాని న్యూ రాయ్‌పూర్‌లో విష్ణుదేవ్ సాయ్‌ని మంత్రి ఉత్తమ్ కలిశారు.సమ్మక్క సాగర్ విషయమై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయ్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్ చర్చించారు. ప్రాజెక్టు కారణంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ముంపునకు గురయ్యే భూములకు 2013 భూసేకరణ చట్టం లేదా గంపగుత్తగా జీఓల ఆధారంగా మిగతా 2లో..

## రుతుపవనాలపై ఎల్‌నినో శరాఘాతం

- ఈ సారి వర్షాలు తక్కువే
- వాతావరణ విభాగం హెచ్చరిక



12లో..

## యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు




వార్త 2 లో

పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహణ • తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం

## నీరు నిలిస్తే బాధ్యత మాదా?

- మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉంది
- సీఎంతో నాకు వ్యక్తిగత పంచాయితీ లేదు
- ఎవరితోనూ పొత్తులుండవ్.. పోటీ భాజపాతోనే
- డీలిమిటేషన్‌లో దక్షిణాది వాటా తగ్గితే ఊరుకోం
- మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా? : కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** సీఎం రేవంత్‌రెడ్డితో తనకు వ్యక్తిగత పంచాయితీ లేదని.. ప్రభుత్వాన్ని నడుపుతున్న విధానం తనతో సహా చాలా మందికి నచ్చడంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మిగతా 2లో..



## కాంగ్రెస్‌కు ఈసారి డిపాజిట్లు గల్లంతే..

**ఇతర రాష్ట్రాల్లోలాగే తెలంగాణలోనూ హస్తం ఖతం : హరీశ్ రావు**

**కరీంనగర్,జూన్12(జనంసాక్షి):**రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు హెచ్చరించారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం కోల్పోయాయని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అదే జరగబోతోందని అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో మిగతా 2లో..

## 'తిరస్కరణ'పై పిటిషన్ కొట్టివేత

**మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట**

**ఎన్నికలయ్యాక హైకోర్టును ఆశ్రయించాలని ధర్మాసనం సూచన**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ కొనసాగుతు న్నందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు మిగతా 2లో..



## ఓట్ల వేటలో కేంద్రం దొంగదారి

**'సర్' ప్రక్రియ.. ఓ భూతం లాంటిది**
**కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఓట్ల తొలగింపునకు కుట్ర**

- బీహార్, బెంగాల్ ఫార్ములాను దేశమంతటా ప్రయోగిస్తున్నారు
- చట్టం ముసుగులో దెబ్బకొట్టే యంత్రం : మంత్రి పొంగులేటి



**ఖమ్మం(జనంసాక్షి):**ఎస్ఐఆర్ సర్ అనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్‌ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ది పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవ దని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు. తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగి లించా రని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో మిగతా 2లో..

## ముగ్గురు భారత నావికులు మరణిస్తే మోదీ స్పందించరేం?

**ప్రధాని అమెరికాకు లొంగిపోయాడు: రాహుల్**



న్యూఢిల్లీ(జనంసాక్షి):గతవారం అమెరికా బలగాలు ఒమన్ తీరం వద్ద ఉన్న 'సెట్టెబెల్లో' నౌకపై చేసిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందారు. ఈ ఘటనపై ప్రధాని మౌనం వహించడంపై శుక్రవారం లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, 'అంతర్జాతీయ జలాల్లో మూడు నౌకలపై అమెరికా జరిపిన దాడుల్లో మూడు రోజుల్లోనే ముగ్గురు భారతీయులు మరణించారు. అమెరికాకు లొంగిపోయిన మన ప్రధాని మాత్రం ఇప్పటివరకు ఈ ఘటనపై ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఏదైనా విదేశీ శక్తి ఒక భారతీయుడిని హత్య చేసినప్పుడు ప్రధాని స్పందించాలి. కానీ, ఆయన ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దురదృష్టకరం. మన నావికుల్ని హత్య చేసిన కొద్దిరోజులకే.. అంటే వచ్చేవారమే జి7 సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో మోడీ గారు చిరునవ్వు చిందిస్తూ.. ఆలింగనం చేసుకుంటూ.. ఒప్పందాలపై సంతకాలు మిగతా 2లో..

## పశ్చిమాసియాలో శాంతి పవనాలు

**ఇరాన్‌తో డీల్ కోసం మెత్తబడిన ట్రంప్**
**'యురేనియం'పై మెట్టు దిగిన అమెరికా అధ్యక్షుడు**



**వచ్చే వారం అమెరికా ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందం ఖరారయ్యే అవకాశం**

**వాషింగ్టన్(జనంసాక్షి):**ఇరాన్‌తో డీల్ దాదాపు కొలిక్కివచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. గతంలో కూడా ఆయన పలుమార్లు ఇలాంటి ప్రకటనలు చేసినప్పటికీ.. ఈసారి మాత్రం ఒప్పందం ఖరారయ్యే సంకేతాలే కన్పిస్తున్నాయి. ఇందుకోసం ట్రంప్ ఓ మెట్టు దిగి మరీ ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈమేరకు అమెరికా విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా సంస్థ సంచలన కథనం వెల్లడించింది. ఇరాన్‌లో శుద్ధి చేసిన యురేనియం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ దేశం చేతుల్లో ఉండొద్దని ట్రంప్ గత కొంతకాలంగా డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. దాన్ని అమెరికాకు అప్పగించాలని లేదంటే నాశనం చేయాలని ఆయన అంతకుముందు చెప్పారు. అయితే, తాజా చర్చల్లో దీనిపై ట్రంప్ కాస్త తగ్గినట్లు తెలుస్తోంది. శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్‌లోనే ఉంచేందుకు ఆయన అంగీకరించినట్లు సమాచారం. అయితే, అది ఐరాస ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలోనే ఉండాలని మెలిక పెట్టారట. ఇక, అణు కార్యక్రమాలపై టెహ్రాన్ ఎలాంటి చర్యలు చేపట్టాలన్నా.. అది అమెరికాతో రెండో డీల్ కుదిరిన తర్వాతేనని ట్రంప్ షరతు విధించినట్లు తెలుస్తోంది.

**డీల్ ప్రతిపాదనలు ఇవేనా..?**

తాజా అవగాహన ఒప్పందంలో భాగంగా 30 రోజుల్లోపు హర్మూజ్ జలసంధిని ఎలాంటి టోల్ రుసుములు లేకుండా నౌకల రవాణాకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనికి ప్రతిగా.. అమెరికా ఈ జలమార్గంలో నిర్బంధాన్ని ఎత్తివేయనుంది. ఇక, హర్మూజ్‌ను తెరిచిన తర్వాత 60 రోజుల పాటు ఇరాన్‌కు మిగతా 2లో..

## హెచ్-1బీపై తగ్గేదిలేదు

**వీసా ఫీజుపై ఫెడరల్ కోర్టు తీర్పుపై సవాల్ చేసేందుకు అమెరికా న్యాయశాఖ చర్యలు**




**వాషింగ్టన్(జనంసాక్షి):**హెచ్–1బీ వీసా ఫీజు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అస్సలు వెనక్కి తగ్గడం లేదు. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇటీవల కొట్టివేసింది. ఈ తీర్పును మిగతా 2లో..

## సుంకాల విధింపులో అమెరికాకు నైతికత లేదు

- పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు సరికాదు
- రష్యాతో చమురు కొనుగోళ్లను సమర్థించిన జైశంకర్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ చెప్పిందని అన్నారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా తమకు స్థిరమైన సరఫరాదారుగా ఉందని కూడా మంత్రి జైశంకర్ తెలిపారు. యూఎస్ మిగతా 2లో..

## పశ్చిమాసియాలో శాంతి పవనాలు

అగ్రరాజ్యం ఆంక్షల మినహాయింపు కల్పించనుందని తెలుస్తోంది. అంటే టెహ్రాన్ చమురు విక్రయాలు చేపట్టేందుకు అనుమతులివ్వనుంది. ఆ తర్వాత ఇరాన్ ప్రవర్తనను బట్టి ఈ మినహాయింపులను మరికొన్ని రోజులు పొడిగించే అంశాన్ని కూడా అమెరికా పరిశీలించనుంది.

నెతన్యాహు ఊసే లేదు..

కాగా.. ఒప్పందంపై ఈసారి చర్చలకు సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఎలాంటి ముందస్తు సమాచారం లేదని సదరు కథనం పేర్కొంది. ఇరాన్‌తో డీల్ విషయంలో ట్రంప్.. ఆయనను దూరం పెట్టినట్లు సమాచారం. దీంతో అమెరికా మిత్రపక్షాలకు ఫోన్ చేసి నెతన్యాహు సమాచారం సేకరించారని అగ్రరాజ్య విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, అవగాహన ఒప్పందం కుదిరిన తర్వాత ట్రంప్.. నెతన్యాహుకు ఫోన్ చేసి విషయం చెప్పారు.

'తిరస్కరణ'పై పిటిషన్ కొట్టివేత

- మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట
- ఎన్నికలయ్యాక హైకోర్టును ఆశ్రయించాలని సూచన

స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన్' దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేస్తూ, మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసుపై కీలక విచారణ జరిపింది. మీనాక్షి నటరాజన్ తరఫున కోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ బలమైన వాదనలు వినిపించారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, ఒక ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన అంశాన్ని కోర్టు ఇంకా పరిగణనలోకి కూడా తీసుకోలేదని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వ్యవహారంలో కేవలం నోటీసు మాత్రమే ఇచ్చారని, అలాంటప్పుడు క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదనే ప్రశ్నే ఉత్పన్నం కాదని ఆయన వాదించారు. రిటర్నింగ్ అధికారి చట్ట విరుద్ధంగా, అత్యంత ఏకపక్షంగా వ్యవహరించి నామినేషన్‌ను తిరస్కరించారని కోర్టుకు విన్నవించారు. అయితే, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను ఉటంకించిన ధర్మాసనం, ఎన్నికల ప్రక్రియ మధ్యలో కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చి చెప్పింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై ఇప్పుడు స్టే ఇవ్వలేమని, బాధితులు ఎన్నికల అనంతరం తగిన హైకోర్టును ఆశ్రయించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో మీనాక్షి నటరాజన్‌కు ప్రస్తుతానికి న్యాయపరమైన ఉపశమనం లభించనట్లయింది.

### అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదు

మాత్రం పరస్పర విరుద్ధ విధానాలను అవలంబించిందని అన్నారు. యూఎస్ నిర్ణయాలకు నైతిక ప్రాముఖ్యాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదని కూడా అభిప్రాయపడ్డారు. అప్పట్లో అమెరికా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించింది. చమురు మార్కెట్ స్థిరత్వం కోసం రష్యా చమురును కొనుగోలు చేయాలని చెప్పింది. ముడి చమురు ధరల లభ్యత, ధరల ఆధారంగా మేము కొనుగోళు 'చేస్తాము' అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తూ ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఒక విలేకరి ఆరోపణపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఆ సమయంలో మార్కెట్‌లో ముడి చమురులో అధిక భాగం రష్యాకు చెందినదేనని అన్నారు. భారత్‌కు ఎంతోకాలంగా ముడి చమురును సరఫరా చేస్తున్న పశ్చిమాసియా దేశాల క్రూడాయిల్ ను ఐరోపా దేశాలు ఎక్కువగా కొనుగోలు చేసేవని చెప్పారు. ఆ పరిస్థితుల్లో తాము తమ దిశను మార్చుకోవాల్సి వచ్చిందని వివరించారు. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నామని మొదట సుంకాలు విధించారు. ఆ తరువాత మళ్లీ వాటిని సడలించారు. కాబట్టి, ఇక్కడ ఏదో గొప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నట్టు భావించకూడదు. ఇది నైతికతకు సంబంధించిన అంశంగా పరిగణించడం అనవసరం అని తేల్చి చెప్పారు.

### ముగ్గురు భారత నావికులు మరణిస్తే మోదీ స్పందించరేం?

చేస్తారు. కానీ చనిపోయిన ఈ ముగ్గురు భారతీయుల గురించి మాత్రం ఆయన ఒక్కమాట కూడా మాట్లాడరు. తమ ప్రాణాలను బలిగొన్న వారిని ఎదిరించే ధైర్యం గానీ, శక్తి గానీ లేని ఒక లొంగిపోయిన ప్రధానమంత్రి 'భారతమాత' బిడ్డలను రక్షించలేరు' అని మోదీ తన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో మోదీని తీవ్రంగా విమర్శించారు.

### ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించొద్దు

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాలిచ్చింది.పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది.

# తెలంగాణపై కేంద్రం వివక్ష

తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూ లంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పా రు. పోలవరం కోసం 5 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా?మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డు ను కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యం గా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి భాజపా కార్యకర్తలా వ్యవహరిం చారని విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుం దని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానిం చారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతా యని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. ఇదిలావుంటే ఢిల్లీలో రాహుల్‌తో సిఎం రేవంత్ భేటీ అ య్యారు. మర్యాదపూ ర్వకంగానే అయనను కలిసినట్లు తెలిసింది.

# సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు అనుమతులివ్వండి

ముందస్తుగా పరిహారం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ఉత్తమ్ వివరించారు. ఛత్తీస్‌గఢ్ అభ్యంత రాలతో ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జలసంఘం ఆమోదించడం చేయడం లేదని అన్నారు. నిరభ్యంతర పత్రం ఇస్తే అనుమతి వస్తుందని తెలిపారు. 83 మీటర్ల ఎత్తుతో 6.7 టీఎంసీల సామ ర్థ్యంతో సమ్మక్క సాగర్ ఆనకట్ట నిర్మించనున్నారు. ఉమ్మడి నల్గొండ, వరంగల్ జిల్లాలో 2.64 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడంతో పాటు రామప్ప - పాకాల లింక్‌లో 30 వేల ఎకరాలకు కొత్తగా సా గునీరు అందించడం ప్రాజెక్టు లక్ష్యమని వెల్లడిం చారు.బ్యారేజి బ్యాక్ వాటర్స్ కారణంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా భూపాలపట్నం తహసీల్ పరిధిలో 54 హెక్టార్లకు పైగా నదీ తీర ప్రాంతం, 19 హెక్టార్లకు పైగా ఇతర భూములు ముంపునకు గురి కానున్నాయి. ఆ రాష్ట్ర చట్టాల ప్రకారం తగిన పరిహారం ఇస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు నిరభ్యంతర పత్రం ఇచ్చేందుకు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి నాడు సూత్రప్రా యంగా అంగీకరించారు. తాజాగా హైదరాబాద్‌కు వచ్చిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని కలిసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఎన్‌వోసీ ఇవ్వాలని తెలంగాణా ప్రభుత్వం తరపున విజ్ఞాపన పత్రం సమర్పించారు. తెలంగాణ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల



మధ్య సమన్వయంతో ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఉత్తర తెలంగాణ రైతాంగానికి సాగునీటి భద్రత కల్పించడంలో సమ్మక్క సాగర్ ప్రాజెక్టు కీలకం అన్న ఆయన వేలాది ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. తెలంగాణలో తుపాకులగూడెం వద్ద నిర్మిస్తున్న సమ్మక్క సాగర్ ముంపు ప్రభావంపై ఐఐటీ రూర్కీతో అధ్యయనం చేయిస్తున్నామని ఛత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ తెలిపారు. ఐఐటీ రూర్కీ నివేదిక వచ్చిన తర్వాత ఎన్‌వోసీపై నిర్ణయం తీసుకుంటామని ఆయన అన్నారు. ఎన్‌వోసీ ఇవ్వాలని రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరిన విషయాన్ని చిట్‌చాట్‌లో విలేకరులు ప్రస్తావించగా విష్ణుదేవ్ సాయ్ ఈ విషయం తెలిపారు. హైదరాబాద్‌లో ఛత్తీస్‌గడ్ ప్రభుత్వం నిర్వహించిన ఇన్వెస్టర్స్ కనెక్ట్ కార్యక్రమంలో విష్ణుదేవ్ సాయ్ పాల్గొన్నారు. సమ్మక్క ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘం నుంచి తుది ఆమోదం లభించాలంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్‌వోసీ తప్పనిసరి. తెలంగాణలోని బీడు భూములు, ఫ్లోరైడ్ ప్రభావిత జిల్లాలైన వరంగల్, నల్గొండలలో తాగు, సాగునీటి అవసరాలు తీర్చడానికి ఈ ప్రాజెక్టు నిర్మాణం కీలకంగా వ్యవహరించనుంది. శ్రీరామసాగర్ రెండో దశ కింద 3.91 లక్షల ఎకరాల ఆయకట్టుకు దీని ద్వారా నీళ్లందుతాయి. రామప్ప-పాకాల లింక్ కాలువ కింద 26 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, జనగామ జిల్లాలకు సాగునీటి భరోసా లభిస్తుంది. ఈ ప్రాజెక్టు కింద బ్యారేజీతో పాటు మూడు పంపు హౌస్‌లు, 90 కిలోమీటర్ల సొరంగాలు, కాలువలు కూడా ఉన్నాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గతంలోనే పేర్కొన్నారు.

## హెచ్-1బీపై తగ్గేదిలేదు

సవాల్ చేసేందుకు అమెరికా న్యాయశాఖ చర్యలు చేపట్టింది. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసు కొన్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే, దీన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ నేతలు ఉన్న రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈ క్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. దీంతో పలు కంపెనీలకు ఊరట కలిగింది. ఈ నేపథ్యంలోనే ఫెడరల్ కోర్టు తీర్పును అప్పీల్ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ అమెరికా న్యాయశాఖ నోటీసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం తాజా చర్యలతో ఈ అంశం మరి కొన్ని నెలల పాటు న్యాయస్థానాల్లో మగ్గనుంది. దీంతో ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్లే.

## ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించొద్దు

నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాలిచ్చింది.పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్విక్రయించకూడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

### కాంగ్రెస్‌కు ఈసారి డిపాజిట్లు గల్లంతే..

నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. . సీఎం రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదని వంద కోట్ల రూపాయిలతో ఇంకో ప్యాలస్ నిర్మించారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ చాలదని ఐదు కోట్ల రూపాయిలతో ఎయిర్ బస్ తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. ఫుట్ బాల్ సోకుల కోసం మెస్సీకి రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. అందాల పోటీల కోసం మరో రూ.100 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి మూటలు పంపటానికి నగదు ఉంటుందని, కానీ విద్యార్థులు, రైతులకు ఇవ్వటానికి మాత్రం డబ్బులు ఉండవా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు చురకలంటించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపి రైతుబంధు నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని.. ఇప్పుడు సీఎం రేవంత్‌కు ఏమైందని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది రైతుబంధు పూర్తిగా ఎగ్గొట్టారు. రెండోసారి మూడు ఎకరాలకు, మూడోసారి రెండెకరాలకే ఇచ్చారు. మొత్తం రూ.20వేల కోట్లు ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని చెబుతున్నారు. కేసీఆర్ క్రమం తప్పకుండా రైతుబంధు ఇచ్చారు.

## యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

హైదరాబాద్(జనంసాక్షి):సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభిం చనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివా దరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవ ర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియా మకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు.

# ఓట్ల వేటలో కేంద్రం దొంగదారి!

అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

**ఓట్లతో పాటు..ఏకంగా సీట్లే దొంగిలిస్తున్నారు!**

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరా జన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతమే సాక్ష్యం..మీనాక్షి నటరాజన్ గారికి కావలసిన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి, ఎన్నికల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్‌ను తిరస్కరింపజేశారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన ఒక రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారు. ఓట్లనే కాదు ఏకంగా సీట్లనే దొంగిలించే దుస్థితికి కేంద్రంలో బీజేపి ప్రభుత్వం దిగజారింది.కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్న సీబీఐ , ఈడీ , ఇన్‌కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని, వేరే పార్టీల తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నారు.

ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ కావాలి..

జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే 'ఓట్ మ్యాపింగ్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించడం జరిగింది. ఉద్యోగాలు, చదువుల రీత్యా ఖమ్మం, హైదరాబాద్‌లలో ఉండే మన వాళ్ళు అధికారులు వచ్చినప్పుడు ఊర్లో లేరనే సాకుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. అధికారులు వచ్చే ముందే గ్రామంలో చాటింపు వేయించి వేరే ఊర్లలో ఉన్న మన ఓటర్లను రప్పించి ఓటు కాపాడుకోవాలి. మనకు దొంగ ఓట్లు అవసరం లేదు.. మనకున్న జనాదరణతో ప్రతి ఓటునూ ఒక కాంక్రీట్ గోడ లాగా కాపాడుకోవాలి. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కాబోయే ప్రధానమంత్రి, మన నాయకుడు రాహుల్ గాంధీకి కార్యకర్తలంతా సైనికుల్లా అండగా నిలబడాలని, ఈ అక్రమ ఎస్ఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పీసీసీ ప్రతినిధి సుధాకర్, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్, ఏదులాపురం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్‌ల బి.ఎల్.ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీరు నిలిస్తే బాధ్యత మాదా?



అన్నారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలో ఉందని.. హైదరాబాద్‌లో వర్షం పడి ప్రజలకు ఇబ్బంది ఎదురైతే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. గతంలో 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. నగరాన్ని అద్దంలా మాకు అప్పగిస్తే.. మేం చెడగొట్టామా? అని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడారు. "బీఆర్ఎస్ హయాంలో వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ) చేపట్టి మెరుగు చేస్తే.. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేశారు. నీళ్లు నిలవకపోతే క్రెడిట్ తీసుకుంటారు.. నిలిస్తే బీఆర్ఎస్‌ది బాధ్యత అంటారా? ఉన్న నగరంపై సీఎంకు అవగాహన లేదు కానీ.. ఫ్యూచర్ సిటీ అని ప్రగల్భాలు పలుకుతున్నారు. రేవంత్ సీఎం కాగానే ఎయిర్‌పోర్టుకు మెట్రోను రద్దు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండి ఉంటే ఈ పాటికే పూర్తయ్యేది. ఆ మెట్రో లైన్ పూర్తయి ఉంటే సమస్య ఇంత ఉండేది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయింది. ఎల్ అండ్ టీ నుంచి మెట్రోను లాక్కోవడం తప్ప చేసిందేంటి? హైడ్రానే అన్నీ చేస్తోందని చెప్పి అధికారాలు ఇచ్చి బ్లాక్‌మెయిలింగ్ వ్యవస్థలా చేశారు. కేసీఆర్ బస్సు యాత్ర ఉంటుంది.. ఎప్పుడనేది తర్వాత తెలుస్తుంది. గ్రాఎఖీ, సభ్యత్వ నమోదుపై దాదాపు 60 నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తయ్యాయి. 15 రోజుల్లో అవి పూర్తవుతాయి. త్వరలో అన్ని నియోజకవర్గాల వారీగా శిక్షణ ఉంటుంది. వచ్చే నెలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతాం. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మూడో స్థానంలో ఉంటుంది. బీఆర్ఎస్‌కు భాజపాతోనే పోటీ. తెలంగాణ వచ్చిన తర్వాత ఎవరితోనూ పొత్తులు పెట్టుకోలేదు.. భవిష్యత్‌లోనూ ఉండవు. కాంగ్రెస్, భాజపాకు అంత రీచ్, క్యాడర్ లేదు. బీఆర్ఎస్‌కు బలమైన నాయకత్వం, క్యాడర్ ఉంది. కాంగ్రెస్ జారుడుబండపై ఉంది.. కిందికే తప్ప పైకి వెళ్లలేరు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరించడం సరికాదు. ఈ వ్యవహారంలో తెలంగాణ కాంగ్రెస్ నుంచే సమాచారం వచ్చిందని మహారాష్ట్ర మంత్రి చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్‌లో బ్లాక్ షీప్ ఎవరో రాహుల్ గాంధీ తేల్చాలి"అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.వచ్చే నెలలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందనే సమాచారం తమకుందని కేటీఆర్ అన్నారు. దేశం మొత్తం కాకున్నా.. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు. "జమిలి ఎన్నికల విషయంలో ఏం జరుగుతుందో చూడాలి. డీలిమిటేషన్‌లో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా తగ్గితే ఊరుకునేది లేదు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలను శిక్షిస్తామంటే ఎలా? దేశాభివృద్ధికి దోహదపడే రాష్ట్రాలకు అన్యాయం చేస్తే ఊరుకోం" అని కేటీఆర్ అన్నారు.

# ఆర్థిక పరిపుష్టికి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలి

**సచివాలయంలో 'రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ' సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు**



న్యూఢిల్లీ(జనంసాక్షి):రాష్ట్ర ఆర్థిక పరిపుష్టికి, ఆదాయ వనరుల పెంపునకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సీఎం అధ్యక్షతన 'రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ' సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అదనపు ఆదాయ మార్గాల అన్వేషణ, వివిధ శాఖల ప్రగతిపై మంత్రుల బృందం అధికారులతో లోతుగా సమీక్షించింది.ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ... రాష్ట్రానికి రావాల్సిన పన్ను ఆదాయాన్ని గరిష్టంగా రాబట్టేందుకు కమర్షియల్ ట్యాక్సెస్ శాఖ అమలు తీరును, ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో కీలక నిర్ణయాలు తీసుకునే జీఎస్టీ ఫిట్‌మెంట్ కమిటీలో తెలంగాణకు ఖచ్చితంగా ప్రాతినిధ్యం దక్కేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల రాష్ట్ర ప్రయోజనాలను మరింత సమర్థవంతంగా కాపాడుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే రాష్ట్ర ఆదాయంలో కీలకమైన ఎక్సైజ్ శాఖ నిర్దేశించుకున్న లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని సూచించారు. ఇందుకోసం తక్షణమే ఒక స్పష్టమైన, పక్కా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేయాలన్నారు.అసైన్డ్ భూములపై రెవెన్యూ శాఖతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని, జిల్లాల వారీగా ఉన్న ప్రభుత్వ భూసంపదను గుర్తించేందుకు తక్షణమే జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరి సందీప్ కూమార్ సుల్తానీయాను ఆదేశించారు. రాష్ట్రంలో భూముల మోనిటైజేషన్, ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలోని ప్రభుత్వ భూసంపదను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి (మోనిటైజేషన్) అధికారులు సిద్ధం చేసిన సమగ్ర ప్రణాళికపై ఈ సమీక్షా సమావేశంలో విస్తృతంగా చర్చించారు.గతంలో ఉప్పల్ భగాయత్ ప్రాజెక్ట్ విజయవంతం కాగా, మోకిలా, బుద్వేల్‌లలోనూ మంచి ఫలితాలు వచ్చాయని, ప్రస్తుతం మరో మూడు కొత్త ప్రాజెక్టులు పరిశీలనలో ఉన్నాయని ల్యాండ్ పూలింగ్ పురోగతిని స్పెషల్ చీఫ్ సెక్రటరి జయేష్ రంజన్ సమావేశంలో వివరించారు. ఉప్పల్ భగాయత్ తరహాలోనే పారదర్శక విధానాలను అవలంబిస్తూ, నగర పరిధిలో మరిన్ని ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ చేపట్టడానికి గల అవకాశాలను తక్షణమే గుర్తించాలని అధికారులను మంత్రులు ఆదేశించారు.హైదరాబాద్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రాజెక్టును వేగవంతం చేయడంపై సబ్ కమిటీ ప్రత్యేకంగా చర్చించింది. ఊఎఒ కింద జారీ చేయాల్సిన నోటిఫికేషన్లకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ పూర్తి స్థాయిలో సహకరించాలని డిప్యూటీ సీఎం సూచించారు. అలాగే, ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజల్లో, పారిశ్రామిక వర్గాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లలో ఉత్తరప్రదేశ్, హర్యానాల తర్వాత తెలంగాణ మూడో స్థానంలో నిలిచిందని, గత ఆరు నెలల్లో తీసుకున్న పటిష్ఠ చర్యల వల్ల జీఎస్టీ రిటర్న్ ఫైలింగ్ పెరిగిందని రాష్ట్ర వాణిజ్య పన్నుల (కమర్షియల్ టాక్సెస్ జీఎస్టీ) కమిషనర్ రఘునందన్ రావు మంత్రులకు వివరించారు.

## రుతుపవనాలపై ఎల్‌నినో శరాఘాతం

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎల్‌నినోపై భారత వాతావరణ విభాగం ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. భూమధ్య రేఖ ప్రాంతంలో పసిఫిక్ మహాసముద్ర ఉపరితలంపై ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపింది. ఈ రుతుపవనాల సీజన్‌లో ఇది మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని.. పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపనుందని హెచ్చరించింది. దేశంలో రుతుపవనాలపై ఎల్‌నినో ప్రతికూల ప్రభావం ఉంటుందని పేర్కొంది. అత్యధిక వర్షపాతం నమోదయ్యే నైరుతి రుతుపవనాల్లో ఈసారి వర్షపాతం తగ్గుతుందని అంచనా వేసింది. భూమధ్య రేఖ ప్రాంతంలో పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు సాధారణం కన్నా ఎక్కువగా వేడెక్కడాన్ని ఎల్‌నినోగా అభివర్ణిస్తారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పోకడలు తారుమారవుతాయి. చివరిగా ఎల్‌నినో ప్రభావం 2023లో ఏర్పడింది. ఆ సమయంలో దేశవ్యాప్తంగా రుతుపవనాల అంతరాయం, వర్షపాతంలో వైవిధ్యం వంటి పరిస్థితులు తలెత్తాయి. కేంద్రం చర్యలుఎల్‌నినో ప్రభావానికి అత్యంత ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్న 197 జిల్లాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. పంట నష్టభయాలను తగ్గించడానికి రాష్ట్రాల వారీగా అత్యవసర ప్రణాళికలను రూపొందించామన్నారు. వాతావరణ పరిస్థితులు క్షీణిస్తే త్వరితగతిన స్పందించేందుకు ముందుజాగ్రత్త చర్యగా ప్రభుత్వం విత్తనాలతో పాటు ఇతర కీలక వ్యవసాయ ఉత్పాదకాలను నిల్వ చేసిందని వెల్లడించారు. ఎల్‌నినో వల్ల ఏర్పడే వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు 'ఖేత్ బచావో అభియాన్' అనే అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కేంద్రమంత్రి తెలిపారు.

# ఏసీబీకి చిక్కిన ఎంపీడీవో, ఎంపీవో

- లంచం తీసుకుంటుండగా పట్టివేత
- పటాకులు కాల్చి సంబరం చేసుకున్న గ్రామస్తులు



**మహబూబాబాద్, జూన్12 (జనంసాక్షి) :** భూమి లేఅవుట్ అభివృద్ధి పనులకు లంచం తీసుకున్న ముగ్గురిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సిములపేట మండలానికి చెందిన ఎంపీడీవో రాధిక, ఆమె కుమారుడు నాగార్జున, ఎంపీవో యాకయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మండలంలోని పద్మావతిగూడెం గ్రామంలో లేఅవుట్‌కు సంబంధించిన భూమిని గ్రామ పంచాయతీ వద్ద తాకట్టు పెట్టేలా పంచాయతీ సచివాలయానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బాధితుడు ఎంపీడీవో రాధికను, ఎంపీవో యాకయ్యను సంప్రదించాడు. దీంతో వారు లంచం డిమాండ్ చేయడంతో శుక్రవారం ఎంపీడీవో కుమారుడు నాగార్జునకు మొత్తం 45 వేల రూపాయలు అందజేశాడు. దీంతో అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు ముగ్గురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కాగా ఎంపీడీవో రాధిక ఏసీబీ అధికారులకు పట్టుబడడంతో స్థానికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

# ఘనంగా శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం

- పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా దంపతులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగ్ ప్రెసిడెంట్ మంజుల ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం కొత్త పేటలో నిర్వహించిన శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఈ మహోత్సవానికి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త దంపతులు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమానికి విచ్చేసిన ఉప్పల శ్రీనివాస్ గుప్త అలాగే ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్నకు, మహిళా విభాగ్ నాయకులు, నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీ వెంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించబడింది. కార్యక్రమంలో సామూహిక లలితాదేవి పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, మణిద్వీప వర్ణన, వాసవీమాత గోష్టి సేవ వంటి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. లోక క్షేమం కోసం ఈ కల్యాణం నిర్వహించారు. మునుముందు యుద్దాలు జరగకుండా వుండాలి అని కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణలో మహిళల పాత్ర అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. సమాజంలో ఆధ్యాత్మికత, నైతిక విలువలు, సేవాభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. వైశ్య సమాజ ఐక్యతకు, యువతలో ధార్మిక చైతన్యం పెంపొందించేందుకు ఐవీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. 45 మంది అయ్య గార్లకు వాయిద్యాలు అందజేశారు. కార్యక్రమం అనంతరం అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృత స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కక్కిరాల రమేష్, సుజన ఐవీఎఫ్ అడ్వైజర్ బోర్డు చైర్మెన్ గంజి రాజమౌళి గుప్త , ముస్తాల సత్తయ్య , పబ్బ చంద్రశేఖర్, కట్ట రవి కుమార్ గుప్త , నారాయణ కటకం శ్రీనివాస్, నరేశ్, ప్రవీణ్, నవీన్ బెల్లె రవికుమార్, సంబు పాడు సప్త, బోనగిరి శ్రీనివాస్, చింతల రజవకాంత్, మణిమాల. నలిని, అర్చన, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ నావికులను బలిగొన్న అమెరికా

- సీసీజీజీఓఓ తీవ్ర ఖండన

**హైదరాబాద్ (జనంసాక్షి) :** అమెరికా సైనిక దళాలు ఒమన్ తీరం వద్ద ఉన్న 'సెట్టిబెల్లో' చమురు నౌకపై చేసిన క్షిపణి దాడిలో ముగ్గురు నిర్దోషి భారతీయ నావికులు చీఫ్ ఇంజనీర్ పట్నాల సురేష్ (44), డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ (23) ఇంజన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా దారుణంగా ప్రాణాలు కోల్పోయారు. భారత నావికులున్న నౌకలపై అమెరికా దళాలు చేసిన దాడులను సీసీజీజీఓఓ తీవ్రంగా ఖండించింది. వీటిపై స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది. సంఘర్షణ ప్రాంతాల్లో పనిచేస్తున్న భారతీయ నావికుల భద్రతను నిర్ధారించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, వాణిజ్య నౌకలకు పటిష్టమైన నావికాదళ రక్షణ, అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీసీజీజీఓఓ జాతీయ చైర్మన్ వి.కృష్ణ మోహన్ డిమాండ్ చేశారు. సంబంధిత ప్రభుత్వ సంస్థలు, నౌకా యజమానులు, నావికుల సంఘాలతో శాశ్వత సంక్షోభ నిర్వహణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ దాడిలో చనిపోయిన నావికా సిబ్బంది కుటుంబాలకు పరిహారం, బీమా మొత్తాన్ని సకాలంలో అందించి, వారిపై ఆధారపడిన వారికి శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. అధిక ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో పనిచేస్తున్న నావికులకు తప్పనిసరి యుద్ధ ప్రమాద భత్యం, మెరుగైన బీమా కవరేజీని అందించాలన్నారు. నౌక యజమానులు ఇరాన్ చమురు రవాణా చేయడం లేదని స్పష్టం చేశారని తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ప్రధాని నిరసిం చాలని, ప్రపంచ శాంతికి కృషి చేయాలని కోరారు. భారతీయ నావికుల రక్తం వృథా కాకూడదని, నరమేధానికి నిరసనగా అమెరికా గుత్తాధిపత్య వస్తువు లను, సర్వీసులను ప్రజలు బహిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అమెరికా సైన్య దాడిలో బలైన విశాఖపట్నం వాసి పట్నాల సురేష్ తదితరుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ సముద్రయాన సిబ్బందికి మెరుగైన వైద్యం అందించాలని వి.కృష్ణ మోహన్ డిమాండ్ చేశారు.

# టీఎంసీ మాజీ ఎంపీకి అతివాద సంస్థలతో సంబంధాలు

## అహ్మద్ హసన్‌పై దర్యాప్తునకు రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ డిమాండ్



**కోల్‌కతా, జూన్12 (జనంసాక్షి) :** తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ ఆ పార్టీ మాజీ ఎంపీపై సంచలన ఆరోపణలు చేశారు. తృణమూల్ మాజీ రాజ్యసభ ఎంపీ అహ్మద్ హసన్ ఇమ్రాన్‌కు బంగ్లాదేశ్‌కు చెందిన అతివాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు పశ్చిమబెంగాల్ సీఎం సువేందు అధికారికి లేఖ రాశారు. ఇమ్రాన్‌కు బంగ్లాదేశ్ సంస్థలతో సంబంధాలు ఉండొచ్చని పలు మీడియా నివేదికలు చేసిన బహిరంగ ఆరోపణలను ఘోష్ తన లేఖలో ప్రస్తావించారు. టీఎంసీ హయాంలో చికెన్ నెక్ కారిడార్ తో సహా కొన్ని సున్నితమైన ప్రాంతాలలో భారత సైన్యం, సరిహద్దు భద్రతా దళంఅభ్యర్థించిన భూమిని కేటాయించకపోవడం పైనా పలు అనుమానాలు లేవనెత్తారు. వీటిపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. రెబల్ ఎమ్మెల్యే రితబ్రత టీఎంసీలో తిరుగుబాటు లేవనెత్తిన అంశంతో తమకేమీ సంబంధం లేదని కకోలీ ఘోష్ పేర్కొన్నారు. ఆయన అసెంబ్లీలో ఉంటే తాను పార్లమెంట్‌లో ఉన్నానని అన్నారు. రెండు వర్గాలు వేర్వేరు రాజకీయ లక్ష్యాలను అనుసరిస్తున్నాయన్నారు. ఇటీవల లోక్‌సభలోని 20 మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే. వారు స్పీకర్‌కు రాసిన లేఖ నేడు జాతీయమీడియా చేతికి వచ్చింది. దీంతో రెబల్ ఎంపీలలో కకోలీ ఘోష్, శతాబ్ది రాయ్, భారత మాజీ క్రికెటర్, ఎంపీ యూసుఫ్ పఠాన్, నటి సయోనీ ఘోష్, నటుడు శత్రుఘ్న సిన్హా మొదలైన కీలక నేతలు ఉన్నట్లు వెల్లడయ్యింది.

# పట్టాల పంపిణీతో భావితరాలకు శాశ్వత భూ హక్కులు

- ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం
- ప్రత్యేక ప్రజా దర్బార్ ద్వారా గ్రామాలకే ప్రభుత్వ సేవలు
- భూమి, ఇండ్ల, పెన్షన్లు, సాగునీటి సమస్యలకు వేగవంత పరిష్కారం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, జూన్ 12(జనంసాక్షి) :** రామచంద్రపూర్ భూములకు పట్టాల పంపిణీ ద్వారా భావితరాలకు శాశ్వత భూ హక్కులు కల్పించనున్నామని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికే ప్రత్యేకంగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో మల్లంపల్లి మండలంలోని గిత్తూర్ తండా, కొడిశాలకుంట, ముద్దునూరు తండా, రామచంద్రపూర్, భూపాల్‌నగర్, శివతండ గ్రామపంచాయతీల పరిధిలోని ప్రజల నుంచి మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రజలకు న్యాయం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రత్యేకంగా రామచంద్రపూర్ గ్రామ పరిధిలో సుమారు 10,600 ఎకరాల భూములకు సంబంధించిన 30 నుంచి 40 సంవత్సరాలుగా కొనసాగుతున్న సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించి, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రైతులకు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. భూముల సమస్యల పరిష్కారంతో పాటు రైతులకు పూర్తి స్థాయిలో వ్యవసాయ భరోసా కల్పించేందుకు రెండు పంటలకు సమృద్ధిగా సాగునీరు అందించే ప్రత్యేక ప్రణాళికలను ప్రభుత్వం రూపొందిస్తోందని, రైతులు ఆర్థికంగా బలోపేతం కావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇళ్లులేని నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు మొదటి విడతలో ములుగు నియోజకవర్గానికి 5 వేలకుపైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, రెండో విడతలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందించేలా కార్యాచరణ కొనసాగుతోందన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ త్వరితగతిన పరిష్కార చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సామాజిక భద్రతలో భాగంగా అర్హులైన వారికి త్వరలోనే నూతన పెన్షన్లు మంజూరు చేసి ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, మహిళా సంఘాలకు విశిష్ట గౌరవం కల్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా రూ.61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందించామని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి రంగంలో మరింతగా ఎదగడానికి రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న గోదాములు మహిళా సంఘాల వీవో భవనాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రధానంగా పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, భూ సమస్యలు, గ్రామస్థాయి స్థానిక సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని తెలిపారు. అంతకుముందు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామ పరిధిలోని యేసునగర్‌లో సీఆర్ఆర్ 2025-26 నిధులతో రూ.19 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి దుర్గామాత ఆలయం వరకు రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, అలాగే డీఎంఎఫ్‌టీ నిధులతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన దుర్గామాత దేవాలయ కాంపౌండ్ వాల్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం కోయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్‌తో కలిసి మెగా శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. "అమ్మ మాట – అంగన్‌వాడి బాట అంగన్‌వాడీలో పిల్లలను నమోదు చేయండి, వారి భవిష్యత్తుకు పునాది వేయండి" అనే నినాదంతో ములుగు ప్రాజెక్టు మల్లంపల్లి సెక్టార్ రామచంద్రపూర్ యేసునగర్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీలో మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు. రామచంద్రపూర్ ప్రజా దర్బార్ కార్యక్రమం అనంతరం మంత్రి అనసూయ సీతక్క అంగన్‌వాడీ పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మెన్ బొక్క సత్తిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామాల సర్పంచులు, తహసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అరుణోదయ సాంస్కృతిక శిక్షణా శిబిరం విజయవంతం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జూన్ 11, 12 (2026) తేదీల్లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య(ఏసీఎఫ్) శిక్షణా శిబిరం విజయవంతంగా జరిగింది. ప్రజా ఉద్యమాల్లో నేలకొరిగిన అమరులకు జోహార్లర్పిస్తూ మొదలైన సాంస్కృతిక శిక్షణా శిబిరాన్ని అరుణోదయ ఉభయ రాష్ట్రాల గౌరవాధ్యక్షురాలు విమలక్క ప్రారంభించారు. తొలి రోజున జరిగిన శిక్షణా శిబిరానికి అరుణోదయ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏపూరి మల్సూర్, ఆంధ్రప్రదేశ్ సీనియర్ నాయకులు పోతనలు అధ్యక్షత వహించారు. "ప్రజా సాంస్కృతికోద్యమ కర్తవ్యాలు" అనే అంశంపై లెల్లే సురేష్ ప్రసంగించారు. చైతన్యవంతమైన సాంస్కృతికోద్యమ నిర్మాణం నేడు దేశంలో జరూరైన అంశంగా ముందుకు వచ్చిందని సఫ్దర్ హష్మీ లాంటి వారి అమరత్వాన్ని సోదాహరణగా వివరించారు. థియేటర్ ఆర్టిస్టుగా తన పెర్ఫార్మెన్స్ తో కళాకారులను మెప్పించారు. తొలిరోజు మధ్యాహ్నం సెషన్ లో శాస్త్రీయ సోషలిజం సిద్ధాంత వెలుగులో సాంస్కృతికోద్యమం "అనే అంశంపై రవీందర్ ప్రసంగించారు. సమాజంలోని ఉత్పత్తితో, శ్రమతో కళలు–సాహిత్యం ముడివడి ఉంటాయని చెబుతూ, చలనశీలమైన సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంస్కృతికోద్యమం పయనించాలన్నారు. అందుకు శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతం మనకు దిశా నిర్దేశం చేస్తుందన్నారు. తొలిరోజు సాయంత్రం సెషన్లో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు యువ పురస్కార కర్త డప్పు భాస్కర్ "సాంస్కృతికోద్యమంలో డప్పు వాద్యాలు" అనే అంశంపై ప్రసంగించారు. మానవ చరిత్రలో తొలి శబ్ద సంగీతం డప్పు అంటూ చాటడమే కాకుండా రాత్రి వరకు రెండు బృందాలకు డప్పు శిక్షణనిచ్చారు. అనంతరం కల్చరల్ నైట్ లో కళాకారులు ఆడి పాడారు. రెండవ రోజు ఉదయం 6 గంటలకు డప్పు శిక్షణతో మొదలైన సెషన్ కు జానపద పరిశోధకులు, ఆద్య కళా సంస్కృతి ఎక్సిబిషన్ ఫౌండర్ ప్రొఫెసర్ జయదీర్ తిరుమల రావు, హైకోర్టు న్యాయవాది గ్రాంసీ సిద్ధాంత పరిశోధకులు ఆచార్య కట్టా భగవంత రెడ్డిలను విమలక్క వేదిక పైకి ఆహ్వానించారు.

అరుణోదయ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ల రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు పోతుల రమేష్, ఊటుకూరి సుధాకర్ లు రెండవ రోజు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. "ఆదివాసి కళలూ–సాహిత్యం–మన కర్తవ్యాలు" అనే అంశంపై ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావు, "గ్రాంసీ సాంస్కృతిక ఆధిపత్య సిద్ధాంతం–నేటి కర్తవ్యాలు" అనే అంశంపై ఆచార్య కట్టా భగవంత రెడ్డిలు ప్రసంగించారు. రెండవ రోజు మధ్యాహ్నం సెషన్ లో "అరుణోదయ ప్రణాళిక" ను విమలక్క "పాట పుట్టుక పరిణామాలను" డప్పు భాస్కర్లు వివరించారు. అనంతరం ఏపూరి మల్సూర్, రాకేష్ ల ఆధ్వర్యంలో పాటల శిక్షణా కార్యక్రమం జరిగింది. రైతు–కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ళ నాగిరెడ్డి, పి డి ఎస్ యు (విజృంభణ) నాయకులు పవన్ తదితరులు తమ సౌహార్ద సందేశాలు వినిపించారు. అంతర్జాతీయ శ్రామిక గీతంతో సాంస్కృతిక శిక్షణా శిబిరం ముగిసింది.

# హెల్త్ స్కీం అమలులో ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి

- టాప్ర రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.నారాయణ రెడ్డి, పి క్రిష్ణమూర్తి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సమగ్రమైన ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తామని అదీ జూన్ 1వ తేదీవరకు కొత్త పథకం కార్డులు ఇచ్చి ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ (టాప్ర) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.నారాయణ రెడ్డి, పి క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ సమావేశం ఆన్ లైన్ లో రాష్ట్ర అధ్యక్షులు పి నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యంగా జూన్ 1వ తేదీ నాటికి కార్డులు ఇస్తామని చెప్పి కార్డులు ఇవ్వకపోగా 1వ తేదినాడు ఉద్యోగుల, పెన్షనర్ల వేతనాలనుండి 1.5 శాతం సబ్ స్క్రిప్షన్ మాత్రం ఆర్థిక శాఖ వారు మినహాయించుకున్నారు. రెండు రోజుల్లో ట్రస్టు పది రోజుల్లో స్కీం అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన హామీ ఈరోజు 12 వ తేదీ వరకు కూడా కార్యరూపం ధరించకపోవడం విచారకరమైన విషయంగా టాప్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం పేర్కొంది. ఆరోగ్య పథకం అమలు చేయడానికి ముఖ్యంగా కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చలు చేసి విధివిధానాలు రూపొందించాలి. ఏ వ్యాధికి ఎంత ఇవ్వాలనే ప్యాకేజి ప్రకటించాలి. ఆ ప్యాకేజికి ప్రవేటు ఆసుపత్రులు ముందుకు వస్తయా, రావా అనే చర్చలు ఎక్కడా జరుగుతున్నట్లు కనబడటం లేదు. మరి ఇంకా ఎప్పుడు పథకాన్ని ప్రారంభిస్తారు. మా దగ్గర నుండి కాంట్రిబ్యూషన్ కట్ చేసుకున్నారు కాని ఎక్కడా ఏ ఆసుపత్రి వారు కొత్త పథకం ప్రకారం వైద్యం మాత్రం అందించడం లేదు. పెన్షనర్ల సమాచార సేకరణ డిడిఓలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. మళ్లీ ఇప్పుడు సేకరణ ఎందుకు, ఇప్పటికే ఆరోగ్యశ్రీ ట్రస్టు దగ్గర ఉన్న వివరాలు తీసుకోండి అంటే మాత్రం అలాగే తీసుకోవడానికి ఒప్పుకున్నారు. కాని కొంత మంది పెన్షనర్లకు ఇప్పటికీ ఆరోగ్య కార్డులు లేవు. వారు తమ వివరాలు ఎస్.టి.ఓ లకు ఇవ్వడినికి వెళితే మాకు మీ వివరాలు తీసుకోవాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు లేవని తీసుకోవడం లేదు. కొందరు ఎస్.టి.ఓలు మాత్రం తీసుకుంటున్నారు. ఈ విషయంలో కూడా సమగ్రమైన ఉత్తర్వులు ఇవ్వాలని వెంటనే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకో వాలని డిమాండ్ చేశారు. ఒకవేళ హామీని నిలబెట్టుకోనట్లయితే వెంటనే ఆందోళనకు పిలుపు ఇవ్వాలని కూడా సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అశోక్ సభ్యులు ఎం. జనార్ధన్ రెడ్డి, డా ఎల్ అరుణ, డా స్వరాజ్ కుమార్, క్రిష్ణమోహన్, సిహెచ్ జనార్ధన్, శ్యాం సుందర్, క్రిష్ణారావు, బాలరాజు, లక్ష్మి నారాయణ, వీరబాబు, బాల గంగాధర్, అర్జున్, ప్రభాకర్, రాందాస్, ఇ తిరుమలయ్య, కమల కుమారి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# కోచ్ తిరుమల రావు బొరాడి శిష్యుల రాణింపు

- రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పతకాలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ తెలంగాణ రాష్ట్ర పురుషుల, మహిళల మరియు జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్–2026 జూన్ 11, 12 తేదీలలో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో మేడ్చల్ జిల్లా అథ్లెట్లు విశేష ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించి జిల్లా కీర్తిని చాటారు. మహిళల 400 మీటర్ల పరుగు మరియు 800 మీటర్ల పరుగు విభాగాల్లో పి. సరిత రెండు రజత పతకాలు సాధించారు. 16 ఏళ్ల లోపు బాలికల లాంగ్ జంప్ విభాగంలో జి. అభినయశ్రీ కాంస్య పతకం గెలుచుకోగా, మహిళల లాంగ్ జంప్ విభాగంలో వి. డిల్లేశ్వరి రజత పతకం సాధించారు. ఇతర పోటీలలో బాలుర అండర్–18 100 మీటర్ల పరుగు ఫైనల్స్‌లో చి. గణేష్ 7వ స్థానం, బాలుర అండర్–20 400 మీటర్ల పరుగు ఫైనల్స్‌లో బి. సాత్విక్ 4వ స్థానం, పురుషుల 1500 మీటర్ల పరుగు ఫైనల్స్‌లో పి. శ్రీనివాస్ 19వ స్థానం సాధించారు. మహిళల లాంగ్ జంప్‌లో జి. అఖిల 4వ స్థానంలో నిలిచారు. పురుషుల 10,000 మీటర్ల పరుగు ఫైనల్స్‌లో జె. దత్తాత్రి 8వ స్థానం, 800 మీటర్ల పరుగు ఫైనల్స్‌లో 10వ స్థానం పొందారు. అథ్లెటిక్స్ కోచ్ బి. తిరుమల రావు పురుషుల ట్రిపుల్ జంప్, 110 మీటర్ల హర్డిల్స్ విభాగాల్లో రజత పతకాలు సాధిం చడం విశేషం. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ ఓ. అశోక్ కుమార్, ఏఎఫ్ఐ టెక్నికల్ ఆఫీషియల్ దయాల్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ఏఎఫ్ఐ సభ్యులు బి.ఇ. స్టాన్లీ జోన్స్ తదితరులు విజేత అథ్లెట్లను, కోచ్ తిరుమల రావు బొరాడిని అభినందించారు.




# సీఎం ప్రజావాణిలో 629 దరఖాస్తులు

- దరఖాస్తులు స్వీకరించిన ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన 230వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 629 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 285, ఇందిరమ్మ ఇండ్ల కోసం 221, రెవెన్యూ శాఖకు సంబంధించి 47 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 76 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులను స్వీకరించి ఎండార్స్ మెంట్ చేసి సంబంధిత అదుకారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న స్వీపర్స్, స్కావేంజర్స్, నైట్ వాచ్ మెన్స్ వేతనాలు పెంచాలని కోరుతూ సిబ్బంది సీఎం ప్రజావాణికి వచ్చారు. ఈ అంశంపై స్పందించిన చిన్నారెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.సీ.పీ. ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తుండగా పట్టివేత

**నిజామాబాద్, జూన్12 (జనంసాక్షి) :** భీమ్‌గల్ మండలంలోని సంతోష్‌నగర్ తండా సమీపంలో ఎక్సైజ్ ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం శుక్రవారం దాడులు నిర్వహించి గంజాయిని పట్టుకుంది. భీమ్‌గల్ కు చెందిన షేక్ మజాస్ గంజాయి తరలిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి పట్టుబడ్డాడు. ఇతడి వద్ద నుండి గ్రా.100 ఎండు గంజాయి, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో గంజాయి సేవించే ముగ్గురు వ్యక్తులకు వారి తల్లిదండ్రుల సమక్షంలోనే గంజాయి దుష్ప్రభావాల గురించి స్థానిక ఎక్సైజ్ సీఐ పీ వేణుమాధవ్ రావు అవగాహన కల్పించారు. అనంతరం వారిని స్థానిక తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల రాస్తారోకో

**కామారెడ్డి, జూన్12 (జనంసాక్షి) :** యూరియా కోసం బీర్కూర్ మండల కేంద్రంలో అన్నదాతలు రాస్తారోకో చేశారు. యూరియా బస్తాల కోసం వివిధ గ్రామాలకు చెందిన రైతులు యాప్‌లో గురువారం సాయంత్రం బుక్ చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 7 గంటలకు బీర్కుర్‌లోని గ్రోమోర్ కేంద్రానికి రైతులు యూరియా కోసం వచ్చారు. 7 గంటల నుంచి 11 గంటల వరకు దుకాణం తెరవకుండా యూరియా ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన రైతులు బీర్కూర్ పోతంగల్ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. యూరియా ఇవ్వకుండా సిబ్బంది కాలయాపన చేస్తున్నారంటూ ఆరోపించారు. పోలీసుల జోక్యంతో రాస్తారోకో విరమించారు.

# బెంగాల్‌లో రాజకీయ శూన్యత

సంపాదకీయం

**అధికార బలంతో ప్రతిపక్షాన్ని నిర్మూలించవచ్చునని పాలకులు భావించినప్పుడల్లా చరిత్ర వారిని అబద్ధస్తులుగా నిరూపించింది. బెంగాల్‌లో భాజపా నేడు తృణమూల్ కాంగ్రెస్‌ను అధికార యంత్రాంగంతో చిదిమివేయాలని పూనుకుంటోంది. ఇది కేవలం పార్టీ రాజకీయం కాదు ప్రజాస్వామ్యానికే పరీక్ష.**

రాజకీయాల్లో శూన్యత శాశ్వతంగా ఉండదు. ఒక శక్తిని బలవంతంగా తొలగించినప్పుడు ఆ స్థానంలో కొత్త శక్తి అనివార్యంగా తలెత్తుతుంది. అది పాలకపక్షం ఊహించిన రూపంలో కాకుండా. 1975లో ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితి విధించి ప్రతిపక్షాలను జైళ్లలో పెట్టింది. రాజకీయ ప్రతిఘటనను సమూలంగా నాశనం చేశానని ఆమె భావించింది. కానీ ఆ అణచివేత నుంచే జనతా పార్టీ పుట్టింది. సిద్ధాంతాల్లో భిన్నమైన శక్తులు ఒకే వేదికపైకి వచ్చి 1977లో కాంగ్రెస్‌ను చరిత్రలో మొట్టమొదటిసారి అధికారం నుంచి దించాయి.

బెంగాల్ సొంత చరిత్రే ఇందుకు బలమైన సాక్ష్యం. సీపీఎం ముప్పై నాలుగేళ్ళ అధికారంలో ఉంది. సింగూర్, నందిగ్రామ్ ఘటనలు జరిగే వరకూ ఆ పార్టీని సవాలు చేయగల శక్తి ఏదీ కనిపించలేదు. కానీ అణచివేతకు గురైన జనం నుంచే మమతా బెనర్జీ నాయకత్వంలో తృణమూల్ కాంగ్రెస్ అనూహ్యమైన వేగంతో ఎదిగింది. ఒకప్పుడు అభేద్యంగా కనిపించిన వామపక్ష కోట కూలిపోయింది. ప్రపంచ చరిత్రలోనూ ఇదే పాఠం పదే పదే పునరావృతమైంది. పోలండ్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వం సాలిడారిటీ ఉద్యమాన్ని నిషేధించినప్పుడు అది భూగర్భంలోకి వెళ్ళింది. చివరకు ఆ ప్రభుత్వాన్నే కూల్చింది. దక్షిణాఫ్రికాలో ఏఎన్‌సీని నిషేధించినప్పుడు నెల్సన్ మండేలా జైలు గోడల వెనక ప్రతీకారేచ్ఛ మరింత బలపడింది.

అణచివేత ఒక విచిత్రమైన రసాయన చర్యను జరిపిస్తుంది. శత్రువును బలహీనపరచడానికి బదులు అమరత్వం ప్రసాదిస్తుంది. నేడు బెంగాల్‌లో తృణమూల్ నేతలపై కేసులు, బెదిరింపులు, పార్టీ మారేందుకు ఒత్తిళ్ళు పెరుగుతున్నాయి. ఇవి పార్టీని బలహీనపరుస్తాయా? చరిత్ర చెప్పే సమాధానం వేరేగా ఉంది. ప్రజలు అణచివేతను ప్రత్యక్షంగా చూసినప్పుడు సానుభూతి బలపడుతుంది, పతనమవుతున్న పార్టీ కూడా సహానుభూతి శక్తిగా పునర్జన్మ ఎత్తుతుంది. ప్రజాస్వామ్యానికి ప్రతిపక్షం ఊపిరివంటిది. దాన్ని ఆపగలమని భావించడం ఒక జీవిని చంపకుండా శ్వాసను మాత్రం ఆపగలమని భావించినట్టే అసంభవం. బెంగాల్ రాజకీయాల్లో నేడు కనిపిస్తున్న శూన్యత తాత్కాలికమే. ఆ శూన్యం నుంచి ఏ శక్తి పుడుతుందో, అది భాజపాకు అనుకూలంగా ఉంటుందా లేదా అనే ప్రశ్నకు సమాధానం రాబోయే ఎన్నికలు చెప్తాయి.

రాజకీయాల్లో శూన్యత శాశ్వతం కాదు.. అణచివేత ఎంత తీవ్రంగా ఉంటే, ప్రతిస్పందన అంత బలంగా పుడుతుంది. బెంగాల్‌లో తృణమూల్‌ను నిర్మూలించాలని భాజపా చేస్తున్న ప్రయత్నం చరిత్ర చెప్పే పాఠాన్ని విస్మరిస్తోంది. ఆ శక్తి కాంగ్రెస్‌లో విలీనమై మహాతర శక్తిగా ఎదగవచ్చు, లేదా తొలకరి వానకు మైదానంలో గడ్డి మొలిచినట్టు ఎర్రజెండాలు మళ్ళీ నేల పట్టుకోవచ్చు. ఏ రూపంలో వచ్చినా ఆ శూన్యం తప్పకుండా నిండుతుంది. ఎందుకంటే బెంగాల్ నేల రాజకీయంగా ఎప్పుడూ సారవంతమైనదే. అణచివేత ప్రతిపక్షాన్ని చంపదు, కొత్త రూపంలో పునర్జన్మ ఇస్తుంది.

# ఓటు మనది... అప్పు మన పిల్లలదా?

మన భవిష్యత్తు బహిరంగ వేలం కాదు! ఈ ప్రశ్న అడగడానికి సిగ్గేమీ లేదు. ఎందుకంటే, నేటి రాజకీయాలు మన భవిష్యత్తును నడిరోడ్డుపై నిలబెట్టి బహిరంగ వేలం వేస్తున్నాయి. ఆ వేలంలో కొనేవాళ్ళు ఎవరో కాదు అధికారం కోసం ప్రాకులాడే నాయకులు, కార్పొరేట్ దిగ్గజాలు, మరియు ప్రజల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకునే కొన్ని మీడియా సంస్థల కూటమి. మరి ఈ వ్యాపారంలో అమ్ముడుపోతున్నది ఎవరు? ఇంకెవరు, మనమే! మన ఓట్లతో, మన చేతకాని మౌనంతో, మన మేల్కొనని నిద్రతో మనల్ని మనమే అమ్ముకుంటున్నాం. ఇది కేవలం నిరాశావాదం కాదు, నిలువెత్తు నిజం. సమాజం మీద ప్రేమున్న ప్రతి గుండెలో రగలాల్సిన నిప్పు. ఒకప్పుడు రాజకీయం అంటే త్యాగం, ఆదర్శం. భగత్ సింగ్ నవ్వుతూ ఉరికంబం ఎక్కాడు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాత్రింబవళ్ళు శ్రమించి ఈ దేశానికి దిక్సూచిలాంటి రాజ్యాంగాన్ని అందించాడు. మహాత్మా గాంధీ నడచి నడచి ఈ దేశపు నేలను తడిపాడు. వారెవరికీ పదవులు, సంపదలు కావాలని లేదు; కేవలం జనానికి న్యాయం జరగాలనే ఆరాటం మాత్రమే ఉండేది. కానీ నేడు? అంతరాత్మ సాక్షిగా ఒక్క నాయకుడిని చూపించండి సొంత ఆస్తులు పెంచుకోవడం తప్ప, సామాన్య జనం జీవితాల్లో వెలుగులు నింపిన నాయకుడు ఎవరైనా ఉన్నారా? ఎన్నికలు వచ్చాయంటే చాలు, రాత్రికి రాత్రే రోడ్లు పడతాయి. రకరకాల స్కీమ్‌లు పుట్టుకొస్తాయి. ఉచిత బియ్యం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సులు అంటూ వరాల జల్లు కురుస్తుంది. కానీ ఆ ఉచితం అనే ఆకర్షణీయమైన పదం వెనుక ఒక క్రూరమైన వాస్తవం దాగుంది. మీకు నేడు ఉచితంగా ఇస్తున్న ప్రతి రూపాయి, రేపు మీ పిల్లల నెత్తిన పడే అప్పు రూపంలో వస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలూ నేడు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఇవి కేవలం బడ్జెట్ అంకెలు కావు, మన రాబోయే తరాల నుదుట రాస్తున్న శాపాలు. ప్రజాస్వామ్యం అనే మాట వినడానికి చాలా గొప్పగా ఉంటుంది. కానీ ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్ళకోసారి ఓటేసి, ఆ తర్వాత ఐదేళ్లు నిద్రపోవడం కాదు. నేడు మన ఓటు వందల రూపాయల నోట్లకో, బిర్యానీ ప్యాకెట్లకో అమ్ముడుపోతోంది. ఒక్కోసారి కులానికి, మారోసారి భయానికి లొంగిపోతోంది. ఏ రాజకీయ నాయకుడూ మీ ఇంటికొచ్చి మీ పిల్లలకు మంచి చదువు అందుతోందా? అని అడగడు. అతనికి కావాల్సింది కేవలం మీ ఓటు మాత్రమే. ఆలోచించండి, మీ ఓటుతో గెలిచిన నాయకుడే మీ పంట ధరను నిర్ణయిస్తాడు. మీ పిల్లల స్కూల్ ఫీజులను, ఆసుపత్రిలో మందుల నాణ్యతను శాసిస్తాడు. మీ వీధిలో నీళ్ళ పైపు



వేయాలా వద్దా అనేది కూడా ఆయనే డిసైడ్ చేస్తాడు. అంతటి శక్తివంతమైన ఆయుధాన్ని కేవలం క్షణికమైన లాభాల కోసం అమ్ముకుంటే, అది వందేళ్ళ నష్టాన్ని కొని తెస్తుంది. అభివృద్ధి అనే పదం నేడు రాజకీయ సభల్లో సింహగర్జనలా వినిపిస్తుంది. కానీ ఆ అభివృద్ధి నిజంగా ఎవరికి చేరుతోంది? నేటికీ రైతుల ఆత్మహత్యలు ఆగడం లేదు. యువతలో నిరుద్యోగం తారస్థాయికి చేరింది. ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, డాక్టర్లు కరువయ్యారు. కానీ విమానాశ్రయాలు, వేల కోట్ల విలాసవంతమైన భవనాలు, భారీ విగ్రహాలు మాత్రం వెలుస్తున్నాయి. విగ్రహం నిలబడిన నేల కింద సామాన్య రైతు అప్పుల్లో, ఆకలితో, అవమానంతో మోకాళ్ళు ముడుచుకొని కూర్చున్నాడు. దీనిని అభివృద్ధి అందామా? రోడ్లు వేశారు సరే, కానీ ఆ రోడ్డు మీద తిరిగే జనం జేబుల్లో డబ్బులున్నాయా? విద్యుత్తు వచ్చింది, కానీ కరెంట్ బిల్లు కట్టే స్తోమత ఉందా? 5+ నెట్‌వర్క్ వస్తోంది, కానీ ఆ ఫోన్ కొనే శక్తి సామాన్యుడికి ఉందా? నేడు అభివృద్ధి అనేది కేవలం ఒక ఫొటో ఆపర్చ్యూనిటీగా, ఎన్నికల ప్రచార చిత్రంగా మారిపోయింది. స్వాతంత్ర్యం వచ్చి ముప్పావు శతాబ్దం దాటినా, మనం ఇంకా కులాన్ని చూసే ఓటేస్తున్నాం. ఇది మన సామాజిక దౌర్భాగ్యం కాదా? నాయకులకు ఈ బలహీనత బాగా తెలుసు. అందుకే వారు కుల వ్యవస్థను ఎప్పటికీ చావనివ్వరు. కులం చస్తే వారి రాజకీయం చస్తుంది. అందుకే ప్రతి ఎన్నికల్లో కులాల మధ్య, వర్గాల మధ్య చిచ్చు పెడతారు. ఈ పోరు నిరంతరం సాగినంత కాలం నాయకులు హాయిగా నిద్రపోగలరు. మనం కులం పేరుతో కొట్టుకుంటుంటే, ఆ నాయకుల పిల్లలు మాత్రం విదేశాల్లో కార్పొరేట్ చదువులు చదువుతుంటారు. మన పిల్లలు మాత్రం కనీస వసతులు లేని స్కూళ్లలో మిగిలిపోతున్నారు. ఇది ఏ రకమైన న్యాయం? ఒకప్పుడు పత్రికలు, టీవీ ఛానెళ్లు వ్యవస్థను ప్రశ్నించే శక్తులుగా ఉండేవి. నేడు అవి అధికార పీఠాలను సేవించే భజన బృందాలుగా మారాయి. ఒక నాయకుడి అవినీతి బయటపడినా, అది కేవలం ఒక గంట మాత్రమే బ్రేకింగ్ న్యూస్‌గా నిలుస్తుంది. మరుసటి రోజే ఏదో ఒక సినిమా వివాదాన్ని తెరపైకి తెచ్చి జనాన్ని పక్కదారి పట్టిస్తారు. ఎందుకంటే ఆ మీడియా సంస్థల వెనుక ఉన్నది రాజకీయ నాయకుల వ్యాపార భాగస్వాములే. స్వతంత్ర మీడియా అనేది ఇప్పుడు ఒక పెద్ద అబద్ధం. ఈ దేశంలో అత్యధిక జనాభా యువతదే. ఇది ఒక ఉప్పెనలాంటి శక్తి. కానీ దురదృష్టవశాత్తూ ఆ శక్తి సోషల్ మీడియా రీల్స్ చూస్తూ, నిరుపయోగమైన ట్రెండ్స్ ఫాలో అవుతూ కాలం వెల్లదీస్తోంది. యువతా, ఒక్కసారి ఆలోచించండి! మీరు కష్టపడి చదివిన డిగ్రీలకు ఉద్యోగాలు రావడం లేదు. మీరు కొనే ప్రతి వస్తువుపై కట్టే జీఎస్టీ సొమ్ము మీ ఊరి ఆసుపత్రికి చేరడం లేదు. మీ తల్లిదండ్రులు పొలాలు అమ్మి చదివిస్తే, నేడు పట్టణాల్లో నిరుద్యోగులుగా మిగిలిపోవడం ఎంతవరకు సమంజసం? ఈ కుళ్ళిన వ్యవస్థను ప్రశ్నించకపోతే, మీ భవిష్యత్తు ఎప్పటికీ చీకట్లోనే ఉంటుంది. విప్లవం అంటే తుపాకులు పట్టడం కాదు. విప్లవం అంటే మేల్కొనడం, ప్రశ్నించడం, తప్పును నిరాకరించడం. మీ ప్రజాప్రతినిధిని ధైర్యంగా అడగండి మా ప్రాంతంలో ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయి? మన ఊరి స్కూల్ ఎలా ఉంది? అని ప్రశ్నించండి. సమాధానం లేకపోతే ఓటు వేయకండి. కులానికి కాదు, నిజాయితీ గల నాయకత్వానికి ఓటేయండి. వాగ్దానాలకు కాదు, చేసిన పనులకు ఓటేయండి. భావోద్వేగాలకు లోనుకాకుండా బాధ్యతతో ఆలోచించండి. ఒక్క తరం మేల్కొంటే చాలు, ఈ దోపిడీ వ్యవస్థ అంతమవుతుంది. ప్రతి ఓటూ ఒక తీర్పు, ప్రతి మౌనమూ ఒక నేరం. మీ మౌనమే నాయకులకు మీ భవిష్యత్తును అమ్ముకునే లైసెన్స్ ఇస్తోంది. ఇప్పుడు మేల్కొంటారా, లేక చరిత్ర మిమ్మల్ని బాధ్యతారహితులుగా గుర్తించేవరకు వేచి చూస్తారా? ఎంపిక మీదే, ఎందుకంటే సమయం ఎవరి కోసమో ఆగదు!

**డా .సూర్యదేవర రామకృష్ణ,**
**9490754169**

**నకిలీ విత్తనాల కాటుకు**
**రైతన్న గుండె రక్తమౌతుంది,**
**నమ్మకంతో చల్లిన గింజ నేలలోనే నిశ్శబ్దమౌతుంది.**
**మొలకెత్తని ఆశలతో పొలం వెలవెలబోతుంది,**
**అప్పుల బరువుతో రైతు బతుకు భారమౌతుంది.**
**మోసగాళ్ల లాభాల కోసం అన్నదాత కన్నీరు**
**కారుతుంది,**
**నిజమైన విత్తనం, న్యాయమైన రక్షణే రైతాంగాన్ని**
**కాపాడుతుంది.**

టి.నాగరాజు

# నకిలీ విత్తనాల కాటుకు... రైతాంగం బలి!

వ్యవసాయ రంగంలో విత్తనం అత్యంత కీలకమైన ఉత్పాదక సాధనం. రైతు వేసే పంట భవిష్యత్తు, దిగుబడి, ఆదాయం అన్నీ విత్తనం నాణ్యతపై ఆధారపడి ఉంటాయి. ముఖ్యంగా వానాకాలం ప్రారంభమయ్యే సమయంలో రైతులు విత్తనాల కొనుగోలుకు పెద్ద ఎత్తున సిద్ధమవుతారు. ఈ అవకాశాన్ని కొందరు అక్రమ వ్యాపారులు నకిలీ విత్తనాలను మార్కెట్‌లోకి విడుదల చేయడానికి వినియోగిస్తుంటారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నకిలీ విత్తనాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, మొక్కల ఎదుగుదల సరిగా లేకపోవడం, తెగుళ్లు అధికంగా సోకడం, ఆశించిన దిగుబడి రాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. రైతు ఒకసారి నష్టపోతే ఆ ప్రభావం మొత్తం వ్యవసాయ చక్రంపై పడుతుంది. అందుకే నకిలీ విత్తనాల నివారణ కు రైతులు, అధికారులు, విత్తన విక్రేతలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

రైతులు విత్తనాలను కొనుగోలు చేసే ముందు ప్రభుత్వం గుర్తింపు పొందిన డీలర్లు లేదా లైసెన్స్ కలిగిన విక్రయ కేంద్రాల నుంచే కొనుగోలు చేయాలి. విత్తన ప్యాకెట్‌పై కంపెనీ పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీ, మొలక శాతం, ధృవీకరణ గుర్తులు ఉన్నాయో లేదో పరిశీలించాలి. ముఖ్యంగా కొనుగోలు చేసిన ప్రతి విత్తనానికి బిల్లు తీసుకోవడం తప్పనిసరి. భవిష్యత్తులో ఏదైనా సమస్య తలెత్తితే ఆ బిల్లు రైతుకు చట్టపరమైన ఆధారంగా ఉపయోగపడుతుంది. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. రైతులకు నాణ్యమైన విత్తనాల గుర్తింపు, నకిలీ విత్తనాల వల్ల కలిగే నష్టాలపై శిక్షణ ఇవ్వాలి. మార్కెట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాలను మరింత కఠినంగా అమలు చేయడం ద్వారా మాత్రమే ఈ అక్రమ వ్యాపారాన్ని అరికట్టగలం.

నేటి పరిస్థితుల్లో రైతు కేవలం పంట సాగు చేయడమే కాకుండా వినియోగదారుడిగా కూడా అప్రమత్తంగా ఉండాలి. తక్కువ ధరకు వస్తోందని నాణ్యతను విస్మరించడం ప్రమాదకరం. నాణ్యమైన విత్తనం కొనుగోలు చేయడం రైతు హక్కు మాత్రమే కాదు, అతని భవిష్యత్తుకు భరోసా కూడా. భారతదేశ వ్యవసాయ రంగం నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిలో అత్యంత ప్రమాదకరమైనది నకిలీ విత్తనాల వ్యాపారం. రైతు పొలంలో విత్తనం నాటే క్షణం నుంచే అతని భవిష్యత్తు నిర్ణయమవుతుంది. అలాంటి విత్తనమే నకిలీగా మారితే రైతు కష్టం, పెట్టుబడి, ఆశలు అన్నీ ఒక్కసారిగా కూలిపోతాయి. ఇది కేవలం పంట నష్టానికి మాత్రమే పరిమితం కాకుండా, అప్పుల భారానికి, మానసిక వేదనకు, చివరకు రైతు ఆత్మహత్యలకు కూడా దారి తీస్తున్న సామాజిక సమస్యగా మారింది.

దేశంలో ప్రతి ఏటా లక్షలాది మంది రైతులు విత్తనాలపై భారీ మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నారు. అయితే నాణ్యతలేని లేదా నకిలీ విత్తనాల కారణంగా పంటలు విఫలమైన సంఘటనలు అనేక రాష్ట్రాల్లో నమోదవుతున్నాయి. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, కూరగాయల పంటల్లో ఈ సమస్య తీవ్రంగా కనిపిస్తోంది. విత్తనాలు మొలకెత్తకపోవడం, మొక్కల ఎదుగుదల సరిగా లేకపోవడం, దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన వివరాల ప్రకారం, గత కొన్నేళ్లలో పలు రాష్ట్రాల్లో భారీ మొత్తంలో నకిలీ విత్తనాలు స్వాధీనం అయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో నకిలీ విత్తనాల తయారీ, విక్రయాలపై కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ ఈ అక్రమ వ్యాపారం పూర్తిగా అరికట్టబడలేదన్నది వాస్తవం.

అత్యంత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, నకిలీ విత్తనాల వల్ల కలిగే పంట నష్టాలు రైతులను తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నాయి. రైతు ఒక పంట కోసం అప్పులు చేసి పెట్టుబడి పెడతాడు. పంట విఫలమైతే అప్పు తీర్చలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితుల్లో అనేక మంది రైతులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దేశవ్యాప్తంగా నమోదవుతున్న రైతు ఆత్మహత్యల్లో నకిలీ విత్తనాలు ఒక పరోక్ష కారణంగా అనేక రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వ గణాంకాల్లో "నకిలీ విత్తనాల వల్లే ఆత్మహత్య" అని ప్రత్యేకంగా నమోదు చేసే విధానం లేకపోవడం వల్ల అసలు సమస్య తీవ్రత పూర్తిగా బయటకు రావడం లేదు.

జాతీయ నేర గణాంకాల బ్యూరో నివేదికలు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు చూపిస్తున్నాయి. ఈ మరణాల వెనుక అప్పులు, పంట వైఫల్యాలు, మార్కెట్ సమస్యలు, ప్రకృతి వైపరీత్యాలు వంటి అనేక కారణాలు ఉంటాయి. అయితే పంట వైఫల్యానికి నకిలీ విత్తనాలు కూడా ఒక ముఖ్య కారణంగా నిలుస్తున్నాయనే విషయాన్ని విస్మరించలేం.

ఇలాంటి పరిస్థితుల్లో కేవలం రైతులను అప్రమత్తం చేయడం సరిపోదు. నకిలీ విత్తనాల తయారీ, నిల్వ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. విత్తనాల విక్రయ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. నేరస్తులపై కఠిన శిక్షలు అమలు చేయాలి. అదే సమయంలో నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందించే వ్యవస్థను బలోపేతం చేయాలి.

రైతు దేశానికి అన్నదాత. అతని చేతిలోని విత్తనం నాణ్యంగా ఉంటేనే దేశ ఆహార భద్రత సురక్షితంగా ఉంటుంది. నకిలీ విత్తనాల వ్యాపారం రైతు



జీవితాలతో చేసే చెలగాటం మాత్రమే కాదు, దేశ వ్యవసాయ భవిష్యత్తుపై జరిగే దాడి కూడా. ఈ మౌన విపత్తును అరికట్టడం ప్రభుత్వాలు, అధికారులు, విత్తన కంపెనీలు, రైతు సంఘాలు మరియు సమాజం మొత్తం బాధ్యతగా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. వ్యవసాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఒక పంట విజయంలో 20 నుంచి 25 శాతం వరకు ప్రభావం విత్తనం నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. నకిలీ లేదా నాణ్యతలేని విత్తనాలు మొలక శాతాన్ని తగ్గించడంతో పాటు దిగుబడిని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. కేంద్ర వ్యవసాయ శాఖ పార్లమెంట్‌లో వెల్లడించిన సమాచారం ప్రకారం, గత కొన్నేళ్లలో దేశవ్యాప్తంగా వేలాది క్వింటాళ్ల నకిలీ, నాణ్యతలేని విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో నకిలీ విత్తనాల విక్రయాలపై వందలాది కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2015–2022 మధ్య కాలంలో 21,724 టన్నుల నకిలీ లేదా నాణ్యతలేని విత్తనాలు స్వాధీనం కాగా, తెలంగాణలో 1.17 లక్షల టన్నులకు పైగా విత్తనాలు పట్టుబడినట్లు కేంద్ర ప్రభుత్వ సమాచారం చెబుతోంది. ఇది సమస్య తీవ్రతకు నిదర్శనం. జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్ సి ఆర్ బి ) గణాంకాల ప్రకారం దేశంలో ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 2022లో దేశవ్యాప్తంగా 11 వేలకుపైగా రైతులు, వ్యవసాయ రంగానికి చెందిన వ్యక్తులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు నమోదైంది."నకిలీ విత్తనాలకు రాష్ట్రాల సరిహద్దులు లేవు. ఒక రాష్ట్రంలో తయారై, మరో రాష్ట్రంలో ప్యాక్ అయి, ఇంకో రాష్ట్రంలో రైతు చేతికి చేరుతున్నాయి. అందుకే ఇది ఒక్క రాష్ట్ర సమస్య కాదు; జాతీయ వ్యవసాయ భద్రతకు సంబంధించిన సమస్య. తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు తరచూ ఈ కేసుల్లో ప్రస్తావనకు వస్తున్నప్పటికీ, దేశవ్యాప్తంగా నకిలీ విత్తనాల మాఫియా వేర్లు విస్తరించాయని దర్యాప్తులు సూచిస్తున్నాయి."నకిలీ విత్తనం పొలంలో పడితే పంట నష్టం; మార్కెట్‌లో అమ్మితే రైతు నష్టం; దాన్ని అరికట్టకపోతే దేశానికే నష్టం. అందుకే నకిలీ విత్తనాలపై యుద్ధం ప్రతి ఒక్కరి బాధ్యత. వ్యవసాయంలో నాణ్యమైన విత్తనం మంచి దిగుబడికి పునాది. అలాంటి విత్తనాల స్థానంలో నకిలీ విత్తనాలు రైతు చేతికి చేరితే పంట నష్టం, అప్పుల భారం, ఆర్థిక సంక్షోభం తప్పదు. అందువల్ల నకిలీ విత్తనాల నివారణకు ప్రభుత్వం, అధికారులు, విత్తన కంపెనీలు, రైతులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. నకిలీ విత్తనాల తయారీ, నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దాడులు నిర్వహించాలి. అక్రమ వ్యాపారులపై కఠిన చట్టాలు అమలు చేసి వేగంగా శిక్షలు విధించాలి. విత్తనాల నాణ్యత పరీక్షల కోసం ప్రతి జిల్లాలో ప్రత్యేక ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలి. విత్తన ప్యాకెట్లపై క్యూ ఆర్ కోడ్ లేదా డిజిటల్ ట్రాకింగ్ విధానం అమలు చేయాలి. నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందించాలి. వ్యవసాయ శాఖ బాధ్యతగా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. సీజన్ ప్రారంభానికి ముందే విత్తన విక్రయ కేంద్రాల తనిఖీలు చేపట్టాలి. రైతులకు నాణ్యమైన విత్తనాల గుర్తింపు పద్ధతులపై శిక్షణ ఇవ్వాలి. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.

తప్పనిసరిగా బిల్లు తీసుకుని భద్రపరచుకోవాలి. ప్యాకెట్‌పై బ్యాచ్ నంబర్, గడువు తేదీ, మొలక శాతం వంటి వివరాలు పరిశీలించాలి. చౌక ధరలకు ఆశపడి గుర్తింపు లేని విక్రేతల వద్ద కొనుగోలు చేయకూడదు. మొలకలో సమస్యలు కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఈ విదంగా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి.

విత్తన కంపెనీల పాత్ర అతి కీలకమైనది. నాణ్యత నియంత్రణను కఠినంగా అమలు చేయాలి. తమ బ్రాండ్ పేరుతో నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రైతులకు నేరుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. వ్యవసాయంలో "మంచి విత్తనం – మంచి పంట" అనే సూత్రం ఎప్పటికీ మారదు. వానాకాలంలో రైతులు అప్రమత్తంగా ఉండి నకిలీ విత్తనాలకు దూరంగా ఉంటేనే పంటలు బాగుంటాయి, దిగుబడులు పెరుగుతాయి, రైతు కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుంది. నకిలీ విత్తనాలపై యుద్ధం కేవలం అధికారులదే కాదు, ప్రతి రైతు బాధ్యత కూడా. రైతు జాగ్రత్తే నకిలీ విత్తనాలకు చెక్ పెట్టగలదు.



**డాక్టర్ మోటె చిరంజీవి**
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327

# ఆధునిక భారతదేశానికి పునాదులు వేసిన నెహ్రూ

స్వాతంత్ర్యం సాధించిన తరువాత భారతదేశం ఎదుర్కొన్న అతిపెద్ద ప్రశ్న ఏమిటంటే – రాజకీయ స్వేచ్ఛను ఆర్థిక, శాస్త్రీయ, పారిశ్రామిక శక్తిగా ఎలా మార్చాలి? బ్రిటిష్ పాలన దేశానికి రైల్వేలు, కొన్ని పరిపాలనా వ్యవస్థలు వదిలి వెళ్లినప్పటికీ, భారతదేశం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత, పేద, నిరక్షరాస్య దేశంగానే మిగిలింది. ఉక్కు పరిశ్రమలు లేవు, భారీ యంత్రాల తయారీ లేదు, శాస్త్రీయ పరిశోధన పరిమితంగా ఉంది, ఉన్నత సాంకేతిక విద్యాసంస్థలు దాదాపు లేవు. ఇలాంటి సమయంలో ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ దేశ నిర్మాణాన్ని కేవలం రాజకీయ కార్యక్రమంగా కాకుండా నాగరికత పునర్నిర్మాణంగా చూశారు.

నెహ్రూ అభివృద్ధి నమూనాకు మూడు ప్రధాన స్తంభాలు ఉన్నాయి. మొదటిది భారీ పరిశ్రమలు, రెండవది శాస్త్ర–సాంకేతిక విద్య, మూడవది నీటి పారుదల–విద్యుత్ ప్రాజెక్టులు. వీటిని ఆయన "ఆధునిక భారతదేశ దేవాలయాలు"గా అభివర్ణించారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రారంభించిన తొలి పంచవర్ష ప్రణాళిక (1951––1956) ప్రధానంగా వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధిపై దృష్టి పెట్టింది.

రెండవ పంచవర్ష ప్రణాళిక (1956––1961) దేశ పారిశ్రామిక విప్లవానికి పునాది వేసింది. ఆర్థికవేత్త పి.సి. మహలనోబిస్ రూపొందించిన నమూనాను అనుసరించి భారీ పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. నెహ్రూ కాలంలో ప్రారంభమైన అతిపెద్ద బహుళార్థక నదీ లోయ ప్రాజెక్టులలో దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (1948, ఝార్ఖండ్–పశ్చిమ బెంగాల్ ప్రాంతం) ముఖ్యమైనది. అమెరికాలోని టెన్నెస్సీ వ్యాలీ అథారిటీ నమూనాలో దీనిని రూపొందించారు. వరద నియంత్రణ, విద్యుత్ ఉత్పత్తి, సాగునీటి సరఫరా వంటి అనేక ప్రయోజనాలను ఇది అందించింది. భాక్రా–నంగల్ ఆనకట్ట (నిర్మాణ ప్రారంభం 1948, పంజాబ్–హిమాచల్ ప్రదేశ్ సరిహద్దు) స్వతంత్ర భారతదేశానికి ప్రతీకగా నిలిచింది. సట్లెజ్ నదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టు ఉత్తర భారత వ్యవసాయ రంగాన్ని పూర్తిగా మార్చేసింది. హరిత విప్లవం విజయానికి ఇది కీలక మౌలిక వసతిని అందించింది.

హీరాకుడ్ ఆనకట్ట (1957, సంబల్పూర్ జిల్లా, ఒడిశా) ప్రపంచంలోని పొడవైన మట్టి ఆనకట్టలలో ఒకటిగా గుర్తింపు పొందింది. వరద నియంత్రణ, విద్యుత్ ఉత్పత్తి, సాగునీటి సరఫరాలో ఇది గొప్ప పాత్ర పోషించింది.


నాగార్జునసాగర్ ప్రాజెక్టు (1955లో శంకుస్థాపన, నల్గొండ–పల్నాడు ప్రాంతం, తెలంగాణ–ఆంధ్రప్రదేశ్) దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద నీటిపారుదల ప్రాజెక్టులలో ఒకటి. కృష్ణా నదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించింది.

తుంగభద్ర ప్రాజెక్టు (1953, కర్నాటక–ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతం), గాంధీ సాగర్ ఆనకట్ట (1960, మందసౌర్ జిల్లా, మధ్యప్రదేశ్), చంబల్ లోయ ప్రాజెక్టు (రాజస్థాన్––మధ్యప్రదేశ్) కూడా నెహ్రూ అభివృద్ధి దృష్టికి నిదర్శనాలు. భారీ పరిశ్రమల రంగంలో నెహ్రూ చేసిన కృషి భారత ఆర్థిక చరిత్రలో ప్రత్యేక అధ్యాయం. భిలాయ్ స్టీల్ ప్లాంట్ (1955, దుర్గ్ జిల్లా, నేటి ఛత్తీస్‌గఢ్) సోవియట్ యూనియన్ సహకారంతో నిర్మించబడింది. రూర్కెలా స్టీల్ ప్లాంట్ (1955, సుందర్‌గఢ్ జిల్లా, ఒడిశా) పశ్చిమ జర్మనీ సహకారంతో ఏర్పడింది. దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్ (1957, పశ్చిమ బెంగాల్) బ్రిటన్ సహకారంతో నిర్మించబడింది. ఈ మూడు ఉక్కు కర్మాగారాలు భారత పారిశ్రామికీకరణకు వెన్నెముకగా మారాయి.

హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ (1958, రాంచీ, నేటి ఝార్ఖండ్) దేశంలో భారీ యంత్రాల తయారీకి కేంద్రంగా మారింది. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ – భెల్ (1964, భోపాల్, మధ్యప్రదేశ్‌లో తొలి యూనిట్) స్థాపనకు నెహ్రూ కాలంలోనే పునాది పడింది. విద్యుత్ ఉత్పత్తి పరికరాలు, టర్బైన్లు, పారిశ్రామిక యంత్రాల తయారీలో భెల్ దేశ స్వావలంబనకు తోడ్పడింది. చమురు రంగంలో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ – ఓఎన్‌జీసీ (1956, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్) స్థాపన చారిత్రక ఘట్టం. దేశీయ చమురు, సహజవాయువు అన్వేషణకు ఇది ప్రధాన సంస్థగా ఎదిగింది.

భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో బ్యాంకింగ్ రంగానికీ ప్రాధాన్యత ఇచ్చారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (1955, ముంబై ప్రధాన కార్యాలయం, మహారాష్ట్ర) ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలను విస్తరించే ప్రయత్నం జరిగింది.

విద్యా రంగంలో నెహ్రూ చూపిన దూరదృష్టి నేటికీ భారతదేశానికి గొప్ప ఆస్తిగా నిలిచింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఖరగ్‌పూర్ – ఐఐటీ (1951, పశ్చిమ బెంగాల్) స్వతంత్ర భారతదేశ తొలి సాంకేతిక విద్యాసంస్థ. తరువాత ఐఐటీ బొంబాయి (1958, మహారాష్ట్ర), ఐఐటీ మద్రాస్ (1959, తమిళనాడు), ఐఐటీ కాన్పూర్ (1959, ఉత్తరప్రదేశ్), ఐఐటీ ఢిల్లీ



(1961, ఢిల్లీ) స్థాపించబడ్డాయి. నేడు ప్రపంచవ్యాప్తంగా భారత ఇంజనీర్ల ప్రతిభకు ఇవే ప్రధాన కేంద్రాలుగా గుర్తింపు పొందుతున్నాయి.

నిర్వహణ విద్యలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కలకత్తా – ఐఐఎం (1961, పశ్చిమ బెంగాల్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ – ఐఐఎం (1961, గుజరాత్) స్థాపించబడ్డాయి. ఇవి భారత కార్పొరేట్ రంగానికి నాయకత్వాన్ని అందించాయి.

ఆరోగ్య రంగంలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ – ఎయిమ్స్ (1956, న్యూఢిల్లీ) స్థాపన భారత వైద్య చరిత్రలో మైలురాయి. అత్యున్నత వైద్య విద్య, పరిశోధన, చికిత్సకు ఇది కేంద్రంగా మారింది.

శాస్త్రీయ పరిశోధనకు నెహ్రూ అపార ప్రాధాన్యత ఇచ్చారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ – సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలో అనేక జాతీయ ప్రయోగశాలలు అభివృద్ధి చెందాయి. నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ (న్యూఢిల్లీ), నేషనల్ కెమికల్ లాబొరేటరీ (పుణే), నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ (జంషెడ్‌పూర్) వంటి సంస్థలు శాస్త్రీయ పరిశోధనకు బలమైన పునాదులు వేశాయి.

అణుశక్తి రంగంలో డాక్టర్ హోమీ జహంగీర్ భాభాతో కలిసి నెహ్రూ చేసిన కృషి విశేషమైనది. అటామిక్ ఎనర్జీ కమిషన్ (1948, ముంబై), ట్రాంబే అణుశక్తి కేంద్రం (1954, ముంబై) స్థాపించబడ్డాయి. తరువాత ఇదే భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌గా అభివృద్ధి చెందింది. నేడు భారత అణుశక్తి కార్యక్రమానికి ఇది కేంద్రబిందువుగా ఉంది. అంతరిక్ష పరిశోధనలో కూడా నెహ్రూ దూరదృష్టి కనిపిస్తుంది. 1962లో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ ఏర్పడింది. ఇదే తరువాత భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు పునాది అయింది. నేడు చంద్రయాన్, మంగళయాన్ విజయాల వెనుక ఆ ప్రారంభ దశలో వేసిన పునాదులే ఉన్నాయి.

వ్యవసాయ రంగంలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (1952), నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ (1953) వంటి కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి దోహదపడ్డాయి. వ్యవసాయ విశ్వవిద్యాలయాల స్థాపనకు కూడా నెహ్రూ ప్రోత్సాహం అందించారు. తరువాతి హరిత విప్లవానికి అవసరమైన మౌలిక వసతులు ఆయన కాలంలోనే ఏర్పడ్డాయి.

చివరిగా... నెహ్రూ వారసత్వాన్ని అంచనా వేయడంలో కేవలం రాజకీయ కోణం సరిపోదు. ఆయన నిర్మించిన సంస్థలను పరిశీలిస్తే ఒక సర్వసమగ్ర దృష్టి కనిపిస్తుంది. ఒకవైపు ఉక్కు కర్మాగారాలు, మరోవైపు ఐఐటీలు; ఒక వైపు ఆనకట్టలు, మరోవైపు పరిశోధనా ప్రయోగశాలలు; ఒకవైపు ప్రజాస్వామ్య వ్యవస్థలు, మరోవైపు అణుశక్తి కార్యక్రమం – ఇవన్నీ కలిసి ఆధునిక భారతదేశ నిర్మాణానికి పునాదులయ్యాయి. నేడు భారతదేశం ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఎదగడానికి అనేక తరాల కృషి కారణం.

అయితే ఆ ప్రయాణానికి ప్రారంభ పటాన్ని గీసిన నాయకులలో జవహర్‌లాల్ నెహ్రూ స్థానం ప్రత్యేకమైనది. ఆయనను విమర్శించవచ్చు, ఆయన విధానాలను పునర్మూల్యాంకనం చేయవచ్చు. కానీ స్వాతంత్ర్యం పొందిన వెంటనే ఒక వెనుకబడిన దేశాన్ని శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక, ప్రజాస్వామ్య మార్గంలో నడిపించేందుకు చేసిన ప్రయత్నాన్ని విస్మరించడం చరిత్ర పట్ల అన్యాయం అవుతుంది. భారతదేశం అనే ఆధునిక జాతీయ నిర్మాణంలో నెహ్రూ వేసిన పునాదులు ఇప్పటికీ అనేక రంగాలలో స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

# ప్రభుత్వ విద్య, వైద్య రంగాల పరిరక్షణకే ఉద్యమాలు

- **కేవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు**



**వీపనగండ్ల, జూన్ 12 (జనం సాక్షి) :** అట్టడుగు పేదలకు ప్రభుత్వ విద్య, వైద్య రంగాలు ప్రజల ప్రాథమిక హక్కులని, వాటి పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగాదశలవారి పోరాటాలు నిర్వహించనున్నట్లు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కేవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు గంధం భగత్ అధ్యక్షతన నిర్వహించిన కేవిపిఎస్ జిల్లా సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన స్కైలాబ్ బాబు మాట్లాడుతూ విద్య అనేది సామాజిక అభివృద్ధికి మూలస్తంభమని, గ్రామీణ పేదలు, దళితులు, బడుగు బలహీన వర్గాల పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలే వారికి ఆశాకిరణాలని అన్నారు.రాష్ట్రంలో12వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి వాటి స్థానంలో పరిమిత సంఖ్యలో మండల కేంద్రాలలో 4000పాఠశాలలు నెలకొల్పాలని ప్రభుత్వం చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించడం ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.పల్లెల్లో విద్యా సదుపాయాలు తగ్గిపోతే విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే పాఠశాలలు, ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమి వంటి సమస్యలు ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పేద కుటుంబాలకు నాణ్యమైన విద్య అందకపోతే సామాజిక అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.గురుకులాల విస్తరణ పేరుతో సంక్షేమ హాస్టళ్లను బలహీనపరిచే చర్యలు సరికాదని, పేద విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రతి విద్యా అవకాశాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు.మే 24న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కోట్లాదిమంది దళితులకు రాజ్యాంగ హక్కులను దూరం చేస్తుందని తద్వారా రాజ్యాంగంలోని ఆర్టికల్ 15,16లను తిరస్కరిస్తుందని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వమే సుప్రీం కోర్టుకు అప్పీలు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది,మందులు,పరీక్షా పరికరాల కొరత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. పేదలకు ఉచిత, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆగస్టు సెప్టెంబరు నెలలో డెంగ్యూ,విష జరాల బారిన పడతారని, వారందరికీ సరిపోను బెడ్లు లేక నేలపై పడబెట్టిన పరిస్థితులు చాలా సందర్భంలో జిల్లా స్థాయి హాస్పిటల్ లో కనిపించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్న ఆచరణలో పేదలకు మెరుగైన వైద్యం అందటం లేదని విమర్శించారు. తదితర అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, మండలాల్లో విద్యా, వైద్య రంగాల పరిస్థితిపై సమగ్ర సర్వే నిర్వహించి ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.జూన్ 15 నుండి పాఠశాలలు ప్రారంభం కానున్నాయని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు,అవసరమైన సౌకర్యాలు వెంటనే అందించాలని, ప్రతి పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల నియామకం వంటి అంశాలను ప్రాధాన్యతగా పరిష్కరించాలని కోరారు. జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో కుల రహిత సమాజం కోసం కెవిపిఎస్ అనేక ఉద్యమాలు కొనసాగిస్తూ ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ సమావేశంలో కేవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులువెంకట్రాములు,జిల్లా సహాయ కార్యదర్శి మురళీ,గట్టయ్య పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



**నిజాంపేట్, జూన్ 12 (జనం సాక్షి) :** అంగన్‌వాడిలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ కేంద్రాలను రద్దుచేసి ఈ కేంద్రాలను అంగన్వాడీలకు అప్పగిస్తూ వెంటనే ప్రభుత్వం నిర్ణయం చేయాలని వివిధ సమస్యలు పరిష్కారం చేయాలని దుండిగల్ తహసిల్దార్, డిప్యూటీ కమిషనర్ కి సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు ఆయాలు శుక్ర వారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ లింగస్వామి మాట్లాడుతూ ప్రతినెల 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని కోరారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 18 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని పిఎఫ్ సౌకర్యం కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో అంగన్వాడీ టీచర్స్ ఆయాలకు గ్రాడ్యుటి అమలు చేయాలని తెలిపారు. ఎఫ్ ఆర్ ఎస్ ను రద్దుచేసి ఒకే ఆన్లైన్ యాప్ ఉండే విధంగా నిర్ణయం చేయాలని కోరారు ఐసిడిఎస్‌కు సంబంధంలేని అదనపు పనులను చేయించకూడదని బి ఎల్ ఓ డ్యూటీలు రద్దు చేయాలని తెలిపారు. అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ కు ప్రభుత్వ సంక్షేమ పథకాలను నీటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు రాధా ప్రేమలత అశ్విని నాగరాణి మంజుల సునీత ప్రభావతి బాలమని జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# డీజిల్ పొదుపుపై ఉద్యోగుల్లో సామాజిక బాధ్యత పెరగాలి

- **డీజిల్ ఆదా కోసం సాంకేతిక పద్ధతులతో మైలేజీ పెంపు**
- **టీజిఎస్ ఆర్టిసి ఎండీ వై. నాగిరెడ్డి**



**ముషీరాబాద్, జూన్ 12 (జనం సాక్షి) :** ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభం, నిరంతరం పెరుగుతున్న డీజిల్ ధరల నేపథ్యంలో సంస్థపై పడుతున్న భారీ నిర్వహణ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆర్టీసీ 'బస్ భవన్'లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో "డీజిల్ నిర్వహణ – అవగాహన సదస్సు" నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఇంధన ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ఇది రవాణా రంగంపై, ముఖ్యంగా ఆర్టీసీపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక భారాన్ని సమర్థవంతంగా అధిగమించాలంటే డీజిల్ వినియోగాన్ని క్రమబద్ధీకరించడం, ప్రతి లీటరు ఇంధనాన్ని పొదుపుగా వాడుతూ వృథాను అరికట్టడం ఒక్కటే సరైన మార్గమని స్పష్టం చేశారు. ఇందుకోసం డిపోల స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని గరిష్ఠంగా ఉపయోగించుకోవాలని, వాహనాల ఫిట్‌నెస్‌తో పాటు ఉత్తమ నిర్వహణ పద్ధతులను నిరంతరం అలవర్చుకోవాలని అధికారులకు, సాంకేతిక సిబ్బందికి సూచించారు. కేవలం ఇదొక విధి నిర్వహణ మాత్రమే కాదని, ప్రతి ఉద్యోగికి ఇంధన పొదుపుపై ఒక సామాజిక బాధ్యత ఉండాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి డీజిల్‌ను ఆదా చేయడం ద్వారా సంస్థను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా మన వంతు సహకారం అందించినవారమవుతామని పేర్కొన్నారు. ఈడీ సిహెచ్.వెంకన్న, ఫైనాన్సియల్ అడ్వైజర్ విజయపుష్ప, బీపీసీఎల్ తెలంగాణ హెడ్ లక్ష్మీ లాల్ చౌహన్ , మార్కెటింగ్ మేనేజర్ రఘునాథరావ్, ఆర్టీసీ సీసీఎస్ ప్రభులత, పలువురు డిప్యూటీ ఆర్ఎం లు, డిపో మేనేజర్లు పాల్గొని డెపోలలో ని గ్రౌండ్ ట్యాంక్ ల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. బస్సుల డీజిల్ మైలేజీని (కే ఎం పి ఎల్) గణనీయంగా పెంచడానికి, గ్యారేజ్ పరిధిలో సాంకేతిక లోపాలను సకాలంలో గుర్తించి నివారించడానికి తీసుకోవాల్సిన వివిధ రకాల జాగ్రత్తలపై నిపుణులు సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.

# నకిలీ పత్తి విత్తనాల ముఠా అరెస్ట్

- **30 లక్షల విలువైన సామాగ్రి సీజ్**




**మల్కాజిగిరి, జూన్ 12 (జనంసాక్షి) :** రైతులను మోసం చేస్తూ నకిలీ పత్తి విత్తనాలను విక్రయించేందుకు యత్నిస్తున్న ముఠాను మల్కాజిగిరి ఎస్ఓటీ టీమ్–2, తిరుమలగిరి పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ నిందితులను రిమాండ్ కు తరలించారని కమిషనర్ సుమతి తెలిపారు, నేరెడ్ మెట్ లోని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఆమె వివరాలు వెల్లడించారు.గుజరాత్‌కు చెందిన నర్మదా సాగర్ అగ్రి సీడ్స్ మార్కెటింగ్ మేనేజర్ సోలంకే యశ్వంత్ రావు ఇచ్చిన ఫిర్యాదుతో బోయిన్పల్లి మార్కెట్ దగ్గర వాహనాల తనిఖీలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా,హైదరాబాద్ బండ్లగూడకు చెందిన న్యూ రైతు సంపద సీడ్స్ ఎండీ యెరువ బాలశౌరి రెడ్డి అలియాస్ శివారెడ్డి (32) వ్యాపారంలో నష్టాలు రావడంతో నకిలీ విత్తనాల దందాకు తెరలేపాడు. గుజరాత్ కంపెనీ పేరుతో నకిలీ ప్యాకెట్లను తయారు చేసి, వాటిలో నాణ్యత లేని విత్తనాలను నింపి మార్కెట్లో విక్రయించాలని పథకం వేశాడు. దీనికోసం జీడిమెట్లకు చెందిన గ్రాఫిక్ డిజైనర్ దొంగ శ్రీను (48)తో పౌచ్ డిజైన్ చేయించి, బహదూర్‌పల్లిలోని ట్రూప్యాక్ ఫ్లెక్సిబుల్స్ కంపెనీలో ప్రింట్ చేయించాడు. తన వద్ద సేల్స్ ఆఫీసర్‌గా పనిచేసే కపర్తి బెంజిమెన్ (28) సహాయంతో వీటిని తరలిస్తుండగా, బోయినపల్లి వెజిటెబుల్ మార్కెట్ యార్డ్ వద్ద పోలీసులు వాహనాన్ని అడ్డుకుని ముగ్గురిని పట్టుకున్నారు. నిందితుడు శివారెడ్డిపై గతంలో షాద్‌నగర్, రాజేంద్రనగర్, భూత్‌పూర్ పోలీస్ స్టేషన్లలో నకిలీ విత్తనాలకు సంబంధించిన కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని.వారి నుంచి రూ.30 లక్షల విలువైన 12,800 నకిలీ విత్తన పౌచ్‌లు, 2,000 కిలోల లూజ్ పత్తి విత్తనాలు, ఒక ఈకో వాహనం, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.నకిలీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని, ఇలాంటి ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఈ సమావేశంలో డిసిపి శ్రీధర్, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తిరుమలగిరి ఎస్‌హెచ్ఓ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్యను కేంద్రాలను వెంటనే రద్దు చేయాలి



**కాప్రా, జూన్ 12 (జనం సాక్షి) :** ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్య కేంద్రాలను అంగన్వాడీలకే అప్పచెప్పాలని వాటిని ప్రత్యేకంగా నిర్వహించే పద్ధతిని ప్రభుత్వం మానుకోవాలని సిఐటియు కాప్రా మండల కమిటీ కార్యదర్శి పి గణేష్ డిమాండ్ చేశారు. కాప్రా మండల ఆఫీస్ వద్ద అంగన్వాడీ టీచర్స్ అండ్ యూనియన్ నాయకత్వంలో ధర్నా నిర్వహించి ఎమ్మార్వో మతిన్ కు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కామ్రేడ్ రామ. మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్య విధానంలో భాగంగా అంగన్వాడీల కేంద్రాలకు ఎసురు పెట్టే కార్యక్రమానికి పూనుకొన్నదని విమర్శించారు. అందులో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూల్ ను మరియు పిఎం శ్రీ విద్యను ప్రవేశపెడుతున్నారని అన్నారు.అంగన్‌వాడీలకు నష్టం కలిగించే ప్రీ ప్రైమరీ స్కూల్ పి.ఎం.శ్రీ విద్యను గ్రామములో అమలు చేయమని వాటిని అంగన్‌వాడీ లకు అప్పజెప్పాలని కోరుతూ తీర్మాణం చేసి రాష్ట్ర ప్రభుత్వం పంపాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పాటించడం దారుణమని విమర్శించారు. ప్రీ ప్రైమరీ మరియు పీఎం శ్రీ కేంద్రాలను అంగన్‌వాడీలకే అప్పచెప్పుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. 30 నుండి 40 సంవత్సరాలగా సేవలందిస్తున్న అంగన్వాడి టీచర్లకు మరియు హెల్పర్లకు ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ప్రీ ప్రైమరీ పాఠశాలలతో వారి ఉద్యోగాల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు ప్రమాదంగా మారిన ప్రీ ప్రైమరీ ,పి.ఎం.శ్రీ 4,131 కేంద్రాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు బాలమని, పద్మ మహేశ్వరి సుజాత సంధ్య రాణి,తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది




**హయత్‌నగర్, జూన్ 12 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రంగారెడ్డి జిల్లా ప్రాంతీయ కార్యాలయ సహాయక పర్యావరణ ఇంజనీర్ జి.స్వప్న, ఆదాని సిమెంట్స్ వారి సహకారంతో జాగృతి అభ్యుదయ సంఘం దేవాలయాలకు ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా, తిరిగి వాడుకునే పర్యావరణ ఉత్పత్తుల ఉచిత పంపిణీని ప్రారంభించారు. నిత్యాన్న దానంలో స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులే వాడుతున్నాం. పీసీబీ, జాగృతి అభ్యుదయ సంఘం ఇచ్చిన ప్రోత్సాహంతో తమ దేవాలయంలో సంపూర్ణంగా ప్లాస్టిక్ వినియోగం నిషేధిస్తాము, అని పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ ఛైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య, కమిటీ సభ్యులు ప్రమాణం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం 16 సం.ల పైగా కృషి చేస్తున్న జాగృతి అభ్యుదయ సంఘం ఛైర్మన్ భావన శ్రీనివాస్ సభాధ్యక్షతన వనస్థలిపురం లోని సచివాలయ నగర్ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం వేదికగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రంగారెడ్డి జిల్లా ప్రాంతీయ అధికారి జి స్వప్న ముఖ్యఅతిథిగా హాజరై, జ్యూట్ బ్యాగ్ లు, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు స్పూన్లు, ప్రసాదం డొప్పలను జాగృతి అభ్యుదయ సంఘం ద్వారా దేవాలయ కమిటీ లకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా జి. స్వప్న మాట్లాడుతూ ఉదయం కళ్లుతెరవగానే చేతికి అందే టూత్‌బ్రష్ నుంచి రాత్రి పడుకునేటప్పుడు కప్పుకునే బెడ్‌షీట్ వరకు మన జీవితం ప్లాస్టిక్‌తో ముడిపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అనూప్, శ్రీధర్, సలహాదారు శ్రీనివాస్, సిబ్బంది, సేవకులు, జాగృతి ప్రతినిధులు శ్రీరంగనాథ్, యాదా రామలింగేశ్వరరావు, శ్రీరాములు గౌడ్, సత్యనారాయణ, రమణయ్య, మహిళలు పాల్గొన్నారు.

## పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



**అల్వాల్, జూన్ 12 (జనంసాక్షి) :** డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డిని కోరారు. గురువారం కమిషనర్‌ను కలిసి పలు అభివృద్ధి పనులపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ కాలనీలలో సీసీ రోడ్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రహదారుల దుస్థితి కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీసీ రోడ్లు నిర్మిస్తే రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. భారతి నగర్‌లో వర్షాకాలంలో తరచూ నీరు నిల్వ ఉండటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, అక్కడ స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. డ్రెయిన్ వ్యవస్థ లేకపోవడం వల్ల వర్షపు నీరు కాలనీల్లోకి చేరుతోందని తెలిపారు. అలాగే లోత్‌కుంట ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న బాక్స్ డ్రెయిన్ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పనులు పూర్తయితే స్థానికులకు భద్రతతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. వినతులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు సమాచారం.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**వెల్దండ, జూన్ 12 (జనంసాక్షి) :** వెల్దండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మండలంలోని సర్పంచులు, ఎమ్మార్వో కార్తీక్ కుమార్,ఎంపీడీవో ఈసం కృష్ణయ్య మరియు వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మరియు పెండింగ్‌లో ఉన్న పనుల పురోగతిపై సమగ్రంగా చర్చించారు.కార్యక్రమంలో సర్పంచులు తమ గ్రామాలకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి పనుల అవసరాలు మరియు ప్రజల నుంచి వచ్చిన వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని ఎమ్మెల్యే శ్రద్ధగా స్వీకరించి, ప్రతి సమస్యను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని తగిన విధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- **శాశ్వత నియామకాలు చేపట్టాలి**
- **సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి. పర్వతాలు**



**చేవెళ్ల, జూన్ 12 (జనంసాక్షి) :** ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రంవిడుదల చేయాలని, శాశ్వత నియామకాలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు అన్నారు. ఏఐవైఎఫ్ చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా,ప్రభుత్వం మాత్రం హామీలు, ప్రకటనలతో కాలయాపన చేస్తోందని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయకుండా ప్రభుత్వ విద్యాసంస్థల మూసివేత సరికాదని అఖిల భారత యువజన తీవ్రంగా విమర్శించారు. ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, ఇప్పటికీ రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఉన్న భారీ ఖాళీలను పూర్తిస్థాయిలో భర్తీ చేయడంలో విఫలమైందన్నారు. యువతకు ఉద్యోగాలపై ఆశలు చూపించి, ఇప్పుడు నియామకాల విషయంలో స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఆయన విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగం కూడా తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమి, నిధుల కొరత కారణంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీనపడుతుండగా, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరిట విద్యార్థులు, తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సరికావని, 27వేలకు పైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను 4,000 సమీకృత పాఠశాలలుగా మార్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివకుమార్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తున్నాడని ఆయన విమర్శించారు. 8వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్య హక్కు అయినప్పటికీ, విద్యార్థులు అప్పులు చేసి చదువుకునే పరిస్థితిని ప్రభుత్వాలు సృష్టిస్తున్నాయన్నారు. ఉద్యోగాల భర్తీకి బదులుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం యువత భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని అన్నారు. ఖాళీ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయకుండా కాంట్రాక్టు విధానాలతో నెట్టుకొస్తే ప్రజా సేవల నాణ్యత దెబ్బతింటుందని వారు అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతమైన ఉద్యమాలు చేపట్టడం తప్ప మరో మార్గం ఉండదని శివకుమార్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కే.శివ, మధు, జలీల్, సుధాకర్, అనంత్, శివ రాజు, రమేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- హేమంత కేశవ్ పాటిల్



**కల్వకుర్తి రూరల్, జూన్ 12 (జనంసాక్షి) :** గురువారంఉదయంనాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణ మున్సిపల్ పరిధిలోని పలు అభివృద్ధిపనులు, సంక్షేమకార్యక్రమాలనుప్రజలకుమెరుగైనమౌలిక సదుపాయాలు,సంక్షేమ పథకాల అమలులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు,నాణ్యమైన సంక్షేమ సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదని పని కలెక్టర్ అన్నారు.కల్వకుర్తి పట్టణ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్నపలుఅభివృద్ధి పనులు,సంక్షేమ కార్యక్రమాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు,జిల్లా కలెక్టర్ హేమంతకేశవ్ పాటిల్ అధికారులనుఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్,నిర్మాణంలో ఉన్న 100,పడకలప్రభుత్వ ఆసుపత్రి,క్యాటిల్ మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్ ఆయా పనుల పురోగతిని సమీక్షించారు.ప్రజలకు ఉపయోగపడే ప్రతి ప్రాజెక్టు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి కావాలని,వాటి నిర్వహణలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మొదటగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించిన కలెక్టర్, షాపుల కేటాయింపు విధానం,వినియోగ పరిస్థితులు, అందుబాటులోఉన్న మౌలిక సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ వాణిజ్య సముదాయం ద్వారా స్థానిక యువతకు,చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు విస్తరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న దుకాణాలను కార్పొరేషన్ నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన కేటాయించి ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగంలోకి తీసుకురావాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించిన కలెక్టర్,నిర్మాణ నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన అనంతరం కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నిర్మాణ పనుల పురోగతిపై ఇంజినీర్లతో మాట్లాడిన ఆయన,నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని,అవసరమైతే నిర్మాణ సామగ్రి, సిబ్బందిని పెంచి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కల్వకుర్తి పట్టణంలోని క్యాటిల్ మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్అక్కడి సదుపాయాలను పరిశీలించారు. పశువుల కొనుగోలు, విక్రయాల కోసం వచ్చే రైతులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులుతలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. మార్కెట్‌లో పరిశుభ్రతను కాపాడటంతో పాటు తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అభివృద్ధి పనులు ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకురావాలంటే నాణ్యత, పారదర్శకత, సమయపాలన కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి పనిని బాధ్యతాయుతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్,కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాల, మున్సిపల్ కమిషనర్ అహ్మద్,కౌన్సిలర్లు,వ్యవసాయ మార్కెటింగ్,ఐకెపి,గృహ నిర్మాణ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,సంబంధిత సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య




**వీపనగండ్ల, జూన్ 13 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని తూంకుంట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఉపాధ్యాయులు వీధులలో తిరుగుతూ పాఠశాలకు రాణి పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో వసతులు, విద్య గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యార్థులకు బోధన ఉంటుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి, ఏఐ ఆధారిత కంప్యూటర్ విద్య ద్వారా గుణాత్మక విద్య అందిస్తుందని, పౌష్టికాహారం అందిస్తు, పుస్తకాలు, నోటు పుస్తకాలు మానసికొల్లాసనికి,ఆటలు, పాటలు నేర్పిస్తూ, విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేరే విధంగా కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ బడులలో అందే విద్యను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీ, అంగన్వాడీ టీచర్స్ పారిజాత, మాధవి పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో డ్వాక్రా మహిళల కీలక పాత్ర పోషించాలి



**నర్సాపూర్, జూన్ 12 (జనం సాక్షి) :** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు డ్వాక్రా మహిళలు కీలక పాత్ర పోషించాలని న్యాయవాది రాజు నాయక్ అన్నారు. శుక్రవారం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సాపూర్ మండలంలోని తుల్జారంపేట గ్రామ డ్వాక్రా సంఘం మహిళకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా న్యాయవాది జె.రాజు నాయక్ పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ సమాజానికి శాపంగా మారిందని, దీని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. చదువుకోవాల్సిన వయస్సులో ఉన్న బాలబాలికలను పనుల్లో పెట్టకుండా, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్ల సౌకర్యాలను వినియోగించుకుని వారికి నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. చిన్నారులను ఉన్నత విద్యాభ్యాసం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరేలా తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు కృషి చేయాలని ఆయన అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో డ్వాక్రా మహిళలు కీలక పాత్ర పోషించాలని, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంపొందించి చిన్నారుల హక్కులను పరిరక్షించాలని కోరారు.అలాగే ఎవరైనా చట్టవిరుద్ధంగా చిన్నపిల్లలను పనిలో పెట్టుకున్నా లేదా వారితో పని చేయించినా సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సి.హెచ్. స్వరూప రాణి, జాట్రోత్.రవి నాయక్, ఇంద్రకాంతి పథకం సీసీ ప్రమీల, లీగల్ సర్వీస్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సంగారెడ్డి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



**సంగారెడ్డి టౌన్, జూన్ 12 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ - 2026 నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ పిలుపునిచ్చారు. శుక్రవారం సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలిసి ప్లాస్టిక్ నిషేధం, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ - 2026 నిబంధనలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి అధికారిణి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణానికి తీవ్ర హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసి, వాటికి బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ - 2026 నిబంధనల ప్రకారం తడి, పొడి, హానికర వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేసి, శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం ద్వారా పరిశుభ్రమైన పట్టణాల నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. సదస్సులో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులకు బట్ట సంచులను పంపిణీ చేసి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు ప్రత్యామ్నాయంగా వాటి వినియోగాన్ని ప్రోత్సహించారు.

### ప్లాస్టిక్ రహిత సంగారెడ్డి

నిర్మాణానికి వ్యాపారవేత్తలు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని అధికారులు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కిరాణా దుకాణాల సంఘం ప్రతినిధులు, బేకరీ షాప్ అసోసియేషన్ సభ్యులు, వ్యాపారవేత్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం

- అదనపు కలెక్టర్ సంగీత

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 12 (జనం సాక్షి) :** ఆయిల్ పామ్ సాగుకు రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుదని అదనపు కలెక్టర్ సంగీత పేర్కొన్నారు. రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన పెంపొందించి, శాస్త్రీయ సాగు పద్ధతులను ప్రోత్సహించేందుకు జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతుల కు రెండు రోజుల ఆయిల్ పామ్ విజ్ఞాన యాత్రను గురువారం అడిషనల్ కలెక్టర్ సంగీత జెండా ఊపి ప్రారంభించారు. జాతీయ ఆయిల్ పామ్ మిషన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ విజ్ఞాన యాత్రకు సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి గల 22 మంది రైతులను ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంలోని ఆయిల్ పామ్ తోటల సందర్శనకు గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ సహకారంతో తీసుకెళ్లినట్లు జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వర తెలిపారు.

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ సంగీత రైతుల బృందం విజ్ఞాన యాత్రను జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సంగీత మాట్లాడుతూ...ఆయిల్ పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయక పంట అని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ముందుకు రావాలని సూచించారు.రెండు రోజులపాటు కొనసాగే ఈ విజ్ఞాన యాత్రలో రైతులు ఆయిల్ పామ్ తోటలను ప్రత్యక్షంగా సందర్శించి సాగు విధానాలు, నాణ్యమైన మొక్కల పెంపకం, తోటల నిర్వహణ, ఎరువుల యాజమాన్యం, నీటి వినియోగ పద్ధతులు, పంట దిగుబడులు, కోత అనంతర నిర్వహణ, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన పొందనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖి సమావేశమై వారు అనుసరిస్తున్న సాగు పద్ధతులు, పంట ద్వారా పొందుతున్న ఆదాయం, ఎదుర్కొన్న సవాళ్లు మరియు వాటి పరిష్కార మార్గాలపై ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉంటుందాన్నారు. ఈ విజ్ఞాన యాత్ర ద్వారా రైతుల్లో



ఆయిల్ పామ్ సాగుపై మరింత అవగాహన పెరిగి, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టేందుకు ప్రోత్సాహం లభిస్తుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారులు, గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ మంజూరు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల నడిగడ్డ, జూన్ 12 (జనం సాక్షి) :** 2026.. 28 కి సంబంధించిన జర్నలిస్టుల అక్రెడిటేషన్ అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో మీడియా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు కార్డుల మంజూరు పై చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకి అక్రిడిటేషన్స్ మంజూరు అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ అరీఫుద్దీన్, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్, మీడియా కమిటీ సభ్యులు అక్బర్ బాషా, పెద్ద ఇస్మాయిల్, రవీందర్ రెడ్డి, నల్లన్న, వెంకటేష్, సిరాజ్, భీమ రాయుడు, జాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**సంగారెడ్డి, జూన్ 12 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య తో పాటు విద్యార్థులకు అన్ని మౌళిక వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని పుల్కల్ ఎంపీ పీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న వసతుల గురించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల ప్రకటనలకు మోసపోయి తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించదని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదవ తరగతి వార్షిక పరీక్షల్లో సత్తా చాటి చాలామంది విద్యార్థులు త్రిపుల్ ఐటీ లో సీట్లు సాధించినట్లు పూర్తి చేశారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అభ్యసించి పై చదువులకు సమయుత్యం కావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బధన చేయడానికి ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని ప్రధాన ఉపాధ్యాయురాలు విద్యావతి అన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి

- జిల్లా కలెక్టర్‌కు విన్నవించిన టీయూడబ్ల్యూజే(ఐజేయూ)



**వనపర్తి రూరల్, జూన్ 12 (జనం సాక్షి) :** వనపర్తి జిల్లా పరిధిలోని అన్ని ప్రయివేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఒకరికి ఉచిత విద్య, మరొకరికి కనీసం 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయు) వనపర్తి జిల్లా, అధ్యక్షులు డి. మాధవరావు, జిల్లా కార్యదర్శి బి. రాజు ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టులు సమాజానికి నిరంతరం సేవలందిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిజం నమ్ముకొని ఎటువంటి జీతభత్యాలు లేకుండా ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్న జర్నలిస్ట్ ల కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో విద్యా ఖర్చులు భారంగా మారుతున్నాయని వివరించారు. 2026-27 విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని వనపర్తి జిల్లాలోని అన్ని ప్రయివేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లల్లో ఒకరికి ఉచిత విద్య, మరొకరికి కనీసం 50 శాతం ఫీజు రాయితీ అమలు చేసేలా జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ద్వారా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ కార్యాలయ ఏవో భాను ప్రకాష్, జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని సంఘం ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి నర్సింహా రాజు, జిల్లా ఉపాధ్యక్షులు కమల్ రెహమాన్ యూనియన్ నాయకులు రాజేందర్ ,ధనుష్, నరేష్ గౌడ్, మహేష్ ,కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, గోపాలకృష్ణ, రాజకుమార్, నాగేష్, మనోహర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

- ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కాకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం
- మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలి
- ఈఎస్ఐ పిఎఫ్ ఉద్యోగ భద్రత కల్పించాలి
- సిఐటియు జిల్లా కార్యదర్శి జి. సాయిలు




**సంగారెడ్డి టౌన్, జూన్ 12 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు ఇవ్వాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని ప్రభుత్వామీని అమలు చేయాలని శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ కు డిపిఓ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జి సాయిలు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు ఉదయం నుండి కష్టపడి పనిచేస్తున్న నేటికీ కనీస వేతనం లేదని గ్రామపంచాయతీ కార్మికులు అంటే ప్రభుత్వానికి ఇంత చిన్న చూపా అని ప్రశ్నించారు. కార్మికులకు మూడు నెలల నుండి వేతనాలు రాక వస్తువులతో గడుపుతున్న ప్రభుత్వానికి పట్టింపు లేదా అని ప్రశ్నించారు ఒకవైపు ముఖ్యమంత్రి ఒకటో తేదీన జీతాలు ఇస్తామని ప్రకటించిన మూడు నెలల నుండి దిక్కు లేదని అన్నారు. గ్రామాన్ని అద్దంలా శుభ్రం చేస్తున్న పరిశుద్ధ కార్మికుల గురించి ప్రభుత్వానికి పట్టింపులేదని ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా వేతనాలు పెంచుతామని ఇతర సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన మాట కాంగ్రెస్ పెద్దలకు గుర్తు రావడం లేదా అని అన్నారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని ఈఎస్ఐ పీఎఫ్ ఉద్యోగ భద్రత కల్పించాలని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం పెంచాలని ప్రభుత్వ హామీ అమలు కాకుంటేరాష్ట్ర వ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

### అడిషనల్ కలెక్టర్ డీపీఓ హామీ

వేతనాలు రెండు రోజుల్లో వచ్చే విధంగా ప్రభుత్వం నుండి ప్రయత్నం చేస్తామని ఇతర సమస్యలు పరిష్కరిస్తామని వేతనాల పెంపు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు యాదగిరి ,ప్రవీణ్, శంకర్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తయ్య దశరథ్ నాయకులు పోచయ్య ఇమ్మానియేల్ మహేష్ యాదమ్మ విజేందర్ రాములు లక్ష్మి నర్సింలు రాజు గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలను నియంత్రించాలి



**మెదక్, జూన్ 12 (జనం సాక్షి) :** కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతా చర్యల అమలు ,మత్తు పదార్థాల నిర్మూలనపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అవసరమైన హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టులు వినియోగించడం, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. రోడ్డు భద్రత, మత్తు పదార్థాల నిర్మూలన విషయంలో ప్రతి శాఖ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో, ఆర్ అండ్ బి ఈ, ఈ వేణు, డీఎస్పీలు ,జిల్లా రవాణా శాఖ అధికారి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు ,ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

- రాజీ మార్గాన్ని ప్రోత్సహించాలి
- 20న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా జడ్జి సూర్యచంద్రకళ




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జూన్ 20న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ప్రధాన న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్యచంద్రకళ పోలీసు అధికారులు, న్యాయవాదులకు సూచించారు. శుక్రవారం పోలీసు అధికారులు, న్యాయవాదులతో వేరు వేరుగా సమావేశం నిర్వహించారు. కేసుల పరిష్కారంలో రాజీ మార్గాన్ని ప్రోత్సహించాలని జడ్జి కోరారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులోని ఇరువర్గాలవారు స్నేహపూర్వక వాతావరణంలో కేసులను పరిష్కారం చేసుకుంటే విలువైన సమయం, డబ్బులు వృథా కావని, మనశాంతిని పొందవచ్చని తెలిపారు. సివిల్ కేసుల్లో రాజీ పడ్డవారికి కోర్టు ఫీజు కట్టినచో తిరిగి ఇవ్వబడుతుందని జడ్జి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, అడిషనల్ ఎస్పీ ఏ.నరేష్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇందరపు శివకుమార్, డీఎస్పీలు సంపత్ రావు, సూర్యనారాయణ, ఎక్సైజ్ అధికారులు, సీఐలు, ఎస్ఐలు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పుప్పాల శ్రీనివాస్, న్యాయవాదులు కే. చిరంజీవి, రత్నం కిరణ్, మొయినుద్దీన్, వసంత, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## రాకేష్ రెడ్డి ఈ-క్లాసెస్ యాప్ ఆవిష్కరణ



**మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 12 (జనం సాక్షి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి రూపొందించిన "రాకేష్ రెడ్డి ఈ-క్లాసెస్ యాప్" ను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ పార్లమెంట్ సభ్యురాలు కవిత మాలోత్ యాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పోటీ పరీక్షల్లో విజయాలు సాధించేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. యువత తమ లక్ష్య సాధన కోసం డిజిటల్ విద్యా వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, బ్యాంకింగ్, రైల్వే, పోలీస్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన వీడియో క్లాసులు, స్టడీ మెటీరియల్, మాక్ టెస్టులు, నిపుణుల మార్గదర్శకత్వం అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాంమోహన్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బానోత్ రవికుమార్, రావుల రవిచందర్ రెడ్డి, డీఎస్ఎఫ్ఐ అధ్యక్షులు డా. వివేక్, మున్సిపల్ కౌన్సిలర్లు ముత్యం వెంకన్న గౌడ్, బానోత్ అశ్విని తదితరులు పాల్గొన్నారు. యువతకు నాణ్యమైన విద్యా అవకాశాలు కల్పించడం, ఉద్యోగ సాధనలో మార్గదర్శకత్వం అందించడం, పోటీ పరీక్షలకు సమగ్ర శిక్షణ అందించడమే ఈ యాప్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు వెల్లడించారు. ఫోటో క్యాప్షన్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో "రాకేష్ రెడ్డి ఈ-క్లాసెస్ యాప్"ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎంపీ కవిత మాలోత్. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అడవికి కార్చిచ్చు తెగిన విద్యుత్ తీగలు

- విద్యుద్ఘాతంతో నాలుగు పాడి గేదెలు మృతి



**నూగూర్ వెంకటాపురం, జూన్ 12 (జనంసాక్షి) :** విద్యుత్ వైర్లు తెగిపడటంతో షాక్ కు గురై నాలుగు పాడి గేదెలు మృతి చెందాయి. వెంకటాపురం మండలంలో ని పాత్రపురం గ్రామానికి చెందిన కారం చిన్ని, వెంగలరావు పేట గ్రామానికి చెందిన సాధనపల్లి బతుకమ్మ, సాధనపల్లి చిట్టి బాబు,టేకులబోరు గ్రామానికి చెందిన పోరిశెట్టి చంటి, అనే రైతుల గేదెలు ఉదయం మేతకు వెళ్లిన క్రమంలో మార్గం మధ్యలో విద్యుత్ వైర్లు తెగి గేదెలపై పడటంతో షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాయని గ్రామస్తులు తెలిపారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వెదురు బొంగులకు నిప్పు పెట్టడం వలన పక్కనే ఉన్న విద్యుత్ తీగలు నిప్పు మంటలకు కరిగి పోయి తెగి పోవటం జరిగిందని తెలిపారు. తెగి నేలపై ఉన్న విద్యుత్ తీగలను ఎవరు గమనించక పోవడం వలన ఈ సంఘటన చోటు చేసుకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు . మృతి చెందిన పాడి గేదెలు ఒక్కొక్కటి, ఒక్కొక్క రైతుకు సుమారు 50 వేల రూ. నష్టం జరిగిందని కన్నీటి పర్యంతం మౌతున్నారు. నష్ట పోయిన రైతులకు ఉన్నతాధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకోని తమకు న్యాయం చేయాలని పాడి గేదెల రైతులు కోరారు.



## ఓరగంటి రంజిత్‌కు ఇండియన్ వరల్డ్ రికార్డ్

- 1000 కి.మీ సైకిల్ యాత్రకు గుర్తింపుగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లు

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 12(జనంసాక్షి ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా 13 జిల్లాల మీదుగా 17 రోజుల పాటు నిర్వహించిన 1000 కి.మీ సైకిల్ యాత్రకు గుర్తింపుగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, రెబ్బెన మండలం, గోలేటి గ్రామానికి చెందిన వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఓరగంటి రంజిత్ కుమార్ కు ఇండియన్ వరల్డ్ రికార్డు, తెలుగు బుక్ అఫ్ రికార్డ్స్ సంస్థల నుంచి సర్టిఫికెట్లు లభించాయి. ఈ సందర్భంగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కె హరిత, రంజిత్‌కు సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం యువతలో అవగాహన పెంపొందించే లక్ష్యంతో 1000 కి.మీ సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సందేశాన్ని తీసుకెళ్లిన రంజిత్ కృషి ప్రశంసనీయమని కొనియాడారు. యువత సామాజిక సమస్యలపై స్పందిస్తూ ముందుకు రావాలని సూచించారు.

# ప్రమాదం సంభవిస్తేనే చర్యలు చేపడతారా?

- నిర్లక్ష్యపు నీడలో పంచాయతీ అధికారులు..
- ఎండిన చెట్టుతో పొంచి ఉన్న ప్రాణాపాయం!
- భయం గుప్పెట్లో వాహనదారులు, బాటసారులు...



**మంగపేట జూన్ 12(జనంసాక్షి) :** ప్రాణం పోయాక వచ్చే పరిహారాల కంటే... ప్రాణం ఉండగానే తీసుకునే నివారణ చర్యలు మిన్న.. అనే కనీస సూత్రాన్ని స్థానిక అధికారులు విస్మరిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు గల ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన ఓ భారీ ఎండు చెట్టును తొలగించడంలో అధికారులు చూపుతున్న అలసత్వం ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. నిత్యం వందలాది వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించే ఈ ప్రధాన రహదారిపై ఈ చెట్టు ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో ఉండటం వాహనదారుల ప్రాణాల మీదకు తెస్తోంది. ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల అకాల వర్షాలు, ఊహించని రీతిలో ఈదురు గాలులు (గాలిదుమారం) వీస్తున్నాయి. సాధారణంగానే ఎండిపోయిన చెట్లు కొద్దిపాటి గాలికే కొమ్మలు విరిగిపడే ప్రమాదం ఉంటుంది. అలాంటిది ఈ భారీ వృక్షం పూర్తిగా ఎండిపోయి, ఏ క్షణంలోనైనా కూలిపోయేలా ఉంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆర్టీసీ బస్సుల ప్రయాణికులు గుండెచేత్తో పట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. పగటిపూటైనా చెట్టును చూసి కాస్త జాగ్రత్త పడొచ్చు. కానీ రాత్రి వేళల్లో, సరిగ్గా వెలుతురు లేని సమయంలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది అని స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదకర చెట్టు సరిగ్గా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఉండటంతో, అత్యవసర స్థితిలో వచ్చే అంబులెన్సులు, గర్భిణీ స్త్రీలు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ చెట్టు అకస్మాత్తుగా కూలిపోతే ఆసుపత్రికి వెళ్లే మార్గం పూర్తిగా మూసుకుపోయే ప్రమాదం ఉంది. ఈ ఎండిన చెట్టు కొమ్మలు సమీపంలోని హై-టెన్షన్ విద్యుత్ వైర్లకు తాకుతూ ఉన్నాయి. గాలివాన తగిలి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడితే... భారీ షార్ట్ సర్క్యూట్ జరిగి చుట్టుపక్కల ప్రాంతాలు చీకట్లోకి వెళ్లడమే కాకుండా, ప్రాణనష్టం జరిగే అవకాశం కూడా లేకపోలేదు. ఈ సమస్యపై స్థానిక ప్రజలు, వాహనదారులు ఇప్పటికే పలుమార్లు పంచాయతీ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా సరే, మా పరిధి కాదు అంటే మా పరిధి కాదు అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు, వాహనదారులు అధికారులను, తోటి ప్రజలను ఈ క్రింది విధంగా కోరుతున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యపై పంచాయతీరాజ్, అటవీ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే ఉమ్మడిగా స్పందించాలి. ఒక ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దించి, కేవలం ఈ ఒక్క చెట్టే కాకుండా, రహదారికి ఇరువైపులా ఉన్న ఇలాంటి ప్రమాదకరమైన అన్ని ఎండు చెట్లను, వేలాడుతున్న కొమ్మలను గుర్తించి తక్షణమే తొలగించాలి అని వాహనదారులు కోరుకుంటున్నారు. ఇప్పటికైనా ఎటువంటి ప్రమాదం జరిగి ప్రాణాలు పోయాక స్పందించడం కంటే, ముందే మేల్కొని ఈ ముప్పును తప్పించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.

## ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో మొక్కను నాటాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ బ్యూరో, జూన్ 12 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణ, హరితహారం విస్తరణ, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ , జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న "ఏక్ పెడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో మొక్కను నాటడం) - 2026" జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ డా. సత్యశారద, ఐఏఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. "ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యతాభావం పెరుగుతుందని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ జాతీయ స్థాయి పర్యావరణ పోటీని తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, పరిశోధకులు మరియు సాధారణ పౌరులు మొక్కలు నాటడం, సీడ్ బాల్స్ తయారీ, పర్యావరణ అవగాహన కార్యక్రమాలలో పాల్గొని తమ ఫోటోలను అప్‌లోడ్ చేయడం ద్వారా పోటీలో పాల్గొనవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీమతి విజయలక్ష్మి ,జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ . సుజన్ తేజ, జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా.సాంబశివరావు , ఎన్జిసి జిల్లా కోఆర్డినేటర్ డా. కట్ల శ్రీనివాస్ , వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఈ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొనేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను విద్యార్థుల దైనందిన జీవితంలో భాగంగా మార్చేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి విద్యాసంస్థ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- వెంకటాపూర్ అసైన్డ్ భూమిని పేదలకు పంచాలి
- సిపిఐ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ వద్ద ధర్నా




**హనుమకొండ ప్రతినిధి జులై 12 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా అయినవోలు మండలం వెంకటాపూర్ గ్రామం లో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వెంకటాపూర్ గ్రామ రైతులు, పేదలు ధర్నా నిర్వహించారు . ఈ ధర్నా కార్యక్రమానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు శుక్రవారం హాజరై మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చట్టవిరుద్ధంగా అసైన్డ్ భూములను కొందరు స్వాధీనం చేసుకున్నారని అన్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో పేదల అసైన్డ్ భూములను భూకబ్జాదారులు ఆక్రమించుకున్నారని, వాటిని అధికారులు రద్దు చేసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.వెంకటాపూర్ అసైన్డ్ భూమిని ఆక్రమించుకున్న భూ కబ్జా దారులను నుండి భూమిని స్వాధీన చేసుకోవాలని అన్నారు. అట్టి అసైన్డ్ భూమిని తిరిగి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూమిని ఆక్రమించుకున్న భూ కబ్జా దారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వెంకటాపూర్ లో అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం స్పందించని ఎడల సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూములను సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటాలు నిర్వహించి పేదలకు పంపిణీ చేస్తామని అన్నారు. భూ కబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చట్టాలు ఉపయోగించి కేసులు నమోదు చేయాలని, భూకబ్జాదారుల కొమ్ము కాస్తూ వారికి సహకరించిన రెవెన్యూ అధికారుల సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా నాయకులు ఎదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి తదితరులు పాల్గొన్నారు.

# నేడు డిప్యూటీ సీఎం, మంత్రుల రాక

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



**మంచిర్యాల ప్రతినిధి , జూన్ 12 (జనంసాక్షి) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పిన 36 రోజుల్లోనే శంకుస్థాపన చేసుకోవడం గర్వకారణమని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శుక్రవారం నాడు మంచిర్యాల పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం నాడు గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి పనుల శంకుస్థాపన చేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విచ్చేస్తున్నారని చెప్పారు.. 70 కోట్లతో ఈ దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తానని తన అభ్యర్థన మేరకు పిప్పిరి సభలో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆలయ అభివృద్ధి కోసం నిధులు ఇచ్చినందుకు సీఎం శ్రీ రేవంత్ రెడ్డికి, మంత్రుల బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు సింగరేణి కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాలకు సంబంధించి ఉద్యోగ నియామక పత్రాలను మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని కాలేజీ రోడ్డులోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అందజేస్తారని చెప్పారు. మంచిర్యాల పట్టణంలో ఇంతమంది సింగరేణి కార్మికుల పిల్లలకు నియామక పత్రాలు అందించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం శ్రీరాంపూర్ సింగరేణి వాజ ని సందర్శించి , మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయ పునః నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. పద్మావతి గార్డెన్ లో జరిగే కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ -ఎస్ఐఆర్‌పై బూత్ లెవెల్ ఏజెంట్ (బీఎల్ఏ)లకు అవగాహన శిక్షణ సమావేశంలో డిప్యూటీ సీఎం శ్రీ భట్టి విక్రమార్క పాల్గొంటారని తెలిపారు . ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి శ్రీ కొక్కిరాల సురేఖ , మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, కార్పొరేటర్లు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కొండచిలువ జూపార్కుకు తరలింపు



**ఆత్మకూర్, జూన్ 12 (జనం సాక్షి):** హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం ఆత్మకూరు గ్రామం గుడెప్పాడ్,జాతీయ రహదారి పరిసర ప్రాంతంలో, ఏడు ఫీట్ల పొడవుగా ఉన్న కొండ చిలువ సంచరిస్తుండగా అటుగా వెలుతున్న గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన, హన్మకొండ అటవిశాఖ డిప్యూటీ రేంజర్ వై.కోటేశ్వర్ రావు, హన్మకొండ జూపార్క్ సిబ్బంది, వాచర్ అశోక్‌ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ,హన్మకొండ జిల్లా సభ్యులు మారపెల్లి సునీల్ సంఘటన స్థలానికి చేరుకొని, కొండచిలువను,రెస్క్యూ చేసి బంధించి జూపార్క్ కు తరలించారు.

### పెన్షనర్ల ఫేషియల్ రికగ్నిషన్

**గడువు పొడిగించాలని లబ్ధిదారుల విజ్ఞప్తి**



**మల్హర్, జూన్ 12 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పెన్షన్ దారుల ఫేసియల్ రికగ్నిషన్ (లైవ్ అథెంటికేషన్) ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి మొబైల్ ద్వారా లబ్ధిదారుల ఫొటోలను నమోదు చేస్తున్నారు. అయితే ఈ ప్రక్రియకు సోమవారమే చివరి రోజు కావడంతో మధ్యలో ఆదివారం సెలవు ఉన్నందున గడువు సరిపోదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వృద్ధులు, అనారోగ్య బాధితులు కేంద్రాల వద్దకు రాలేకపోతున్నారని, అధికారులు స్పందించి గడువు పొడిగించాలని కోరుతున్నారు. అలాగే సిబ్బంది ఇంటింటికీ వచ్చి లైవ్ అథెంటికేషన్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

### కాళేశ్వర ఆలయ హుండీ ఆదాయం 48 లక్షలు



**కాళేశ్వరం, జూన్ 13 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం హుండీలను శుక్రవారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ మహేష్ ఆధ్వర్యంలో విప్పి డబ్బులు లెక్కించడం జరిగినది. హుండీల పర్యవేక్షణాధికారిగా యం. అనిల్ కుమార్ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు. రెండు నెలల పదిహేను రోజులకు గాను 48,25,170/-రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే సరస్వతి అంత్య పుష్కరాలు మే 21 నుండి జూన్ 1 వరకు జరగగా ప్రసాదాలు, టికెట్ల ద్వారా 97,27,500 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఎస్ మహేష్, పర్యవేక్షణాధికారి యం.అనిల్ కుమార్, ధర్మకర్తలు గందేసిరి సత్యనారాయణ, సుంకరీ సీతయ్య, ప్రశాంత్ రెడ్డి, శ్రీధర్ రావు, కుంభం పద్మ, శ్యామసుందర్ దేవుడా, కాటం సత్తయ్య, దుర్గయ్య, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, దేవస్థానం అర్చక స్వాములు, సిబ్బంది, భక్తులు, లలితా సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
13 జూన్ 2026

## ప్రీ ప్రైమరీ స్కూల్ ఐసిడియస్‌కు అప్పగించాలి

- నర్సాపూర్ ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా, వినతి పత్రం
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు



**నర్సాపూర్, జూన్ 12 (జనం సాక్షి) :** రాష్ట్రంలో ప్రీ ప్రైమరి పాఠశాలల మూలంగా ఐసిడిఎస్ నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఏర్పడిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. శుక్రవారం నర్సాపూర్ ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ప్రీ ప్రైమరీ స్కూలు మూలంగా ఐసిడిఎస్ సంస్థకు ఏసర వచ్చిందని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రియ ప్రయోగం మీద తీసుకురావడం ద్వారా అనేక అంగన్వాడి సెంటర్ మూతపడే అవకాశం ఉందని దీని మూలంగా అనేకమంది గర్భిణీ స్త్రీలు బాలింతలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఒకవేళ తీసుకురావాల్సి వచ్చినా ప్రియమైన స్కూళ్లను ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ కు అనుసంధానం చేయాలని ఆయన అన్నారు గత 50 సంవత్సరాలుగా గ్రామాలలో సుశీమరణాలు తగ్గించడంతోపాటు గర్భిణీ స్త్రీలకు పోషకాహారాలు ఇవ్వడంలో ముఖ్యపాత్ర వహిస్తున్నారని గుర్తు చేశారు ప్రియ ప్రవీణ్ స్కూల్ రావడం ద్వారా పిల్లలు తగ్గడంతో పాటు సరైన పోషక విలువలు అందక అనేక మంది చిన్నపిల్లలు లబ్ధిదారులు నష్టపోతారని గుర్తు చేశారు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి ఉద్యోగులకు ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చినప్పటికీ రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న నేటికీ ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రీ ప్రైమరీ స్కూల్లో పీఎం శ్రీ స్కూల్ లను ఐసిడిఎస్ కు అప్పగించాలని సిఐటియుగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు అన్నపూర్ణ అంగన్వాడి కార్యకర్తలు సువర్ణ విజయలక్ష్మి నాగరాణి ధనలక్ష్మి శశికళ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి..!

- కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఓట్ల తొలగింపునకు కుట్ర
- 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్' పేరిట లేపేసే ప్లాన్
- బీహార్, బెంగాల్ ఫార్ములాను ఇక్కడా ప్రయోగిస్తున్నారు
- కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష ప్రభుత్వాలపై దాడి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం రూరల్, జూన్ 12 (జనం సాక్షి) :** కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెరలేపిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా బీజేపీపాలితా ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో అప్రజాస్వామిక పాలన సాగుతోందని మండిపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి.ఎల్.ఏ) అవగాహన శిక్షణ శిబిరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట క్రాస్ రోడ్డులో గల పీవీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, బీజేపీ రాజకీయ వ్యూహాలను ఎండగడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు.

### 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం..

కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిన 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం లాంటిదని, ఇది ముమ్మాటికీ దొంగదారి చర్యేనని మంత్రి విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో, ఎక్కడైతే మనకు ఓట్లు ఎక్కువగా ఉన్నాయో.. అక్కడ ఒక పద్ధతి ప్రకారం దాదాపు 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్ ఓట్లు'గా చిత్రీకరించి, వాటిని జాబితా నుంచి తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోంది. ఓటరు వయస్సులో స్వల్ప తేడాలున్నా, పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ (రావుకు బదులు రెడ్డి, హుస్సేన్ బదులు శ్రీ అని పడటం) ఉన్నా.. వాటన్నింటినీ వంకగా చూపి ఓట్లను లేపేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీహార్, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఈ పద్ధతిని ప్రయోగించి సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ ప్రయోగించాలని చూస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ సైనికులు గట్టిగా తిప్పికొట్టాలి" అని మంత్రి పిలుపునిచ్చారు.

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతాన్ని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "మీనాక్షి నటరాజన్ గారికి కావలసిన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి, ఎన్నికల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్‌ను తిరస్కరింపజేశారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన ఒక రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారు. నిన్నటి వరకు ఓట్లను దొంగిలించిన వాళ్ళు.. ఈరోజు ఏకంగా సీట్లనే దొంగిలించే దుస్థితికి కేంద్ర ప్రభుత్వం దిగజారింది" అని నిప్పులు చెరిగారు.

### సీబీఐ, ఈడీలతో బెదిరింపు రాజకీయాలు

బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం దేశంలోని ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థలను వేట కుక్కల్లా వాడుకుంటోందని మంత్రి తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్న సీబీఐ , ఈడీ , ఇన్‌కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని, వేరే పార్టీల తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, భారతదేశంలో ఎక్కడ బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నా ఇదే రకమైన దుర్మార్గపు పరిపాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



### ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ కావాలి

జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే 'ఓట్ మ్యాపింగ్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. "ఉద్యోగాలు, చదువుల రీత్యా ఖమ్మం, హైదరాబాద్‌లలో ఉండే మన వాళ్ళు అధికారులు వచ్చినప్పుడు ఊర్లో లేరనే సాకుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. అధికారులు వచ్చే ముందే గ్రామంలో చాటింపు వేయించి వేరే ఊర్లలో ఉన్న మన ఓటర్లను రప్పించి ఓటు కాపాడుకోవాలి. మనకు దొంగ ఓట్లు అవసరం లేదు.. మనకున్న జనాదరణతో ప్రతి ఓటునూ ఒక కాంక్రీట్ గోడ లాగా కాపాడుకోవాలి" అని స్పష్టం చేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కాబోయే ప్రధానమంత్రి, మన నాయకుడు రాహుల్ గాంధీకి కార్యకర్తలంతా సైనికుల్లా అండగా నిలబడాలని, ఈ అక్రమ ఎస్ఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పీసీసీ ప్రతినిధి సుధాకర్, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్, ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత,వైస్ చైర్ పర్సన్ తమ్మినేని నవీన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్‌ల బి.ఎల్.ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నల్లగొండలో సంచలనం హత్య కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- అడిషనల్ ఎస్పీ జి.రమేష్

**నల్లగొండ ప్రతినిధి, జూన్ 13 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశరాజుపల్లి శివారులో నిర్మాణంలో ఉన్న వెంచర్ ప్రాంతంలో జరిగిన బోథ్ సాయి కుమార్ (27) హత్య కేసును జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు,సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు అడిషనల్ ఎస్పీ జి. రమేష్ తెలిపారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన మూడు ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలతో విచారణ జరిపి నిందితులు ఫూర్ఖాన్ అలియాస్ మహేష్ (37), ఆరిఫ్ (26)లను విజయవాడలో అదుపులోకి తీసుకున్నాయి.పోలీసుల కథనం ప్రకారం, గొల్లగూడెంకు చెందిన సాయి కుమార్ గ్రామదేవతల పండుగల సందర్భంగా ఆడవేషం ధరించి కొలుపులు చెప్పేవాడు. చీరల వ్యాపారం చేస్తున్న ఫూర్ఖాన్‌కు అతనితో పరిచయం ఏర్పడి, ఇద్దరూ అప్పుడప్పుడు కలిసి మద్యం సేవించేవారు. వ్యాపార




అవసరాల కోసం రూ.30 వేల అప్పు ఇవ్వాలని ఫూర్ఖాన్ పలుమార్లు కోరినా సాయి కుమార్ నిరాకరించడంతో అతనిపై కక్ష పెంచుకున్నాడు.సాయి కుమార్ వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను దోచుకోవాలనే ఉద్దేశంతో హత్యకు పథకం రచించిన ఫూర్ఖాన్, తన సహచరుడు ఆరిఫ్‌తో కలిసి జూన్ 8న మద్యం పార్టీ పేరుతో కేశరాజుపల్లి శివారులోని వెంచర్ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ మద్యం సేవించిన అనంతరం డబ్బుల విషయంలో గొడవ జరిగి, ముందస్తు ప్రణాళిక ప్రకారం ఫూర్ఖాన్ సిమెంట్ రాయితో సాయి కుమార్ తలపై బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.హత్య అనంతరం మృతుడి వద్ద ఉన్న బంగారు తాయెత్తు, చెవి కమ్మ, ముక్కుపుడకలను అపహరించి, అతని హోండా ఆక్టివా స్కూటీ, సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యారు. అనంతరం రక్తపు మరకలున్న దుస్తులను దాచిపెట్టి విజయవాడకు వెళ్లి బంగారం విక్రయించేందుకు ప్రయత్నించారు.అయితే సాంకేతిక ఆధారాలతో పోలీసులు నిందితుల జాడను గుర్తించి శుక్రవారం ఉదయం విజయవాడలో అరెస్ట్ చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు: బంగారు తాయెత్తు, బంగారు ముక్కుపుడక,బంగారు చెవి కమ్మ,సెల్‌ఫోన్,ఈ కేసును డీఎస్పీ శివరాం రెడ్డి పర్యవేక్షణలో, సీఐ రాఘవరావు ఆధ్వర్యంలో తిప్పర్తి ఎస్ఐ శంకర్, రూరల్ ఎస్ఐ సైదాబాబు, ఏఎస్ఐ అఫ్జల్‌తో పాటు పోలీసు సిబ్బంది ఛేదించారు. కేసును విజయవంతంగా దర్యాప్తు చేసిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

# భారీ గాలివాన బీభత్సం

- మోత్కూర్ - అడ్డగూడూరు ప్రధాన రహదారిపై విరుచుకుపడ్డ చెట్లు..
- రాకపోకలకు అంతరాయం

**అడ్డగూడూరు, జూన్ 12 (జనం సాక్షి) :** అడ్డగూడూరు మండలంలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు మండలంలోని పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. ముఖ్యంగా మోత్కూర్--అడ్డగూడూరు ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు విరిగి రోడ్డుపై అడ్డంగా పడిపోవడంతో వాహన రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. రోడ్డుపై చెట్లు కూలిపోవడంతో ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనుల నిమిత్తం ప్రయాణిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించగా, మరికొందరు గంటల తరబడి రహదారిపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమాచారం అందుకున్న గ్రామపంచాయతీ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీలు, కట్టర్ల సహాయంతో రోడ్డుపై పడిన చెట్ల కొమ్మలను తొలగించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు. చెట్లు కూలిన కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలు కూడా దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు స్థానికులు తెలిపారు. భారీ గాలుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు విరిగిపడినట్లు సమాచారం. రైతులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అసంపూర్తిగా సెంట్రల్ లైటింగ్ పనులు

- మూగజీవాలకు మరణ ఉచ్చు!
- డివైడర్ కందకంలో ఇరుక్కున్న గేదె
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ శూన్యం
- ప్రమాదాలకు నిలయంగా మారిన సెంట్రల్ లైటింగ్ పనులు

అన్నపురెడ్డిపల్లి, జూన్ 12 (జనం సాక్షి) : మండల కేంద్రంలోని సెంట్రల్ లైటింగ్ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు, మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పనులు ప్రారంభించి చాలాకాలం గడిచినా పూర్తి చేయకపోవడంతో పాటు, తవ్విన గుంతలు, డివైడర్లను భద్రతా చర్యలు లేకుండా వదిలేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా సెంట్రల్ లైటింగ్ కోసం నిర్మించిన డివైడర్ కందకంలో ఒక గేదె ఇరుక్కుపోయి బయటకు రాలేక దయనీయ స్థితిలో కనిపించడం స్థానికులను కలచివేసింది. ఈ ఘటన కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి, అధికారుల పర్యవేక్షణ లోపానికి నిదర్శనంగా నిలిచిందని గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రజల సౌకర్యార్థం చేపట్టిన సెంట్రల్ లైటింగ్ ప్రాజెక్టు ప్రస్తుతం ప్రజలకు, మూగజీవాలకు శాపంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభమైనప్పటి నుంచి నత్తనడకన సాగుతుండగా, నిర్మించిన డివైడర్లలో ఇప్పటికే పగుళ్లు కనిపించడం పనుల నాణ్యతపై అనుమానాలకు తావిస్తోంది. కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పటికీ పనుల్లో నాణ్యత, బాధ్యత కనిపించడం లేదని విమర్శలు



వ్యక్తమవుతున్నాయి.

డివైడర్ల పక్కన తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారినా హెచ్చరిక బోర్డులు, రక్షణ ఏర్పాట్లు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాలు తరచూ ఈ గుంతల్లో పడిపోతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం విచారకరమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అసంపూర్తిగా ఉన్న సెంట్రల్ లైటింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చివేసి ప్రజలు, మూగజీవాల ప్రాణాలకు రక్షణ కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

**వెల్దండ, జూన్ 12 (జనంసాక్షి) :** అంగన్వాడి కేంద్రాల బలోపేతానికి సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డిల నేతృత్వంలో ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని బొల్లంపల్లి సర్పంచ్ సత్తూరి ప్రసాద్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చల్లపల్లి గ్రామం అంగన్వాడి కేంద్ర భవన నిర్మాణానికి సర్పంచ్ , మాజీ ఎంపీటీసీ చల్లా వెంకట్రెడ్డిలు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు ఎంతో అవసరం అన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించే కేంద్రాలుగా ఇవి ఎంతో కీలకమని తెలిపారు. భవన నిర్మాణంతో పిల్లలకు సురక్షిత వాతావరణం మెరుగైన సదుపాయాలు లభిస్తాయి అని చెప్పారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చొప్పరి రామకృష్ణ, పీ.ఆర్.ఏఈ సురేందర్



రెడ్డి , పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ,అందోజు శ్రీనివాస చారి, వార్డు సభ్యులు ధన్సింగ్ నాయక్, కట్ట పద్మమ్మ, అల్లె నరేష్, కొమ్ము వెంకటయ్య, పోలే అంజయ్య, మాజీ ఉప సర్పంచ్ విజేదర్ రెడ్డి, నాయకులు పగడాల వెంకటేష్, కొమ్ము రవి, పకాడి రామస్వామి, పకాడి అంజయ్య, పోలే రంగయ్య, శ్యామ్ , సిబ్బంది పరమేశ్వర్, బుజ్జా నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన విజయవంతం

**తిరుమలాయపాలెం, జూన్ 12 (జనంసాక్షి) :** తిరుమలాయపాలెం మండలంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. తిరుమలాయపాలెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో టీజీనపీడీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉత్పత్తి మరియు నిర్వహణ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం,



అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మండలంలోని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో సహకరించిన మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అభిమానులకు మండల కాంగ్రెస్ నాయకులు లిలితాటికొండ కిరణ్‌లిలి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరి సహకారం, సమన్వయంతో మంత్రి పర్యటన విజయవంతమైందని, భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ శ్రేణులు కలిసి పనిచేస్తాయని తాటికొండ కిరణ్ పేర్కొన్నారు.


# జనం సాక్షితో పాములపాడులో కదిలిన యంత్రాంగం

- అక్రమ గోడలు కూల్చివేత
- తొలగిన డ్రైనేజీ ఆక్రమణలు

మాదుగులపల్లి, జూన్ 12 (జనం సాక్షి) : మండల పరిధిలోని పాములపాడు గ్రామంలో డ్రైనేజీ కబ్జాపై జనం సాక్షి పత్రికలో వరుసగా ప్రచురితమైన కథనాలకు జిల్లా యంత్రాంగం ఎట్టకేలకు స్పందించింది స్థానిక అధికారులు ఆక్రమణదారులకు కొమ్ముకాస్తూ, ఫిర్యాదుదారులనే వేధిస్తున్న ఉదంతాన్ని జనం సాక్షి ఆధారాలతో సహా ఎండగట్టడంతో ఉన్నతాధికారుల్లో చలనం వచ్చింది జిల్లా పంచాయతీ అధికారి ( డిపిఓ) శంకర్ నాయక్ స్వయంగా రంగంలోకి దిగి, డ్రైనేజీని కబ్జా చేస్తూ అక్రమంగా నిర్మించిన గోడలను కూల్చివేయించారు.

### అక్రమార్కులకు, స్థానిక అధికారులకు చెక్!

గతంలో జిల్లా అధికారులు మెమోలు ఇచ్చినా క్షేత్రస్థాయి అధికారులు బుట్టదాఖలు చేయడం, ఉన్నతాధికారుల పేరు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయడంపై గ్రామస్తులు తీవ్ర



పాములపాడు పంచాయతీ కార్యదర్శి వింత పోకడ

- డీఎల్‌పీఓ ఆదేశాలను తుంగలో తొక్కే ప్రయత్నం..?
- డ్రైనేజీ కబ్జాపై చర్యలు శూన్యం బాధితుడికే నోటీసులా..?

ఆగ్రహంతో ఉన్నారు ఈ నేపథ్యంలో జనం సాక్షి బాధితుల పక్షాన నిలిచి, అధికారుల ఉదాసీనతను ఘాటుగా ప్రశ్నిస్తూ కథనాలను ప్రచురించింది. దీంతో స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి శంకర్ నాయక్ నేతృత్వంలో అధికారులు పాములపాడుకు చేరుకుని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు మురుగునీరు సాఫీగా వెళ్లేలా డ్రైనేజీని పునరుద్ధరించారు.

### జనం సాక్షికి గ్రామస్తుల కృతజ్ఞతలు



అధికారుల అండతో అక్రమార్కులు నిర్మించిన గోడలు బద్దలు కావడంతో పాములపాడు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు తమ సమస్యను నిరంతరం పాలకుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారమయ్యేలా పోరాడిన జనం సాక్షి పత్రికకు రిపోర్టర్‌కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఇప్పటికైనా స్థానిక అధికారులు బుద్ధి తెచ్చుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.




# దూసుకెళ్లిన సూచీలు

## సెన్సెక్స్ 1695, నిఫ్టీ 461 పాయింట్లు పైకి

ముంబయి(జనంసాక్షి): దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభా ల్లో ముగిశాయి. అమెరికా- ఇరాన్ మధ్య త్వరలో శాం తి ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలు, అంతర్జాతీయంగా ముడిచమురు దిగుమతులు దిగి రావడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లతో పాటు మన మార్కెట్ సూచీలూ రాణించాయి. సెన్సెక్స్ ఓ దశలో 1700 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 23,600 ఎగువన ముగిసింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.9.7 లక్షల కోట్లు పెరిగి రూ.452.33 లక్షల కోట్ల నుంచి రూ.462.05 లక్షల కోట్లకు చేరింది.అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి సానుకూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 74,709.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,832.55) భారీ లాభాల్లోనే ప్రారంభమైంది. రోజంతా కొనుగోళ్ల మద్దతుతో సూచీలు కళకళలాడాయి. ఇంట్రాడేలో 75,608.02 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1695.40 పాయింట్ల లాభంతో 75,527.95 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 461.30 పాయింట్ల లాభంతో 23,622.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.11గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, ఇండిగో, టైటాన్, ఎటర్నల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు మాత్రమే నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 86 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4224 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# ఆఫర్ల సంగతి మరిచిపోండి..

## స్మార్ట్‌ఫోన్ ధరలు మరింత పెరుగుతాయ్!

న్యూఢిల్లీ:స్మార్ట్‌ఫోన్ ధరలపై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు నథింగ్ కంపెనీ సీఈఓ కార్ల్ పై. రాబోయే రోజుల్లో స్మార్ట్‌ఫోన్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగం నుంచి మెమొరీ చిప్‌లకు డిమాండ్ విపరీతంగా పెరగడమే దీనికి కారణమని ఆయన పేర్కొన్నారు. అందువల్ల రాబోయే పండుగల సీజన్‌లో స్మార్ట్‌ఫోన్ ధరలు తగ్గుతాయని ఆశ పడొద్దని వినియోగదారులకు సూచించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టులు పెట్టారు.గతంలో కంటే మెమొరీ చిప్‌ల ధరలు ఏకంగా 300 శాతం వరకు పెరిగాయని కార్ల్ పై పేర్కొన్నారు. ఒక స్మార్ట్‌ఫోన్ తయారీలో ప్రాసెసర్, డిస్‌ప్లే కంటే మెమొరీ అత్యంత ఖరీదైన భాగంగా మారిందని తెలిపారు. కొన్ని ప్రీమియం ఫోన్లలో మొత్తం హార్డ్‌వేర్ ఖర్చులో మెమొరీ వాటానే 50 శాతానికి పైగా ఉంటోందన్నారు. రాబోయే పండగ సీజన్ లేదా సేల్స్ సమయంలో స్మార్ట్‌ఫోన్లపై గతంలో మాదిరిగా భారీ డిస్కౌంట్లు లభించకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ఫోన్ కొనాలనుకునే వారు ఆలస్యం చేస్తే మరింత ఎక్కువ ధర చెల్లించాల్సి రావొచ్చని పేర్కొన్నారు.

రెండే ఆప్షన్లు..

మెమొరీ ఖర్చుల పెరుగుదల వల్ల మొబైల్ బ్రాండ్లు తమ లాభాలను కాపాడుకోవడానికి ఫోన్ ధరలను 30 శాతం వరకు పెంచడం లేదా ఫోన్ స్పెసిఫికేషన్లను తగ్గించడం వంటి రెండు ఆప్షన్లలో ఒకదాన్ని ఎంచుకోవాల్సి వస్తుందని కార్ల్ పై అభిప్రాయపడ్డారు. నథింగ్ కూడా దీనికి మినహాయింపు ఏమీ కాదన్నారు. తమ నథింగ్ 4ఏ అభివృద్ధి దశకు, విడుదల సమయానికి మెమొరీ ఖర్చులు రెట్టింపయ్యాయన్నారు. తమ స్మార్ట్‌ఫోన్‌ను అప్‌గ్రేడ్ చేయడమా?మరికొంతకాలం కొనుగోలును వాయిదా వేయడమా? అనేది వినియోగదారుల ముందున్న మార్గాలని పేర్కొన్నారు. కార్ల్‌పై ఇప్పుడే కాదు.. గతంలోనూ స్మార్ట్‌ఫోన్ ధరలు పెరగబోతున్నాయని సంకేతాలివ్వగా అది మార్కెట్‌లో ప్రతిఫలించింది. ఆయన తాజా వ్యాఖ్యలను బట్టి చూస్తే వచ్చే ఏడాది సైతం ఇదే ధోరణి కొనసాగే అవకాశం కనిపిస్తోంది.



## భారతదేశంలో రూ,300 కోట్లతో భారీ వెల్‌నెస్ నెట్‌వర్క్..

### ఈబీజీ గ్రూప్, యూనివర్సల్ ఫిట్‌నెస్ ఆస్ట్రేలియా మధ్య ఒప్పందం..



సికింద్రాబాద్(జనంసాక్షి): భారతదేశంలో సరికొత్త హెల్త్, ఫిట్‌నెస్ అండ్ రికవరీ సంస్కృతిని పరిచయం చేస్తూ ఈబీజీ గ్రూప్, ఆస్ట్రేలియాకు చెందిన యూనివర్సల్ ఫిట్‌నెస్ గ్రూప్‌తో ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా ఏకీకృత వెల్‌నెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాట్‌ఫామ్‌ను నిర్మించడం కోసం రాబోయే ఐదేళ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.?ఈ భాగస్వామ్యం ద్వారా దేశవ్యాప్తంగా 30కి పైగా ప్రీమియం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ సెంటర్లను, రెండు భారీ డెస్టినేషన్ వెల్‌నెస్ రిట్రీట్స్‌ను స్థాపించనున్నారు. మొదటి విడతగా హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో వీటిని ప్రారంభించి, ఆ తర్వాత ముంబై, ఢిల్లీ, పూణే వంటి ప్రధాన నగరాలకు విస్తరించనున్నారు.డెలాయిట్ ఇండియా, హెల్త్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం.. ప్రస్తుతం భారతదేశంలో రూ,16,200 కోట్లుగా ఉన్న ఫిట్‌నెస్ మార్కెట్ 2030 నాటికి రూ,37,700 కోట్లకు చేరుకోనుంది. సభ్యుల సంఖ్య కూడా 12.3 మిలియన్ల నుండి 23.3 మిలియన్లకు పెరగనుంది. ఈ భారీ అవకాశాన్ని అందుకోవడమే లక్ష్యంగా ఈ రెండు సంస్థలు చేతులు కలిపాయి.?సాధారణ జిమ్‌లకు భిన్నంగా, ఇక్కడ నిర్మించే ప్రతి సెంటర్ 40,000 నుండి 45,000 చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో ఉంటుంది. ఒకే లొకేషన్‌లో లేదా ఒకే మెంబర్‌షిప్‌తో ఫిట్‌నెస్, రికవరీ, నివారణ ఆరోగ్యం వంటి సేవలను అందించనున్నారు. ఇందులో అధునాతన ఫిట్‌నెస్ ట్రైనింగ్, పైలేట్స్, స్విమ్ స్కూల్స్, ఫిజియోథెరపీ, స్పోర్ట్స్ రీహాబిలిటేషన్, ఏఐ ఆధారిత బాడీ అనాలిసిస్ జోన్లు ఉంటాయి. అంతేకాకుండా, మెగ్నీషియం మినరల్ పూల్స్, ఇన్‌ఫ్రారెడ్ సాల్ట్ రూమ్స్, కోల్డ్ ప్లంజ్ థెరపీ వంటి అత్యాధునిక రికవరీ వసతులు ఉంటాయి. అనుమతుల మేరకు కొన్ని సెంటర్లు 24 గంటలూ పని చేయనున్నాయి. ఈ సందర్భంగా ఈబీజీ గ్రూప్ వ్యవస్థాపకులు డాక్టర్ ఇర్ఫాన్ ఖాన్ మాట్లాడుతూ... భారతదేశంలో వినియోగదారులు ఇప్పుడు కేవలం జిమ్ సాధనాలకు పరిమితం కాకుండా పనితీరు, రికవరీ, దీర్ఘకాలిక శ్రేయస్సును అందించే ఒక పూర్తి ఎకోసిస్టమ్‌ను కోరుకుంటున్నారన్నారు. రాబోయే దశాబ్దంలో వెల్‌నెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కీలక వృద్ధి రంగంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా దేశంలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ప్రతి సెంటర్‌లో ఫిట్‌నెస్ కోచింగ్, స్పోర్ట్స్ సైన్స్, ఫిజియోథెరపీ, హాస్పిటాలిటీ, టెక్నాలజీ సపోర్ట్ వంటి విభాగాల్లో 50 నుండి 60 మంది ప్రొఫెషనల్స్ చొప్పున ఉద్యోగ అవకాశాలు పొందుతారని తెలిపారు. అనంతరం యూనివర్సల్ ఫిట్‌నెస్ గ్రూప్ ఆస్ట్రేలియా వ్యవస్థాపకులు రామచంద్ర, కో-ఫౌండర్ ఆంథోనీ కెర్క్‌మెజ్ మాట్లాడుతూ.. భారతదేశంలో ఏకీకృత వెల్‌నెస్ రంగానికి సంబంధించి సరికొత్త అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

## ధరలు పెంచిన టాటా మోటార్స్..

### జులై నుంచి ఈ కార్లు ప్రియం

దిల్లీ: ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్ లిమిటెడ్ కార్ల ధరలను పెంచేసింది. జులై 1 నుంచి కార్ల ధరలను 1.5 శాతం చొప్పున పెంచుతున్నట్లు తెలిపింది. ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్‌తో పాటు, ఎలక్ట్రిక్ వాహన ధరలనూ పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇప్పటికే ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ జూన్ నుంచి కార్ల ధరలను రూ.30 వేల వరకు పెంచిన వేళ.. టాటా మోటార్స్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం.ముడి సరకు ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం ఒత్తిళ్ల కారణంగా పాక్షికంగా ధరల పెంపు చేపట్టాల్సి వస్తోందని టాటా మోటార్స్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. అయితే, వినియోగదారులపై పెద్దగా ప్రభావం పడకుండా కొంత మొత్తం మాత్రమే బదిలీ చేస్తున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. మోడల్, వేరియంట్‌ను బట్టి ధరల పెంపు వర్తిస్తుందని కంపెనీ తెలిపింది. టియాగో, ఆల్ట్రోజ్, టిగోర్, పంచ్, నెక్సాన్, సియారా, హ్యారియర్ వంటి సంప్రదాయ ఇంజిన్‌తో నడిచే కార్లతో పాటు టియాగో ఈవీ, టిగోర్, పంచ్ ఈవీ, నెక్సాన్ ఈవీ, కర్వ్ ఈవీ, హ్యారియర్ ఈవీ మోడళ్లను టాటా మోటార్స్ విక్రయిస్తోంది.



## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,95,000

# 'ఏఐ'తో మరిన్ని ఉద్యోగాలు

## అధునాతన నైపుణ్యాలు అభ్యసిస్తూనే ఉండాలి : మైక్రోసాఫ్ట్ ఐడీసీ ఎండీ రాజీవ్ కుమార్

న్యూఢిల్లీ:కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత వల్ల ఐటీ రంగంలో పోతున్న ఉద్యోగాలకు మించి ఎక్కువ ఉద్యోగ అవకాశాలు వస్తాయని మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ (ఐడీసీ) ఎండీ, అధ్యక్షుడు రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. ఐటీ రంగ ఉద్యోగాలను ఏఐ తుడిచిపెట్టేస్తుందనే భయాలను వీడి, ఏఐతో కలిసి పనిచేయడంపై భారతీయ ఇంజినీర్లు దృష్టి పెట్టాలని గురువారం తన బ్లాగ్ పోస్ట్‌లో రాజీవ్ సూచించారు. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ, టెక్నికల్ నైపుణ్యాల కాలపరిమితి తగ్గిపోతోందని.. అందుకే నిరంతరం నేర్చుకోవడం, పరిస్థితులకు అనుగుణంగా మారడం ఉద్యోగులకు చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) విడుదల చేసిన ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్ 2025 గణాంకాలను ఈ సందర్భంగా రాజీవ్ ప్రస్తావించారు. దీని ప్రకారం.. 2030 నాటికి 39% కోర్ ఉద్యోగ నైపుణ్యాలు మారిపోనున్నాయి. ముఖ్యంగా మన దేశంలో 2030కి దాదాపు 63% మంది ఉద్యోగులకు భారీ స్థాయిలో నైపుణ్యాల మెరుగుదల లేదా కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం అవసరమవుతాయని అంచనా. 1995లో వచ్చిన ఇంటర్నెట్ విప్లవంతో, ఏఐకు పోలికలు ఉన్నాయని రాజీవ్ అన్నారు. చరిత్రలో వచ్చిన ప్రతి ప్రధాన సాంకేతిక విప్లవం.. ప్రారంభంలో ఆందోళనలు సృష్టించినా, అప్పటివరకు ఉన్న వాటి కంటే ఎన్నో



రెట్లు ఎక్కువ ఉపాధి అవకాశాలు సృష్టించాయని గుర్తు చేశారు. కొత్త ఉద్యోగాలు వస్తాయా లేదా ప్రశ్న కాదని, కొత్త పాత్రల్లోకి అడుగుపెట్టడానికి మనం ఎంత సిద్ధంగా ఉన్నామనేదే ముఖ్యమన్నారు. 'అవరోధాలు/అనుమానాలు వీడి కొత్తగా కావాల్సినవి నేర్చుకోవడం' యువ ఇంజినీర్లకు చాలా కీలకమని వెల్లడించారు. ఇప్పటికే భారత కంపెనీల్లో ఏఐ ట్రైనర్లు, ఏజెంట్ స్పెషలిస్టులు, ఏఐ సెక్యూరిటీ నిపుణుల వంటి కొత్త ఉద్యోగ విభాగాలు పుట్టుకొస్తున్నాయని రాజీవ్ తెలిపారు.'కోడింగ్ చేయడంలో ఏఐ మీకు సహాయపడుతుంది. కానీ మీ లక్ష్యాలను అది నిర్ణయించలేదు. మీ వినియోగదారులను అర్థం చేసుకోలేదు లేదా ఏది ముఖ్యమో నిర్వచించలేదు. అనుభవం, నైతిక విలువలతో కూడిన మానవ నిర్ణయాధికారమే గొప్ప నిపుణులను ప్రత్యేకంగా నిలబెడుతుంది' అని రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఇంజినీరింగ్ నైపుణ్యాలతో పాటు డిజిటల్ లక్ష్యాలు, భారీ స్థాయిలో ఆవిష్కరణల సామర్థ్యం భారత్‌కు బలాలని ఆయన కొనియాడారు. అమెరికా వెలుపల మైక్రోసాఫ్ట్‌కు ఉన్న అతిపెద్ద రీసెర్చ్, డెవలప్‌మెంట్ హబ్.. హైదరాబాద్‌లోని మైక్రోసాఫ్ట్ ఐడీసీ అని, ఇక్కడి బృందాలు అంతర్జాతీయ ఆవిష్కరణల్లో పాలుపంచుకోవడమే కాకుండా.. ఆవిష్కరణలకు ఆర్కిటెక్ట్‌లుగా వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు.

సూపర్ టాపప్ రూ.5 కోట్ల వరకూ..

పెరుగుతున్న వైద్య ఖర్చులను దృష్టిలో ఉంచుకొని, సూపర్ టాపప్ పాలసీ ఎంచుకోవాలనుకునే వారికోసం టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ 'మెడికేర్ రిజర్వ్' పేరుతో కొత్త పాలసీని తీసుకొచ్చింది. పాలసీదారులు రూ.5లక్షల నుంచి రూ.5 కోట్ల వరకూ ఈ బీమా కవరేజీని తీసుకోవచ్చు. స్వచ్ఛంద మినహాయింపును రూ.3లక్షల నుంచి రూ.50లక్షల వరకూ ఎంచుకోవచ్చు. అంటే, పాలసీదారుడు ఎంచుకున్న మినహాయింపు తర్వాత అయ్యే ఖర్చునే మెడికేర్ రిజర్వ్ భరిస్తుందన్నమాట. వరుసగా అయిదేళ్ల పాటు ఈ పాలసీలో కొనసాగిన తర్వాత, ఎలాంటి కొత్త వైద్య పరీక్షలు లేకుండానే దీన్ని పూర్తిస్థాయి ఆరోగ్య బీమా పాలసీగా మార్చుకునే వీలుంటుంది. తరచూగా ఉద్యోగాలు మారడం వల్ల కేవలం సంస్థలు అందించే బృంద ఆరోగ్య బీమా సరిపోవడం లేదు. అదే

## మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ:అంతర్జాతీయ పరిణామాలతో ఇటీవల కాస్త దిగొచ్చిన బంగారం, వెండి ధరలు శుక్రవారం మళ్లీ పెరిగాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు శాంతించడంతో ఈ లోహాలకు డిమాండ్ దక్కింది. దీంతో దేశీయ విపణిలోనూ వీటి ధరలు పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,52,200కు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.3వేల పైన పెరిగింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.49 లక్షలు పలికింది. దీని ధర ఒక్క రోజే దాదాపు రూ.9వేల మేర పెరగడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు పెరిగాయి. నేడు ఔన్సు పుత్తడి ధర 4,205 డాలర్లు పలికింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు 100 డాలర్ల పైన పెరిగింది. ఇక ఔన్సు వెండి ధర 67.32 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.1.50లక్షలు, వెండి ఫ్యూచర్స్ ధర రూ.2.43లక్షల వద్ద కొనసాగుతోంది. ఇరాన్‌పై తాజా దాడుల్ని విరమించుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. టెహ్రాన్‌తో చర్చలు దాదాపు కొలిక్కి వచ్చాయని, ఆ దేశ అగ్రనాయకత్వం తమ ప్రతిపాదనలకు అంగీకరించిందని చెప్పారు. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గొచ్చనే అంచనాలు వ్యక్తమయ్యాయి. ఈ పరిణామాలతో ముడి చమురు ధరలు కూడా దిగొచ్చాయి. అటు మన దేశ కరెన్సీ రూపాయి విలువ కూడా భారీగా కోలుకుంది. నేటి మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే 60 పైసలు బలపడి 95.25 వద్ద ట్రేడ్ అవుతోంది.



## దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడికి 30ఏళ్ల జైలు



సియోల్:దేశంలో మార్షల్ లా విధించిన కేసులో దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యేల్ ఇప్పటికే జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. కాగా 2024 అక్టోబర్‌లో ఉత్తర కొరియాలోకి డ్రోన్లు పంపినందుకు గాను ఆయనకు మరో 30ఏళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు దక్షిణ కొరియాలోని కోర్టు తీర్పు వెలువరించింది. కిమ్ సేనను రెచ్చగొట్టేందుకే ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంది. చట్టవిరుద్ధంగా పార్లమెంటును తన గుప్పిట్లోకి తీసుకునేందుకు, నేతలను అరెస్టు చేసేందుకు, అనియంత్రిత అధికారాన్ని చెలాయించేందుకు ఆయన విధించిన 'మార్షల్ లా' విఫలమవడంతో ఓ సాకు సృష్టించుకోవడానికి ఈ చర్యలకు పాల్పడినట్లు వెల్లడించింది. యూన్‌తో పాటు, ఆయన మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్, డిఫెన్స్ కౌంటర్ ఇంటెలిజెన్స్ కమాండ్ మాజీ అధిపతి యో ఇన్ హ్యూంగ్, డ్రోన్ ఆపరేషన్స్ కమాండ్స్ మాజీ అధిపతి కిమ్ యోంగ్-దేలను న్యాయస్థానం దోషులుగా నిర్ధరించింది. వారికి కూడా జైలు శిక్ష విధించింది. అత్యవసర పరిస్థితిని సృష్టించడం కోసం ఉత్తర కొరియాను రెచ్చగొట్టడానికి నిందితులు సైనిక చర్య అనే ముసుగును ఉపయోగించారని విమర్శించింది. అయితే చెత్త బెలూన్లను తమ దేశంపై ప్రయోగించి.. తమను రెచ్చగొట్టడానికి యత్నించిన ఉత్తర కొరియాకు తగిన బుద్ధి చెప్పడానికే మాజీ అధ్యక్షుడు ఆ దేశంలోకి డ్రోన్లను పంపారని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ 2024 డిసెంబరులో అధికారంలో ఉన్న అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో 'మార్షల్ లా' విధించారు. వారి నుంచి దేశానికి రక్షణ కల్పించడానికే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో గంటల వ్యవధిలోనే ఆ ప్రకటనను విరమించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అభిశంసనకు గురై పదవిని కోల్పోయారు. ప్రస్తుతం ఆయన జైల్లో ఉన్నారు.

## రుతుపవనాలపై ఎల్‌నినో శరాఘాతం

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎల్‌నినోపై భారత వాతావరణ విభాగం ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. భూమధ్య రేఖ ప్రాంతంలో పసిఫిక్ మహాసముద్ర ఉపరితలంపై ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపింది. ఈ రుతుపవనాల సీజన్‌లో ఇది మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని.. పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపనుందని హెచ్చరించింది. దేశంలో రుతుపవనాలపై ఎల్‌నినో ప్రతికూల ప్రభావం ఉంటుందని పేర్కొంది. అత్యధిక వర్షపాతం నమోదయ్యే నైరుతి రుతుపవనాల్లో ఈసారి వర్షపాతం తగ్గుతుందని అంచనా వేసింది. భూమధ్య రేఖ ప్రాంతంలో పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు సాధారణం కన్నా ఎక్కువగా వేడెక్కడాన్ని ఎల్‌నినోగా అభివర్ణిస్తారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పోకడలు తారుమారవుతాయి. చివరిగా ఎల్‌నినో ప్రభావం 2023లో ఏర్పడింది. ఆ సమయంలో దేశవ్యాప్తంగా రుతుపవనాల అంతరాయం, వర్షపాతంలో వైవిధ్యం వంటి పరిస్థితులు తలెత్తాయి.

కేంద్రం చర్యలు

ఎల్‌నినో ప్రభావానికి అత్యంత ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్న 197 జిల్లాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. పంట నష్టభయాలను తగ్గించడానికి రాష్ట్రాల వారీగా అత్యవసర ప్రణాళికలను రూపొందించామన్నారు. వాతావరణ పరిస్థితులు క్షీణిస్తే త్వరితగతిన స్పందించేందుకు ముందుజాగ్రత్త చర్యగా ప్రభుత్వం విత్తనాలతో పాటు ఇతర కీలక వ్యవసాయ ఉత్పాదకాలను నిల్వ చేసిందని వెల్లడించారు.

## ఫారం-16 చేతికొచ్చిందా?

ఉద్యోగులకు యాజమాన్యాలు ఫారం-16 జారీ చేసే ప్రక్రియ మొదలైంది. చేతికి ఫారం-16 రాగానే వెంటనే రిటర్నులు దాఖలు చేయాలని తొందరపడకూడదు. అందులోని వివరాలను, ఇతర పన్ను సంబంధిత పత్రాలతో నిశితంగా సరిపోల్చుకొని, ఏమైనా పొరపాట్లు ఉంటే రిటర్నులు దాఖలు చేయడానికి ముందే సరిదిద్దుకోవడం అవసరం. ఐటీఆర్ సమర్పించే ముందు ప్రతి పన్ను చెల్లింపుదారు తప్పనిసరిగా తనిఖీ చేయాల్సిన విషయాలను చూద్దాం. ఫారం-16 అంటే.. ఉద్యోగికి యాజమాన్యం జారీ చేసే మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్) ధ్రువీకరణ పత్రం. ఆ ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన జీతం, విధించిన పన్ను వివరాలు ఇందులో ఉంటాయి.పార్ట్ ఏ: ఇందులో ఉద్యోగి, యాజమాన్యం వివరాలు, చెల్లించిన వేతనం, పన్ను కోత, ప్రభుత్వానికి జమ చేసిన పన్ను వివరాలు ఉంటాయి. మదింపు సంవత్సరం, ఉద్యోగ కాలం, త్రైమాసిక వేతనం, చలాన్ లేదా బుక్ ఐడెంటిఫికేషన్ నంబరు వంటి సమాచారం ఉంటుంది.పార్ట్ బీ: ఇందులో పన్ను విధించదగిన ఆదాయం లెక్కింపు ఉంటుంది. జీతం వివరాలు, మినహాయింపులు, నికర పన్ను వివరాలు ఇందులో ఉంటాయి.ఫారం-16ఏ.. జీతాలు కాకుండా, వడ్డీ, వృత్తిపరమైన ఫీజులు, అద్దె లేదా కమిషన్ల వంటి ఇతర ఆదాయాలపై విధించిన టీడీఎస్‌కు సంబంధించిన ధ్రువీకరణ పత్రం. ప్రభుత్వానికి పన్ను జమ చేసి, టీడీఎస్ రిటర్నులు దాఖలు చేసిన తర్వాత ప్రతి త్రైమాసికానికీ దీనిని జారీ చేస్తారు. ఫారం 16, ఫారం16ఏ ఎంత పన్ను కోత విధించారు అనేది స్పష్టం చేస్తాయి కానీ, పన్ను విధించదగిన మొత్తం ఆదాయానికి సంబంధించిన పూర్తి వివరాలు అందించకపోవచ్చు.వివరాలు సరిగా..:ముందుగా ఫారం 16, ఫారం 16ఏలలో మీ పేరు, శాశ్వత ఖాతా సంఖ్య (పాన్), చిరునామా వంటి వ్యక్తిగత వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలి. ఇందులో చిన్న తప్పు ఉన్నా రిటర్నుల ప్రాసెసింగ్‌లో ఇబ్బందులు ఎదురవుతాయి. యాజమాన్యం పేరు, పాన్, టాన్, మదింపు సంవత్సరం సరిగ్గా ఉన్నాయో లేదో తనిఖీ చేయాలి. పార్ట్ ఏ, పార్ట్ బీలోని జీతం, టీడీఎస్ వివరాలను మీ వేతనం స్లిప్పులతో పోల్చి చూసుకోవాలి. పాత పన్ను విధానాన్ని ఎంచుకున్న వారు హెచ్ఆర్ఏ, ఎల్‌టీఏ, ప్రావిడెంట్ ఫండ్, జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియం వంటి తగ్గింపులను సరిచూసుకోవాలి. ఒకవేళ ఫారంలో కొన్ని తగ్గింపులు చేర్చకపోతే, రిటర్నులు దాఖలు చేసేటప్పుడు క్లెయిం చేసుకోవచ్చు. ఫారం 16 ఎప్పుడూ నూరు శాతం సరిగ్గానే ఉంటుందని నమ్మకూడదు. దాన్ని కచ్చితంగా ఇతర పత్రాలతో సరిపోల్చుకోవాలి. ఏఐఎస్, ఫారం 26ఏఎస్‌తో..:ఫారం 26ఏఎస్.. మీ పాన్ నంబరుపై విధించిన, వసూలు చేసిన పన్నులను చూపే వార్షిక ట్యాక్స్ క్రెడిట్ స్టేట్‌మెంట్. వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్) మరింత సమగ్రమైంది. ఫారం 16లో కనిపించని వడ్డీ ఆదాయం, డివిడెండ్ల వంటి అదనపు ఆదాయాలను ఏఐఎస్ నమోదు చేస్తుంది. మీరు రిటర్నులలో చూపిన ఆదాయాన్ని.. ఫారం 26ఏఎస్, ఏఐఎస్ సమాచారంతో ఆదాయపు పన్ను విభాగం పోల్చి చూస్తుంది. ఫారం 16లో ఉన్న ఆదాయం ఏఐఎస్, 26ఏఎస్‌లతో సరిపోతుందో లేదో ముందే చూసుకోవాలి.

## చైనాపై 'సముద్ర జీవుల' గూఢచర్యం..!

బీజింగ్:తమ దేశ రహస్యాలను తెలుసుకునేందుకు శత్రు దేశాలు తాబేళ్లు, చేపలను ఉపయోగిస్తున్నాయని చైనా ఆరోపించింది. తమ రహస్యాలు తెలుసుకోవడానికి పశ్చిమ దేశాల గూఢచారులు చైనా తీర ప్రాంతాల్లోని తాబేళ్లు చేపలు వంటి సముద్ర జీవాలకు సెన్సర్లు అమర్చి వదులుతున్నట్లు చైనా మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్యూరిటీ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. సున్నితమైన సముద్ర సమాచారాన్ని దొంగిలించడానికి అంతర్జాతీయ గూఢచార సంస్థలు సరికొత్త పరికరాలను వినియోగిస్తున్నాయని పేర్కొంది. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ దేశాలకు హెచ్చరికలు చేసింది చైనా తీర జలాల్లో సెన్సర్లు అమర్చిన పలు తాబేళ్లు, చేపలను గుర్తించినట్లు చైనా భద్రతా మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ జీవులు ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఈదుతూ నీటి ఉష్ణోగ్రత, లవణీయత, సముద్ర ప్రవాహం వంటి సముద్ర పర్యావరణానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని (రావజీ ూవఇతీవబిబ) సేకరిస్తున్నట్లు తెలిపింది. ఆ డేటాను ఉపగ్రహాల ద్వారా విదేశాలకు పంపుతున్నట్లు గుర్తించామని పేర్కొంది. సౌరశక్తితో నడిచే వేవ్ గ్లైడర్‌లు, పోర్ట్ డైనమిక్స్‌ను చిత్రీకరించగల సామర్థ్యం ఉన్న పరికరాలను విదేశీ బృందాలు సరకు రవాణా నౌకలపై అమర్చి తీర ప్రాంత సమాచారాన్ని సేకరించాయని ఆరోపించింది. ఈవిధంగా సేకరించిన డేటాను ఉపయోగించి తమ జాతీయభద్రతకు తీవ్ర ముప్పును కలిగించడానికి పశ్చిమదేశాలు కుట్ర పన్నుతున్నాయని బీజింగ్ ఆరోపించింది. దీంతో ఇకపై విదేశాల నుంచి చైనాకు వచ్చే నౌకలు, పరికరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించింది.

## జొన్నకు బదులు ప్రత్యామ్నాయ పంట వేయండి: ఎమ్మెల్యే



పెద్ద కొడప్గల్ జూన్ 12 (జనంసాక్షి): పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలో శుక్రవారం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఇళ్లా పట్టాలను పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ... ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించినప్పటికీ లబ్ధిదారులకు పట్టాలు అందించలేదని, తన దృష్టికి రావడంతో వెంటనే అధికారులతో సమన్వయం చేసి పట్టాల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర మౌలిక సదుపాయాలను త్వరలోనే కల్పిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ధాన్యం సేకరణలో గతంలో అనేక అక్రమాలు జరిగాయని, ప్రస్తుతం అక్రమాలు జరగకుండా పగడ్బందీగా సేకరణ చేయడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా అక్రమాలు జరిగితే ఊరుకునేది లేదని, రైతులు ఏ పంటను వేస్తే అదే పంటను ఆన్లైన్ లో నమోదు చేయించాలని, పంట వేయకుండానే పంట వేసినట్లు నమోదు చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జొన్న పంట కొనుగోలుకు చాలా ఇబ్బంది పడాల్సి వచ్చిందని, జొన్న కొనుగోలు రాష్ట్ర ప్రభుత్వం చేతిలో లేదని కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందని తెలిపారు. భవిష్యత్తులో కేంద్రం జొన్న పంటను కొనుగోలు చేస్తుందో లేదో నమ్మకం లేదని, రైతులు జొన్న పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయుటకు ఆలోచనలు చేయాలని సూచించారు. ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న తమ సమస్య పరిష్కారం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, తహసీల్దార్ రాజశేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో అభినవ్ చందర్, ఎస్ఐ అరుణ్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శామప్ప, ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయ ఉద్యోగులకు వరాల జల్లు

### *26 మంది ఈవోలకు పదోన్నతి ఉత్తర్వుల అందజేత*

- అర్చకులు, సిబ్బందికి సంక్షేమ పథకాల ప్రయోజనాల పెంపు
- దేవాలయాల్లో అదనపు సిబ్బంది నియామకానికి కొండా సురేఖ హామీ
- ప్రజా ప్రభుత్వంలో హక్కులు, ప్రయోజనాలు సంపూర్ణంగా దక్కుతాయి



**హైదరాబాద్, జూన్ 12 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో దేవాదాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, అర్చకులు, ఇతర సిబ్బందికి దక్కాల్సిన హక్కులు, సంక్షేమ ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటామని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 కార్యనిర్వహణ అధికారులుగా పదోన్నతి పొందిన 26 మంది ఈవోలకు ఆమె ప్రమోషన్ ఉత్తర్వులు అందజేశారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని అర్చకులు, ఇతర ఉద్యోగుల కోసం అమలవుతున్న 'అర్చక, ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్టు' ద్వారా రిటైర్మెంట్ గ్రాట్యుటీ, ఉపనయనం గ్రాంట్, ఇంటి నిర్మాణ సహాయం, విద్యా పథకం తదితర సంక్షేమ పథకాల ప్రయోజనాలను పెంచినట్లు మంత్రి ప్రకటించారు. పెంచిన మొత్తాలు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. ఉద్యోగులు, అర్చకులు సంతృప్తిగా ఉంటేనే వారు మరింత నిబద్ధతతో పనిచేస్తారని ప్రభుత్వం విశ్వసిస్తోందని మంత్రి పేర్కొన్నారు. త్వరలో అసిస్టెంట్ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్ స్థాయికి, అలాగే ఇతర ఈవోలకు కూడా పదోన్నతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. దేవాలయాల నిర్వహణను బలోపేతం చేసేందుకు అవసరమైన అదనపు సిబ్బందిని నియమించే ప్రక్రియను ప్రారంభించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అర్చకులు, ఉద్యోగులకు సంక్షేమ పథకాల అమలును మరింత సులభతరం చేసేందుకు ప్రత్యేక వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గ్రీన్ ఛానల్ ద్వారా ఆర్థిక ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా డిజిటల్ వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. వర్షాకాలంలో దేవాలయాలను పచ్చదనంతో నింపేందుకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈవోల ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న పదోన్నతులు లభించడంతో ఈవోలు ఆనందం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల ప్రయోజనాల పెంపుపై అర్చకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ వి. హన్మంతరావు, తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ, వివిధ అర్చక సంఘాల ప్రతినిధులు, ఈవోలు, ఉద్యోగులు, అర్చకుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం...

**శంకర్ పల్లి జూన్ 12(జనం సాక్షి) :** మొకిల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఈగల్ టీమ్ సమక్షంలో డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించి మాదక ద్రవ్యాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాపార దుకాణాలు మరియు ఇతర ప్రజా ప్రదేశాలను సందర్శించి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించబడింది. అలాగే ఫ్యూచర్ సిటీ కమిషనరేట్కు చెందిన నార్కోటిక్స్ డిటెక్షన్ డాగ్ (తేజ) దాని హ్యాండ్లర్ శ్రీ కె.ఆంజనేయులు, ఆర్ఎస్ఐ రాము మరియు మొకిల ఎస్సై పద్మ సమక్షంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. అక్రమంగా మాదక ద్రవ్యాల విక్రయం, నిల్వ, రవాణా లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని దుకాణదారులు మరియు ప్రజలకు సూచించబడింది.

## నిమ్స్‌లో ఏఎంబీఐ రాష్ట్ర సదస్సు ప్రారంభం

- ల్యాబ్ మెడిసిన్, లివర్ కేర్‌పై రెండ్రోజుల శాస్త్రీయ చర్చలు
- టోటల్ ల్యాబ్ ఆటోమేషన్ వైద్య రంగానికి కొత్త దిశ: రాహుల్ దేవరాజ్
- కృత్రిమ మేధస్సుతో ప్రయోగశాల సేవల్లో విప్లవాత్మక మార్పులు
- రాష్ట్రవ్యాప్తంగా బయోకెమిస్ట్రీ నిపుణుల సమాగమం



**ఖైరతాబాద్, జూన్ 12 (జనంసాక్షి):**
అసోసియేషన్ ఆఫ్ మె డికల్ బయోకెమిస్ట్స్ ఆఫ్ ఇండియా(ఏఎంబిఐ) తెలంగాణ చాప్టర్ 7వ రాష్ట్ర సదస్సు శుక్రవారం నిజాం ఇన్స్టి ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) (నిమ్స్) ట్రామా బ్లాక్ ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమైంది. నిమ్స్ బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'ఫ్రాంటియర్స్ ఇన్ ల్యాబ్ మెడిసిన్- టోటల్ ల్యాబ్ ఆటోమేషన్ అండ్ లివర్ కేర్' అనే ప్రధాన అంశంతో నిర్వహిస్తున్న ఈ సదస్సు రెండు రోజులపాటు కొనసాగనుంది. సదస్సుకు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ ముఖ్య అతిథిగా హాజరై బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డా. ఎం. నూర్జహాన్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక వైద్య రంగంలో ప్రయోగశాల సేవలు రోగ నిర్ధారణకు వెన్నెముక వంటివని పేర్కొన్నారు. టోటల్ ల్యాబ్ ఆటోమేషన్ ద్వారా పరీక్షల ఖచ్చితత్వం, వేగం, నాణ్యత గణనీయంగా మెరుగుపడతాయని తెలిపారు. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ టెక్నాలజీలు, డేటా ఆధారిత వ్యవస్థలు ప్రయోగశాల సేవలను మరింత సమర్థవంతంగా, విశ్వసనీయంగా మార్చనున్నాయని వివరించారు. వైద్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరగడం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు. సదస్సు తొలి రోజు 'అడ్వాన్సెస్ ఇన్ ల్యాబ్ ఆటోమేషన్' అంశంపై శాస్త్రీయ సమావేశాలు నిర్వహించారు. ల్యాబ్ ఆటోమేషన్ పరిణామక్రమం, టోటల్ ల్యాబ్ ఆటోమేషన్ విధానాలు, అమలులో ఎదురయ్యే సవాళ్లు, డిజిటల్ ఇంటిగ్రేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పోస్టర్ ప్రెజెంటేషన్లు, పరిశోధన పత్రాల ప్రదర్శనలతో పాటు నిమ్స్‌లో అమలులో ఉన్న టోటల్ ల్యాబ్ ఆటోమేషన్ వ్యవస్థను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. సదస్సు రెండో రోజు 'అండర్‌స్టాండింగ్ ది లివర్ ఇన్ ది ల్యాబ్' అంశంపై కాలేయ వ్యాధుల నిర్ధారణలో ప్రయోగశాల పరీక్షల పాత్ర, లివర్ ఫైబ్రోసిస్ అంచనా, ఆధునిక బయోమార్కర్లు, మాలిక్యులర్ మార్కర్ల వినియోగంపై చర్చలు జరగను న్నాయి. అలాగే సీనియర్ బయోకెమిస్టుల సన్మానం, పీజీ విద్యార్థుల కోసం డిబేట్ పోటీలు, బ్రెయిన్ మారథాన్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో నిమ్స్ ఇన్‌చార్జి డీన్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డా. శాంతివీర్, అదనపు ప్రొఫెసర్ డా. ఎన్.ఎన్. శ్రీదేవి, సీనియర్ ప్రొఫెసర్ డా. కె.ఎస్.ఎస్. సాయిబాబా, బయోకెమిస్ట్రీ విభాగానికి చెందిన అధ్యాపకులు, రాష్ట్రంలోని వివిధ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల నుంచి వచ్చిన బయోకెమిస్ట్రీ నిపుణులు, పరిశోధకులు, రెసిడెంట్ వైద్యులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఏలదే కీలక పాత్ర: మధుయాష్కీ గౌడ్
- ఓట్ల తొలగింపుతో బీజేపీ లబ్ధి పొందే ప్రమాదమని ఆరోపణ
- అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలి
- ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ బీఎల్ఏల శిక్షణ కార్యక్రమం



**హయత్‌నగర్, జూన్ 12 (జనం సాక్షి):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అత్యంత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా పని చేయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాక్‌హిల్స్ కాలనీలోని ఎస్వీఎల్ ఎరీనాలో నిర్వహించిన బీఎల్ఏల శిక్షణ కార్యక్రమంలో ఈ సూచనలు చేశారు.

కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మధుయాష్కీ గౌడ్, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డా. వెన్నెల గద్దర్, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు. టీపీసీసీ ట్రైనర్లు కృష్ణచైతన్య, కృష్ణారెడ్డి బీఎల్ఏలకు ఓటర్ల నమోదు, జాబితా సవరణ, డూప్లికేట్ ఎంట్రీల తొలగింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో భారీ స్థాయిలో ఓట్ల తొలగింపులు, కొత్త ఓట్ల నమోదుపై వివాదాలు తలెత్తాయని పేర్కొన్నారు. తెలంగాణలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి బీఎల్ఏ అప్రమత్తంగా వ్యవహరించి, బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన ఓటర్ల హక్కులు కాపాడాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పనిచేయాలన్నారు. చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ పేద, బలహీన వర్గాల ఓట్లు జాబితా నుంచి తొలగిపోకుండా బీఎల్ఏలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వెన్నెల గద్దర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ రక్షణ కోసం పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రాథమిక సర్వేలో ఓటర్ల మ్యాపింగ్‌లో గణనీయమైన వ్యత్యాసాలు గుర్తించామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా బీఎల్ఏలు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, వెనుకబడిన వర్గాల ఓటర్ల నమోదులో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, రాష్ట్ర యాదవ్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు డిస్కమ్‌ను వెనక్కి తీసుకోవాలి

### మూడో డిస్కమ్ రైతుల పాలిట మరణశాసనం: విద్యుత్ నిపుణుడు వేణుగోపాల్

**ముషీరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రైతు డిస్కమ్ రైతులకు ప్రయోజనం కంటే నష్టమే కలిగిస్తుందని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని విద్యుత్ రంగ నిపుణుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర శిక్షణా తరగతుల్లో 'విద్యుత్ సంస్కరణలు--రైతులపై ప్రభావం' అంశంపై ఆయన ప్రసంగించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ప్రత్యేక రైతు డిస్కమ్‌ను ఏర్పాటు చేయడం దుస్సాహసమని పేర్కొన్నారు. భారీ అప్పులతో ప్రారంభమయ్యే సంస్థ రైతులకు మెరుగైన సేవలు ఎలా అందిస్తుందో ప్రభుత్వం వివరించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న రెండు డిస్కమ్‌లు సమర్థవంతంగా సేవలు అందిస్తున్నాయని, మూడో డిస్కమ్ అవసరం లేదన్నారు. కొత్త సంస్థ ఏర్పాటు వల్ల అప్పులు పెరగడం తప్ప రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని అభిప్రాయపడ్డారు. రైతు డిస్కమ్‌పై గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవగాహన లేదని, ప్రభుత్వం ముందుగా ప్రజలు, రైతులు, ఉద్యోగులు, విద్యుత్ నిపుణులతో విస్తృత చర్చలు జరపాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీలో కూడా చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరైన విధానం కాదని విమర్శించారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతూ రైతు డిస్కమ్ ఏర్పాటు వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రైతులకు తక్కువ ఖర్చుతో లభించే విద్యుత్ అందించాల్సింది పోయి అధిక వ్యయంతో కూడిన థర్మల్ విద్యుత్‌ను కేటాయించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, భారీ వ్యయాలతో కొత్త సంస్థను ప్రారంభించడం వల్ల కార్పొరేట్ సంస్థలకే లాభం చేకూరుతుందని విమర్శించారు.

రైతు డిస్కమ్ ఏర్పాటుకు ముందు విద్యుత్ సంస్థల నిర్మాణం, సిబ్బంది కేటాయింపు, ఆర్థిక వనరులపై స్పష్టత అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అరిబండి ప్రసాద్‌రావు, పి. జంగారెడ్డి, మూడ్ శోభన్, ఉడుత రవీందర్‌తో పాటు పలువురు రైతు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రజలకు పారదర్శకమైన, సత్వర స్పందనతో కూడిన

## సేవలను అందించడమే లక్ష్యం

### సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నేరాల నియంత్రణకు కృషి చేయాలి
### స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి :జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**యాలాల జూన్ 12 (జనంసాక్షి) :** వార్షిక తనిఖీలలో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, శుక్రవారం యాలాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ వార్షిక తనిఖీలో భాగంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే స్టేషన్‌లోని వివిధ రికార్డులు, రిజిస్టర్లను నిశితంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల వివరాలు, నమోదైన కేసుల పురోగతి, బ్లూ కోల్ట్స్ మరియు పెట్రో కార్ల నిర్వహణ తీరు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా ప్రజలకు పారదర్శకమైన, సత్వర స్పందనతో కూడిన సేవలను అందించడమే పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. చట్టం అమలులో నిష్పాక్షికతను పాటించాలని, బాధితులకు సేవలందించడంలో పూర్తి పారదర్శకత కలిగి ఉండాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసులు లేదా ఫైళ్లను పెండింగ్‌లో ఉంచవద్దని, ఎప్పటికప్పుడు దర్యాప్తును పూర్తి చేసి సంబంధిత వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేయాలని ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని, రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన 'సురక్ష మిత్ర' మరియు 'నిఘా నేత్రం' కార్యక్రమాల ప్రాముఖ్యతపై పోలీస్ అధికారులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ డీఎస్పీ యాదయ్య, యాలాల ఎస్ఐ విట్టల్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌కు వేగం

- మూడు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలి
- జాప్యానికి తావు లేకుండా చర్యలు
- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌లైన్
- కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశాలు



**కరీంనగర్ బ్యూరో, జూన్ 12 (జనంసాక్షి) :** జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్-2010 అమలు, ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు, అనుమతుల జారీ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆస్పత్రులను సంబంధిత శాఖలు సంయుక్తంగా తనిఖీ చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులను పరిశీలించిన తర్వాతే నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు (ఎన్ఓసీలు) జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులో పరిష్కరించాలని స్పష్టం చేశారు.

మూడు నెలల్లోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. హెల్ప్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ, సాంకేతిక సమస్యలు, అనుమతులకు సంబంధించిన అంశాలపై మార్గదర్శకత్వం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలంటే అన్ని వైద్య సంస్థలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ పొందడం ద్వారా వైద్య సేవల్లో నాణ్యత, పారదర్శకత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతుందని వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీరామ్, జిల్లా ఫైర్ ఆఫీసర్ ముప్పిడి శ్రీనివాస్ రెడ్డి, పోలీసు శాఖ ప్రతినిధులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షురాలు ఆకుల శైలజ, ప్రధాన కార్యదర్శి మహేష్, కోశాధికారి నీలిమా తదితరులు పాల్గొన్నారు.

## దుబాయి ప్రమాద బాధితులకు అండగా 'బుర్జీల్' గ్రూప్

- భారీ సాయంపై కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- డా. షంషీర్ వయలిల్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానించిన ప్రజాప్రతినిధి
- మృతుల కుటుంబాలకు రూ.26 లక్షల చొప్పున ఆర్థిక సాయం
- గాయపడిన వారికి వైద్యం, పునరావాసం, విద్యా సహాయం



**కరీంనగర్ బ్యూరో జూన్ 12 (జనం సాక్షి) :**
దుబాయిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురు కార్మికులు, గాయపడిన తొమ్మిది మందికి రూ.2.60 కోట్ల విలువైన మానవతా సహాయ ప్యాకేజీ ప్రకటించిన దీబతీయవవశ్రీ ఎశీశ్రీఎఱఅస్త్రం చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త డా. షంషీర్ వయలిల్ కు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు. డా. షంషీర్ వయలిల్ అందుబాటులో లేకపోవడంతో ఆయన సంస్థ ప్రతినిధులను శుక్రవారం దుబాయిలో కలిసి ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే వెంట తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యుడు కొట్టాల సత్యం గౌడ్‌తో పాటు పలువురు తెలంగాణ సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుర్జీల్ గ్రూప్ ప్రతినిధులతో సమావేశమైన ఎమ్మెల్యే, డా. షంషీర్ వయలిల్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానించారు. ముఖ్యమంత్రి సమక్షంలో ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయ చెక్కులు అందజేసే కార్యక్రమం నిర్వహించాలని ప్రతిపాదించారు.

ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురిలో ముగ్గురు జగిత్యాల జిల్లాకు చెందిన వారని తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష దిర్హంలు (సుమారు రూ.26 లక్షలు) చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు వెల్లడించారు. అలాగే గాయపడిన తొమ్మిది మందికి వైద్య చికిత్స, పునరావాసం కల్పించడంతో పాటు ప్రభావిత కుటుంబాల పిల్లల విద్యకు కూడా సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు.

అంతకుముందు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దుబాయిలోని భారత రాయబార కార్యాలయాన్ని సందర్శించి కాన్సులేట్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను స్వదేశానికి తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దుబాయిలో ఎమ్మెల్యే పర్యటనను తెలంగాణకు చెందిన ఎన్నారైలు, సామాజిక కార్యకర్తలు సమన్వయం చేయగా, ప్రమాద బాధితులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

## ఖమ్మం బాలిక ఘటనలో నిందితుడికి కఠిన శిక్ష విధించాలి

- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ చేపట్టాలని ప్రజాసంఘాల డిమాండ్
- రూ. కోటి ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరిన నేతలు
- సుందరయ్య పార్క్ వద్ద ర్యాలీ నిర్వహించిన ప్రజాసంఘాలు




**ముషీరాబాద్, జూన్ 12 (జనం సాక్షి):**
ఖమ్మంలో మైనర్ బాలికపై అత్యాచారం చేసి, అనంతరం హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడు గౌస్ పాషాపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపి కఠిన శిక్ష విధించాలని పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సుందరయ్య పార్క్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, ఘటన అత్యంత దారుణమైందని, నిందితుడిపై వేగవంతమైన విచారణ జరిపి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం బాలిక నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని, ఆమెకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బాలిక కుటుంబానికి భద్రత కల్పించడంతో పాటు రూ. కోటి ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి స్పందించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళలు, బాలికలకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చట్టాల అమలులో కఠినత్వం ప్రదర్శించాలని కోరారు. నిరసన కార్యక్రమం అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి కు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీరామ్ నాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ అప్రమత్తం

## ప్రజాస్వామ్య పరిరక్షణకు బీఎల్‌ఏలు సైనికుల్లా పనిచేయాలి : సచిన్ సావత్

- ఓటు హక్కును కాపాడటం ప్రతి కార్యకర్త బాధ్యత
- ఓటర్ల జాబితా సవరణలో నిరంతర పర్యవేక్షణ అవసరం
- బీజేపీ ఓటు చోరీతో పాటు సీటు చోరీ చేస్తోందని ఆరోపణ
- బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి పిలుపు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 12 (జనంసాక్షి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో సైనికుల్లా పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావత్ పిలుపునిచ్చారు. శుక్రవారం వేములవాడలోని మహాలింగేశ్వర గార్డెన్స్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఎల్‌ఏల ప్రత్యేక అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ దేశ ప్రయోజనాల కోసం నిరంతరం పోరాటం చేస్తోందని సచిన్ సావత్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వేచ్ఛ లభించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ వ్యవస్థలను పరిరక్షించాల్సిన అవసరం మరింత పెరిగిందన్నారు. గత పన్నెండు సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం అభివృద్ధి కంటే రాజకీయ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. దేశంలో ఓటర్ల జాబితాల నిర్వహణ పారదర్శకంగా జరగాలని, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని అన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పుల విషయంలో బీఎల్‌ఏలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి బీఎల్ఓ ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఆధునిక భారత నిర్మాణానికి బలమైన పునాదులు వేశారని, ఆయన సేవలను విస్మరించరాదన్నారు. నెహ్రూతో ప్రధానమంత్రి నరేంద్రమోదీని పోల్చడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. ఇందిరాగాంధీ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సామాన్య ప్రజలకు ఎంతో మేలు చేశాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తోందని ఆరోపించిన సచిన్ సావత్, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని చర్యలు చేపడుతోందన్నారు. బీజేపీకి నచ్చని వర్గాల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, పశ్చిమ బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో లక్షలాది ఓట్లపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఓటు బ్యాంకును బలహీనపర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఓట్ల చోరీతో పాటు సీట్ల చోరీకి కూడా పాల్పడుతోందని విమర్శించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు బీఎల్‌ఏలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి బూత్ స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, దానిని కాపాడటం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు.

అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా, కొత్తగా అర్హత పొందిన వారికి ఓటు హక్కు కల్పించేలా బీఎల్‌ఏలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా బూత్ స్థాయిలో నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని, బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత శక్తివంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్, పీసీసీ పరిశీలకుడు గోపిశెట్టి రాఘవేందర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూం మధు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## నీట్, ఐఐటీ పరీక్షల అవకతవకలపై
# ఎన్ఎస్‌యూఐ ఆందోళన

- కేంద్ర విద్యాశాఖ మంత్రిని తొలగించాలని డిమాండ్
- ఐఐటీ అడ్వాన్స్‌డ్ పేపర్ లీక్ దేశ ప్రతిష్ఠకు దెబ్బ
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని హెచ్చరిక
- కరీంనగర్‌లో నిరసన ర్యాలీ, దిష్టిబొమ్మ దహనం

**కరీంనగర్ బ్యూరో, జూన్ 12 (జనంసాక్షి) :** ప్రతిష్ఠాత్మక నీట్, ఐఐటీ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకుంటున్న అవకతవకలు దేశ విద్యా వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వివిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు 'అల్ఫోర్స్' డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి విమర్శించారు. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో ఎన్ఎస్‌యూఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయనతో పాటు కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు. నీట్ పరీక్ష రద్దు చేసి తిరిగి నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడటం దేశ విద్యా వ్యవస్థకు అవమానకరమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, ఇటీవల దేశవ్యాప్తంగా విద్యార్థులు జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ఆందోళనలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని అన్నారు. ఈ ఏడాది ఐఐటీ రూర్కీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ప్రశ్నపత్రాల లీకేజీ, ప్రశ్నలలో లోపాలపై వచ్చిన ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని నరేందర్‌రెడ్డి అన్నారు. దేశ చరిత్రలో తొలిసారిగా ఐఐటీ అడ్వాన్స్‌డ్ ప్రశ్నపత్రం లీక్ అయ్యిందనే వార్తలు రావడం బాధాకరమన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారత విద్యా వ్యవస్థకు ఉన్న గౌరవాన్ని ఇలాంటి ఘటనలు దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తక్షణమే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించి విద్యార్థులకు న్యాయం చేయాలని నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జాతీయ స్థాయి పరీక్షలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనలో కూడా కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆందోళన అనంతరం కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రావణ్ నాయక్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్, సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజితారెడ్డి, చింతల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లగుట్టను కబ్జాదారుల నుండి కాపాడుకుందాం

**ముస్తాబాద్ జూన్ 12 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండలం నామాపూర్ గూడూరు గ్రామాల మధ్య వున్న పల్లగుట్టనీ కబ్జాదారుల చెర నుండి విముక్తి చెయాలని బీజేపీ నాయకులు అంజగౌడ్ ఆధ్వర్యములో ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ ముందు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 410 సర్వే నెంబర్ లో వున్న 116 ఎకరాల భూమికి 50 ఎకరాల భూమిని ఎస్సీకు ఇవ్వగా, మిగతా భూమి కబ్జారా యుళ్ళ ఆధీనములో వుందని, వెంటనే అధికారులు ఈ భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించి హద్దులు ఏర్పాటు చెయ్యాలి చేయలేని ఎడల ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడతాం పల్ల గుట్ట చుట్టూ మట్టి తవ్వకాలు మట్టి మాఫియా బకాసుర్లు మట్టిని అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్న కాంట్రాక్టర్లు ఓ పక్క అధికారులు మజా చేసుకుంటూ పట్టింపు లేకుండా ఎవరిస్తున్నారు. పత్రికల ద్వారా మట్టి తవ్వకాలపై ఎన్నోసార్లు వార్తలు వచ్చిన అధికారుల మధ్య చలనం లేకుండా పోయింది. పల్లగుట్టను కాపడవలసిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది ఈ సందర్భంగా తెలియజేశారు. లేని యెడల ఈ నిరసన కార్యక్రమాన్ని ఇదే విధముగా కొనసాగిస్తామని అన్నారు.ఈ కార్యక్రమములో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొమ్మెట రాజు, బిజెపి జిల్లా ప్రతినిధి సంతోష్ రెడ్డి, బిఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహ రెడ్డి,శీలం రాజు, గూడూరు మాజీ సర్పంచ్ చాకలి రమేష్,శీలం స్వామి, మాజీ వైస్ ఎంపీపీ చిట్లేని శ్రీనివాస్ రావులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలలకు ప్రైవేట్ పాఠశాలలు ఫీజులో రాయితీ ఇవ్వాలి



**నిజాంపేట్ జూన్ 12 (జనం సాక్షి) :** ప్రైవేట్ పాఠశాలలు జర్నలిస్టుల పిల్లల చదువు కోసం ఫీజులో 50% రాయితీ ఇవ్వాలని టిడబ్ల్యూ జేఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాయొక్క జర్నలిస్టుల పిల్లలకు 2026-27 సంవత్సరా లకు ఫీజుల్లో 50% రాయితీ జిల్లా విద్యాధికారి (డిఈఓ) వినతిపత్రం అందజేశారు. టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి గడ్డమీది అశోక్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు దామర జగదీశ్వర్ గుప్తా, ఏ గోవిందరావు లు మాట్లాడుతూ. మేడ్చల్ జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టుల పిల్లలకు ప్రతి విద్యా సంవత్సరం మాదిరిగా ప్రైవేట్ పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం మన జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 80 శాతం జర్నలిస్టులు వేతనాలు లేక నెలవారీ ఆదాయం లేక తమ పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు ఫీజులు కట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరాల్లో ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50% ఫీజు రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక రాయితీ అమలు చేయాలని సూచించారు. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా జీవో/సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ జేఎఫ్ నాయకులు శివకుమార్, వీరేష్ ముదిరాజ్, సంజీవ్ కుమార్, శ్యాం ముదిరాజ్ పాల్గొన్నారు.

# గంజాయి,మత్తు పదార్థాలపై ఉక్కుపాదం

- రూ.1,00,23,250 విలువైన 200.465 కిలోల గంజాయి ధ్వంసం
- విక్రయిస్తే కఠిన చర్యలు : రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని, జనంసాక్షి :** గంజాయి,ఇతర మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 53 కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ నిషేధిత గంజాయి 200.465 కిలోలను ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కోర్టు అనుమతితో ధ్వంసం చేసినట్లు తెలిపారు. న్యాయాధికారుల సమక్షంలో కేసు ప్రాపర్టీ నుంచి ఎఫ్ఎస్ఎల్ పరీక్షల కోసం నమూనాలు సేకరించి,మిగిలిన గంజాయిని కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ కరీంనగర్ జిల్లా,మానకొండూర్ మండలం, ఈదులగట్టెపల్లి గ్రామంలోని వెంకటరమణ ఇన్‌సినిరేటర్స్‌లో దహనం చేసినట్లు తెలిపారు.మొత్తం 53 కేసులకు సంబంధించిన 200.465 కిలోల ఎండు గంజాయితో పాటు 34 గంజాయి మొక్కలను ఇన్‌సినిరేషన్ ప్రక్రియ ద్వారా ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ధ్వంసం చేసిన గంజాయి,గంజాయి మొక్కల మొత్తం విలువ రూ.1,00,23,250 ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్,ఇతర మత్తు పదార్థాల నిర్మూలనపై అత్యంత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని నిబంధనల ప్రకారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించిన గంజాయిని ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. కొంతమంది అక్రమార్జ న కోసం గంజాయి సాగు, సరఫరా,రవాణా, విక్రయాలు నిర్వహిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల యువతను మత్తుకు బానిసలుగా మారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడే వారిని అరికట్టేందుకు స్థానిక పోలీసులు,స్పెషల్ డ్రగ్ కంట్రోల్ టీమ్స్, నార్కోటిక్ విభాగం సిబ్బంది ద్వారా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి,అడిషనల్ డీసీపీ(అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,జైపూర్ ఏసీపీ ఎ.వెంకటేశ్వర్లు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బాబురావు, అనిల్ పాల్గొన్నారు.

## యువకుడిపై ఫోక్సో కేసు నమోదు

**ధారూర్ :** మండల పరిధిలోని కెరెల్లీ గ్రామానికి చెందిన సాయికుమార్ (27)పై ఒక మైనర్ అమ్మా యిని ప్రేమ పేరిట ఓ గుడిలో వివాహం చేసుకు న్నాడని, గతంలో కూడా ఈ అమ్మాయి పై అఘా యిత్యం చేశాడని అమ్మాయి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు ఫోక్సో కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలు

**అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జనం సాక్షి);** రాజన్న సిరిసిల్ల జిల్లా బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలలో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు.తంగళ్ళపల్లి మండలంలోని బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బుస్ర కౌసర్ 1000 మార్కులకు గాను 985 మార్కులు,బైపీసీ విభాగంలో ఎం.నందిని 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించినందుకు ప్రతిభా పురస్కారం ఒక్కరికి రూ.15 వేల చొప్పున ఇద్దరికి మొత్తం రూ.30వేలు జిల్లా కలెక్టర్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అందజేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్, సంబంధిత పాఠశాలల ఇంచార్జి ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవే లక్ష్యం.. ప్రభుత్వ బడులే భవిష్యత్

- రేకొండ పాఠశాలలో గ్రామస్తులతో... టిఫిన్ బైఠక్ నిర్వహించిన బండి సంజయ్
- రాజకీయాలకు అతీతంగా 'స్వచ్ఛ పాఠశాల'కు సహకరించాలని పిలుపు
- డైనింగ్ హాల్, తరగతి గదుల నిర్మాణానికి రూ.25 లక్షల సాయం హామీ



**చిగురుమామిడి, జూన్ 12 (జనం సాక్షి) :** ఎంపీగా ఎన్నికైన తర్వాత సమాజ సేవకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా శుక్రవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన, 'స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి టిఫిన్ బైఠక్‌లో పాల్గొన్నారు. గ్రామస్తులు, కార్యకర్తలు తమ ఇళ్ల నుంచి తెచ్చుకున్న అల్పాహారంతో సమావేశానికి హాజరుకాగా, బండి సంజయ్ కూడా స్వయంగా తీసుకొచ్చిన టిఫిన్‌ను వారితో పంచుకుని భోజనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిశుభ్రత, విద్యార్థుల సౌకర్యాలపై గ్రామస్తులు, ఉపాధ్యాయులతో చర్చించారు. పేదల చదువుల నిలయాలైన ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, రాజకీయాలకు అతీతంగా పాఠశాలలను శుభ్రంగా ఉంచేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో విద్యార్థులకు డైనింగ్ హాల్ సౌకర్యం లేదని, సమీప ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల కొరత ఉందని ఉపాధ్యాయులు వివరించగా, స్పందించిన కేంద్ర మంత్రి ఉన్నత పాఠశాల డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, ప్రాథమిక పాఠశాల తరగతి గదులు, కుల సంఘాల భవనాల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తొలి విడతగా రూ.10 లక్షలు విడుదల చేస్తానని ప్రకటించారు.

అనంతరం పాఠశాల తరగతి గదులు, డైనింగ్ హాల్‌ను పరిశీలించిన ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించి వారితో ఫొటోలు దిగారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేస్తామని ప్రకటించారు. అలాగే మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలన విజయాలను వివరిస్తున్న పుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి అందజేశారు. కేంద్ర మంత్రి పిలుపు మేరకు మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు టిఫిన్ బైఠక్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అల్లెపు సంపత్, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్యాన్సర్‌పై పోరాటంలో మనోధైర్యమే మహా ఆయుధం

- అందుబాటులోకి యశోద ఆసుపత్రిలో అత్యాధునిక 'హైపర్‌సైట్' టెక్నాలజీ : డాక్టర్ రామకృష్ణ ప్రసాద్
- క్యాన్సర్ కణాలకే ఖచ్చితమైన రేడియేషన్ చికిత్స
- ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిస్థాయి నివారణకు అవకాశం



**కరీంనగర్, జూన్ 12 (జనం సాక్షి);** క్యాన్సర్ మహమ్మారిని జయించడంలో వైద్య చికిత్సతో పాటు రోగిలో ఉండే మనోధైర్యం అత్యంత కీలకమని సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రి ప్రముఖ ఆంకాలజీ నిపుణుడు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా యశోద ఆసుపత్రి రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో అత్యాధునిక 'హైపర్‌సైట్' సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ సాంకేతికత ద్వారా క్యాన్సర్ కణాలు ఉన్న ప్రాంతాన్ని అత్యంత ఖచ్చితత్వంతో గుర్తించి, ఆయా భాగాలకే రేడియేషన్ అందిస్తారని వివరించారు. దీంతో ఆరోగ్యకరమైన కణజాలంపై ప్రభావం చాలా తక్కువగా ఉండటంతో పాటు చికిత్స ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం ఈ అత్యాధునిక యంత్రం దేశంలో మరెక్కడా లేదని, సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో మాత్రమే అందుబాటు లో ఉందని తెలిపారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు యశోద ఆసుపత్రి తరఫున ప్రత్యేక కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 'హైపర్ సైట్' సాంకేతికతతో ఇప్పటికే అనేక మంది క్యాన్సర్ రోగులకు విజయ వంతంగా చికిత్స అందించామని, మంచి ఫలితాలు సాధించామని తెలిపారు. కరీంనగర్ సహా ఉత్తర తెలంగాణ ప్రాంత ప్రజలు ఈ ఆధునిక వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యశోద ఆసుపత్రి ప్రతినిధులు శ్రీకాంత్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వీర్లపల్లిని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తాం

## రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్..



**గోదావరిఖని, జనంసాక్షి :** వీర్లపల్లిని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా శుక్రవారం 21 వ డివిజన్‌లో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ కందుల స్వరూప సతీష్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టూ పరిశ్రమల కారణంగా దుష్ప్రభావం పడడంతో పాటు గతంలో ప్రజా ప్రతినిధుల పట్టించుకోకపోవడంతో వీర్లపల్లి గ్రామం తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. సింగరేణి గనుల ఏర్పాటు, ఎన్‌టిపిసి రైల్వే లైన్ నిర్మాణం, ఆర్‌ఎఫ్‌సిఎల్ పునరుద్దరణ సమయంలో సరైన ప్యాకేజీ ఇవ్వకపోవడంతో వీర్లపల్లికి అన్యాయం జరిగిందని అన్నారు. తాను ప్రయత్నం చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ సహకారం లేక వీర్ల పల్లి గ్రామానికి ఆర్,ఆర్ ప్యాకేజీ అమలుకావడం లేదని అన్నారు. అయినప్పటికీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, జిల్లా మంత్రివర్యుల సహకారంతో వీర్ల పల్లి గ్రామస్తులకు ఇతర ప్రాంతంలో స్థలాలు, ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ 5.00 లక్షల ఆర్థిక సహాయం ఇప్పించడంతో పాటు స్థానికంగా కూడా అన్ని వసతులు కల్పిశేచనున్నామని అన్నారు. మురుగు నీళ్ళు సాఫీగా బయటకు వెళ్ళడానికి సరైన డ్రైనేజ్ వ్యవస్థ కూడా ఏర్పాటు చేయిస్తామని అన్నారు. ప్రవేటు వ్యక్తుల స్థలంలో నుండి కాలువ నిర్మించవలసి ఉన్నందున యజమానికి మరో చోట స్థలం ఇస్తామని అన్నారు. కాగా ఆర్‌ఎఫ్‌సిఎల్ కంపనీ ప్రహరీ ఆనుకొని ఉన్న వీర్లపల్లి గ్రామంతో పాటు ఎల్లంపల్లి గేట్, లక్ష్మీ పురం, చైతన్య పురి కాలనీ తదితర ప్రాంతాలన్నీ దత్తత తీసుకొని సిఎస్ఆర్ కింద పూర్తిగా అభివృద్ధి చేయాలని సంబందిత కంపనీ అధికారులకు ఈ సందర్భంగా ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో భాగంగా ఆర్‌ఎఫ్‌సిఎల్ కారణంగా ఉత్పన్నమవుతున్న పలు సమస్యలను స్థానికులు తన దృష్టికి తీసుకురావడం జరిగిందని వాటిని వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రహరీ అవతల తుప్పలు పొదలు తొలగించి విష సర్పాలు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్లాంట్ శుభ్రం చేసేటప్పుడు నీళ్ళు గోడ అవతల ఉన్న ఇళ్ల లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే గ్రామంలో స్వశక్తి మహిళలకు అవగాహన కల్పించి ఇందిరా మహిళా శక్తి యూనిట్లు ఏర్పాటు చేసుకొని సంఘానికి రూ 30 లక్షల నుండి రూ 3.00 కోట్ల వరకు రుణం ఇప్పించి స్వయం ఉపాధి పొందడానికి మెప్మా ద్వారా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.. కాగా ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న చిన్న చిన్న కాలువలతో పాటు పెద్ద కాలువలో పెరిగిన తుప్పలను తొలగించి నీళ్ళు సాఫీగా ప్రవహించడానికి మార్గం సుగమం చేశారు. స్థానిక స్వశక్తి మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థతో పాటు వివిధ విభాగాల అధికారులు, మెప్మా ఆర్‌పిలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి


- ఇండ్ల పురోగతిని అధికారులు పరిశీలించాలి
- గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం కావాలి
- లబ్ధిదారులు సమస్యలు పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూన్ 12 (జనం సాక్షి);** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌసింగ్,ఎంపీడీఓలు, తహసీల్దార్లు,మున్సిపల్ కమిషనర్లు,ఏఈలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ముందుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై మండలాల వారిగా సమీక్ష చేశారు.జిల్లాలో ఇప్పటిదాకా మొత్తం 7,367 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని వెల్లడించారు.అందులో 5,798 ముగ్గు పోశామని,5,014 ఇండ్లు బేస్మెంట్ లెవెల్లో,4,362 ఇండ్లు గోడల లెవెల్ లో, 4,012 స్లాబ్ లెవెల్ లో, 2,834 ఇండ్లు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు.ముగ్గు పోసిన వారికి ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టించాలని,బేస్మెంట్ వరకు పూర్తి చేసిన వారిని గోడల వరకు,అక్కడి నుంచి స్లాబ్ లెవెల్ కు,తుది దశ పనులు పూర్తి చేసేలా,ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ,పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు.ప్రతి ఎంపీడీఓ ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పరిశీలించాలని,గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం కావాలని మండలానికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లి,ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు.లబ్ధిదారులకు ఇటుకులు ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా,ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు.మేస్త్రీలు,వడ్రంగి ఇతర పని వారి వివరాలు లబ్ధిదారులకు అందుబాటులో పెట్టి ఇబ్బందులు దూరం చేయాలని సూచించారు. లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పనులు వినియోగించుకునేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించిందని,సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీడీఓలు ఆదేశించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల ఫోటోలు ఎప్పటికప్పుడు హౌసింగ్ ఏఈలు ఆన్లైన్ లో అప్ లోడ్ చేయాలని, లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రతి డబ్బు జమ అవుతున్నాయని వెల్లడించారు. ఇండ్ల నిర్మాణాలకు ఎక్కడా ఇసుక కొరత లేదని స్పష్టం చేశారు.ఇట్టి సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా,లోకేష్,ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ

- అవసరమైన ఖర్చు భరిస్తామని హామీ




**హైదరాబాద్, జూన్12 (జనంసాక్షి) :** స్పైనల్ మస్కులర్ అట్రోఫీ టైప్–2తో బాధపడుతున్న బేబీ ఆర్యాంశ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్యాంశ్ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సహాయం అందిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన ఏడాది వయసున్న ఆర్యాంశ్ ప్రాణాలను కాపాడేందుకు ఇంజెక్షన్‌కు రూ.1.5 కోట్లు అవసరం. జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలని, జులై నెలాఖరులోగా చికిత్స పూర్తిచేయాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. దీంతో ప్రజల సహకారంతో ఇప్పటివరకు రూ.75 లక్షలను తల్లిదండ్రులు సేకరించారు. మరో రూ.75 లక్షలు కావాల్సి ఉండగా.. ఆ నిధుల సమీకరణకు ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కావాల్సిన నిధులపై యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదిరెడ్డి పోస్ట్‌కు సీఎం వెంటనే స్పందించారు. 'చిన్నారికి ఉత్తమ చికిత్స అందేలా చేస్తాం. సీఎంఆర్ఎఫ్ అధికారులు.. ఆ చిన్నారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని ఎక్స్‌లో రేవంత్ పోస్ట్ చేశారు. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ అధికారులు తక్షణమే చిన్నారి ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్నారు.

# గంజాయితో పట్టుబడ్డ మోడల్ మిస్ హర్ష సన్నీ

- బ్యాంకాక్ నుంచి ముంబై రాగా పట్టివేత



**ముంబై, జూన్12 (జనంసాక్షి) :** మోడలింగ్ రంగంలో రాణిస్తూ.. కేరళ అందాల పోటీల్లో పాల్గొన్న ఓ యువతి, ఒక్క రాత్రిలో డ్రగ్స్ స్మగ్లర్‌గా మారి జైలుపాలైంది. బ్యాంకాక్ నుంచి ముంబైకి రూ.11.82 కోట్ల విలువైన హై–క్వాలిటీ 'హైడ్రోపోనిక్ గంజాయి'ని స్మగ్లింగ్ చేస్తూ.. మాజీ 'మిసెస్ కేరళ' కంటెస్టెంట్ హర్ష సన్నీ (28) ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులకు అడ్డంగా దొరికిపోయింది. ఎయిర్ ఇండియా విమానం ద్వారా బ్యాంకాక్ నుంచి ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి హర్ష సన్నీ చేరుకుంది. లగేజీ క్లియరెన్స్ సమయంలో ఆమె ప్రవర్తన కాస్త అనుమానాస్పదంగా ఉండటాన్ని ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్, కస్టమ్స్ అధికారులు గమనించారు. ఆమెను పక్కకు పిలిచి, ఆమె వద్ద ఉన్న ట్రావెల్ బ్యాగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ బ్యాగులో ప్యాక్ చేసిన 12 ప్లాస్టిక్ ప్యాకెట్లు కనిపించాయి. వాటిలో పచ్చటి పదార్థం ఉంది. వెంటనే అధికారులు 'ఎన్‌డిపిఎస్' కిట్‌తో కెమికల్ టెస్ట్ చేయగా, అది అత్యంత ఖరీదైన, నాణ్యమైన 'హైడ్రోపోనిక్ మారిజువానా' (గంజాయి) అని తేలింది. సాధారణ గంజాయితో పోలిస్తే ల్యాబ్‌లలో నియంత్రిత వాతావరణంలో పెంచే ఈ హైడ్రోపోనిక్ గంజాయికి మార్కెట్లో విపరీతమైన డిమాండ్, ధర ఉంటుంది. హర్ష సన్నీ వద్ద దొరికిన 11 కిలోల గంజాయి విలువ అంతర్జాతీయ బ్లాక్ మార్కెట్లో సుమారు రూ.11.82 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దీంతో ఆమెపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కోర్టు ఆమెకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

# మామిడిపండ్లు తిని అక్కాచెల్లెళ్ల మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు



**హైదరాబాద్, జూన్12 (జనంసాక్షి) :** మామిడి పండ్లు తిని అక్కాచెల్లెళ్ల మృతి ఘటనపై నారాయణగూడ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మామిడి పండ్లు తిని భువనేశ్వరి(17), సంధ్య(10) తీవ్ర అస్వస్థకు గురై.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదేశాలు జారీ చేశారు. కర్ణాటక బీదర్ వాసులు వైజినాథ్, ఇందుమతి దంపతులు కొన్నాళ్ల క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. ఇందుమతి బంధువు రేణుక ఈనెల జలమండలి వద్ద రెండు కేజీల మామిడి పండ్లను కొనుగోలు చేసింది. ఆ పండ్లను ఇందుమతి, ఆమె నలుగురు కుమార్తెలు తిన్నారు. ఆపై వారంతా వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థకు గురయ్యారు. చికిత్స పొందుతూ అక్కాచెల్లెళ్లు భువనేశ్వరి(17), సంధ్య(10) మృతి చెందగా.. మిగిలిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి మామిడి పండ్లు తొందరగా మగ్గేందుకు వినియోగించే రసాయనాలు కారణమా?... లేక ఇతర పదార్థాల వల్ల జరిగిందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, వైద్యుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ఫుడ్, ఫ్రూట్ నమూనాలను సేకరించిన అధికారులు.. పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. గత నెలలో ఛత్తీస్‌గఢ్ జాంజ్‌గిరి–చంపా జిల్లాలో పుచ్చకాయ తిని 15 ఏళ్ల బాలుడు మరణించగా, మరో ముగ్గురు పిల్లలు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో వరుస ఘటనలతో మామిడి పండ్లు, పుచ్చకాయలు కొనాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో సమగ్ర దర్యాప్తు చేపట్టామని కమిషనర్ సజ్జన్నార్ తెలిపారు.

# సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

- నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు
- హరీష్ రావు లాగా అవినీతి తమకు తెలియదని ఖండన

**సిద్ధిపేట, జూన్12 (జనంసాక్షి) :** సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకు అయినా తాము దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను, మైనార్టీ శాఖ మంత్రిగా అజారుద్దీన్, ఎస్సీ, ఎస్టీ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ ఉన్నామని పేర్కొన్నారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా మంత్రులుగా సంబంధం లేకుండా ప్రిన్సిపాల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు తాము నిర్ణయాధికారం ఇచ్చామని గుర్తు చేశారు. అయితే అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు అవగాహన లేకుండా మాట్లాడి ఆయన.. తన స్థాయిని తగ్గించుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన విధంగా అవినీతి జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పక్షాన చెబుతున్నానని.. సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం అందాలనే ఆలోచన తమకు ఉందని తెలిపారు. అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు. ఈ అవినీతిపై చర్చించేందుకు మీరే డేట్ టైమ్ ఫిక్స్ చేయండి.. చర్చిద్దామంటూ హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. గురుకుల విద్యార్థుల షూస్, యూనిఫాం, బుక్స్ టెండర్‌లో రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీష్ రావు ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాము జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని గుర్తు చేశారు. మొత్తం టెండర్ విలువే రూ.687 కోట్లు అని వివరించారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్ రావు పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. వారు అవినీతి చేసినట్లే తాము చేశామని అనుకుంటున్నారా? అంటూ బీఆర్ఎస్ నేతను మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఏడు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం తాము మంచి ఆలోచన చేస్తే హరీశ్ రావుకు అక్కసు ఎందుకు? అని ప్రశ్నించారు. మీరు గురుకులాలకు ఒక్క కొత్త భవనం అయినా నిర్మించారా?.. ఎస్సీ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ భవనం అయినా కట్టించారా? అని హరీశ్ రావుకు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ హరీశ్ రావుకు స్పష్టం చేశారు.

# ఖమ్మం ఘటన బాధిత బాలికకు ప్రభుత్వం అండగా ఉంటుంది

### నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికను, కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లాలో అత్యాచార యత్నానికి గురై తీవ్ర గాయాలతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క శుక్రవారం పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ఆమెకు ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, సిపిఐ ఫ్లోర్ లీడర్ కునంనేని సాంబశివరావు, సిపిఐ ఎశ్రీఎ నెల్లి కంటి సత్యంతో కలిసి బయట కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు చికిత్స అందిస్తున్న వైద్యుల నుంచి బాలిక ఆరోగ్య పరిస్థితిపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. బాలికకు అత్యుత్తమ వైద్యం అందిస్తున్నామని, వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని నిమ్స్ డైరెక్టర్ మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ, మొదట బాలిక భవనం పై నుంచి కిందపడిన ఘటనగా సమాచారం అందిందని, అయితే స్పృహలోకి వచ్చిన తర్వాత జరిగిన దారుణం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. తాత వయసులో ఉన్న వ్యక్తి ఇంత దుర్మార్గానికి పాల్పడటం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన తెలిసిన వెంటనే ప్రభుత్వం స్పందించి బాలికకు మెరుగైన వైద్యం అందించేందుకు నిమ్స్‌కు తరలించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం అవసరమైన అన్ని వైద్య సేవలు అందిస్తున్నామని, బాలిక పూర్తిగా కోలుకునే వరకు నిమ్స్‌లోనే ఉంచి అత్యుత్తమ చికిత్స అందిస్తామని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయంగా రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అదేవిధంగా మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఇప్పటివరకు రూ.70 వేల తక్షణ సహాయం అందించారు. ఘటన జరిగిన నాటి నుంచి మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. కుటుంబానికి అండగా ఉండేందుకు ఖమ్మం జిల్లా డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విష్ణు వందనను నిమ్స్‌లోనే అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. బాధిత కుటుంబానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి సీతక్క, నిందితుడికి త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చట్టపరంగా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. "ఇలాంటి దుర్మార్గులను ఉపేక్షించబోమని, ఎంతటి రాజకీయ అండ ఉన్నా నిందితుడిని కఠినంగా శిక్షిస్తాం. చిన్నారి ప్రాణాలపై దాడి చేసిన ఈ అమానుష ఘటనకు బాధ్యుడైన వ్యక్తికి చట్టం ప్రకారం అత్యంత కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం' అని మంత్రి స్పష్టం చేశారు.



# ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా కన్నుమూత

- క్రీడారంగానికి తీరని లోటని ప్రధాని సంతాపం



**న్యూఢిల్లీ, జూన్12 (జనంసాక్షి) :** దిగ్గజ షూటర్, ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా (49) కన్నుమూశారు. కొన్ని రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన.. శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. భారత్ స్టార్ షూటర్ మను బాకర్ ఈయన కోచింగ్‌లోనే రాటుదేలిన సంగతి విదితమే. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భాగంగా ఇటీవల జర్మనీ నుంచి భారత్‌కు తిరిగివస్తుండగా రాణా అనారోగ్యానికి గురయ్యారు. విమానం దిగిన వెంటనే ఆయన్ను దిల్లీలోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ధృవీకరించింది. 'జర్మనీలో వరల్డ్‌కప్ సందర్భంగా జస్పాల్‌కు ఛాతినొప్పి, అసౌకర్యం కలిగాయి. ఎసిడిటీగా పొరబడి.. తన పనిలో నిమగ్నమయ్యాడు. అయితే భారత్‌కు వచ్చేటప్పుడు మళ్లీ అసౌకర్యానికి గురయ్యాడు. దాంతో ఆసుపత్రిలో చేరాడు' అంటూ జస్పాల్ సోదరుడు సుభాష్ వెల్లడించారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలు గెలిచిన మను బాకర్‌కు రాణా వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరించారు. 2006 ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణాలు గెలిచిన జస్పాల్.. గతంలో జాతీయ జూనియర్ కోచ్‌గా వ్యవహరించారు. అప్పుడే మను బాకర్, సౌరభ్ చౌదరి లాంటి ప్రతిభావంతులైన షూటర్లు వెలుగులోకి వచ్చారు. ఒలింపిక్స్ విజయాల అనంతరం ఆయన గత ఏడాది ఫిబ్రవరిలో జాతీయ కోచ్‌గా నియమితులయ్యారు. 25 మీటర్ల పిస్టల్ విభాగంలో హై పర్ఫార్మెన్స్ కోచ్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. జస్పాల్ రాణా మృతిపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఆయన మరణం భారత క్రీడా ప్రపంచానికి తీరనిలోటన్నారు. షూటింగ్‌లో ఆయన సాధించిన విజయాలతో దేశానికి ఎంతో పేరు తీసుకువచ్చారు. యువ అథ్లెట్లను తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నిబద్ధత ఎనలేనిది. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబం, ఆత్మీయులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

# స్కూలు డ్రెస్సుల కుంభకోణం

- వివరాలు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

**హైదరాబాద్, జూన్12 (జనంసాక్షి) :** స్కూల్ డ్రెస్సులను కూడా మహిళా సంఘాలకు అప్పగిస్తామని గతంలో సిఎం ప్రకటించినట్లు సమాచారం. వారికి ఈ పని అప్పగిస్తే మరింత మంచి ఫలితం వస్తుందని చాలామంది అభిప్రాయ పడుతున్నారు. ఈ కాంట్రాక్టును గుజరాత్ కంపెనీకి అప్పగించారని విపక్ష నేత హరీష్ రావు చేసిన ఆరోపణలపై నిజాలు వెలుగు చూడాల్సి ఉంది. గుజరాత్ కాంట్రాక్టర్ల పేరుతో విద్యాశాఖలో రూ.2000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కాంట్రాక్టులు, కమిషన్ల కోసమే పాఠశాలల పునఃప్రారంభం వాయిదా వేశారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్స్ కుట్టే బాధ్యత చేనేత కార్మికులకు, షూ, బెల్టుల తయారీ దళిత కుటుంబాలు బతకాలని లిడ్‌క్యాప్‌కు ఇచ్చామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం వాటిని సెంట్రలైజ్ చేసి.. గుజరాత్ కాంట్రాక్టర్‌కు అప్పగించారని మండిపడ్డారు. ఆ గుజరాత్ కాంట్రాక్టర్ నుంచి ఇంతవరకు బట్టలు రాలేదని, 7 లక్షల మంది గురుకుల విద్యార్థులకు ఇవ్వాల్సిన బ్యాగులు, డ్రెస్సులు, బెల్టులు, పుస్తకాలు ఏవీ అందలేదన్నారు.

# ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ వివక్ష

- హెల్త్ కార్డులు ఇవ్వకుండా రాజకీయం
- మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాసగౌడ్



**హైదరాబాద్, జూన్12 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఉద్యోగులకు తక్కువ చేసి చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి .దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్ల తెలంగాణలో 10 నుంచి 15 లక్షల కుటుంబాల ఉద్యోగులు, పెన్షన్ దారులు ఆందోళనలో ఉన్నారని ఆరోపించారు. హెల్త్ కార్డ్స్ ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుందని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర యేండ్లలో ఇంతవరకు ఉద్యోగులకు, పెన్షన్ దారులకు హెల్త్ కార్డ్స్ ఇవ్వలేదని ఆరోపించారు.కాంట్రాక్టు ఉద్యోగులకు సకాలంలో జీతాలు రావడం లేదని అన్నారు.హెల్త్ కార్డ్స్ ఇష్యూపై కమిటీ వేశారే తప్పా హెల్త్ కార్డ్స్ మాత్రం ఇవ్వడం లేదని పేర్కొన్నారు.కమిటీ ముఖ్యమంత్రి మాట వినడం లేదా? ముఖ్యమంత్రి మాట కమిటీ వినడం లేదా అర్థం కావడం లేదని విమర్శించారు. పీఆర్సీ 6 నెలల్లో క్లియర్ చేస్తామని చెప్పి ఇంతవరకు ఆ ఊసే లేదని అన్నారు.బీఆర్ఎస్ హయంలో ఉద్యోగులను కాపాడుకున్నా మని వెల్లడించారు. ఒక్కో ఉద్యోగి నుంచి నెలకు 2 వేల నుంచి 3 వేల వరకు డబ్బులు కట్ అవుతున్నాయి. ఉద్యోగి జీతం నుంచి డబ్బులు కట్ చేయమని ఈ ప్రభుత్వానికి చెప్పింది ఎవరని ప్రశ్నించారు. ఉద్యోగులను తక్కువ చేసి చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆరోగ్యం విషయంలో ఉద్యోగులు చనిపోతే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జూన్ 1 నుంచి హెల్త్ కార్డ్స్ ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని విమర్శించారు. హెల్త్ కార్డ్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తుందని దేవి ప్రసాద్ అన్నారు. ద్యోగి సమ్మతి లేకుండా జీతం కట్ చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వినిపించుకోవడం లేదని తెలిపారు. కేసీఆర్ పరిపాలనలో అంగన్‌వాడీ వర్కర్స్ కు ఏ రాష్ట్రంలో లేని విధంగా జీతాలు ఇచ్చారని గుర్తు చేశారు.

# ప్రజలు ఆమోదిస్తేనే పొలిటికల్ ఎంట్రీ

- నటుడు రాఘవ లారెన్స్ పోస్ట్

**చెన్నై, జూన్12 (జనంసాక్షి) :** ప్రముఖ నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తన రాజకీయ ప్రవేశంపై మరోమారు స్పష్టత ఇచ్చారు. ప్రజలు ఆమోదిస్తేనే తాను రాజకీయాల్లోకి వస్తానని స్పష్టం చేశారు. ప్రజలు కాదంటే రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. శుక్రవారం తన ఎక్స్ ఖాతాలో రాఘవ లారెన్స్ ఓ వీడియో పోస్టు చేశారు. ఆ వీడియోలో తన రాజకీయ భవిష్యత్ గురించి వివరించి చెప్పారు.

# అహ్మదాబాద్ ఎయిరిండియా ఘటనకు ఏడాది

- దుర్ఘటనపై దర్యాప్తు పురోగతిలో ఉంది
- ప్రమాదంపై ఇంకా దుష్ప్రచారాలు చేయడం తగదు
- కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ, జూన్12 (జనంసాక్షి) :** అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ ఘటన జరిగి నేటికి ఏడాది అయింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి స్పందించారు. ఈ దుర్ఘటనకు సంబంధించి తప్పుడు ప్రచారాలు చేయొద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. విమాన ప్రమాదంపై జాతీయ, అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కృషి చేస్తోందన్నారు. ప్రమాదంపై త్వరలో తుది నివేదిక వస్తుందని.. దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విమానయాన భద్రతను మరింత మెరుగుపరిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అంతర్జాతీయ సమీక్షలు, సంప్రదింపు ప్రక్రియలు పూర్తయిన తర్వాత విమాన ప్రమాదంపై తుది నివేదిక విడుదల చేస్తామని ఈ దుర్ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏబీఐ) వెల్లడించింది. ప్రమాదానికి అసలు కారణం తెలుసుకొనేందుకు ఫ్లైట్ రికార్డర్ డేటా, ఇంజిన్ భాగాలు, ఇతర ఆధారాలను విశ్లేషిస్తున్నామని తెలిపింది. ఇప్పటివరకు దర్యాప్తులో గణనీయమైన పురోగతి సాధించామని.. అందులో కనుగొన్న విషయాలను నిర్ధరించుకొనేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొంది. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ విషాదానికి గురిచేసిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో విశ్వాస్ కుమార్ అనే వ్యక్తి మాత్రమే ప్రాణాతో బయటపడ్డారు. విమానం హాస్టల్ భవనంపై కూలడంతో మృతుల సంఖ్య 260కి చేరింది. బాధిత కుటుంబాలకు టాటాగ్రూప్ నష్ట పరిహారం చెల్లించింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇదిలావుంటే ఆ విమానం కూలిన హాస్టల్ భవనం స్థానంలో రూ.547 కోట్లతో మెడికల్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు గుజరాత్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర మంత్రి ప్రఫుల్ పన్సేరియా వెల్లడించారు. వైద్య విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించేందుకు దీనిని ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. 15 బాధిత కుటుంబాలు తమ ఆత్మీయుల వ్యక్తిగత వస్తువులను స్వీకరించడానికి నిరాకరించా యని ఎయిరిండియా మాతృ సంస్థ టాటా గ్రూప్ శుక్రవారం వెల్లడించింది. 91 శాతం కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహార చెల్లింపును పూర్తిచేశామని తెలిపింది. పత్రాలు సరిగా లేని, పరిహార స్వీకరణకు నిరాకరించిన కేసుల్లో పరిహార చెల్లింపు ప్రక్రియ పూర్తికాలేదని చెప్పారు. 96 శాతం బాధిత కుటుంబాలకు మధ్యంతర పరిహారం కింద రూ.25 లక్షలు అందించామని పేర్కొంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370